సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 5.00

సంపుటి: 13 సంచిక: 19

శనివారం 11-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'




**కరోనాకు 'హెచ్‌సీక్యూ-ఐజీ'**

ఈ మందుతో ఫ్రాన్స్‌లో 1,061 మంది పేషెంట్లపై అధ్యయనం -8లో



**చమురు ఉత్పత్తి కోతకు డీల్**

క్రూడ్ ఉత్పత్తి దేశాల అంగీకారం. రోజుకు 10 మిలియన్ బ్యారెల్లు కట్ -బిజినెస్‌లో

# లక్ష మరణాలు




ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ కరాళ నృత్యం చేస్తోంది. మానవళిపై తన ప్రతాపాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఈ వ్యాధి బారిన పడి మరణించిన వారి సంఖ్య శుక్రవారానికి అక్షరాలా లక్ష దాటింది. కరోనా బారినపడి యూరప్, అమెరికా విలవిలలాడుతున్నాయి. ఇటలీలో అత్యధిక మరణాలు సంభవించగా అమెరికాలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకూ 177 దేశాల్లో పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. యెమెన్‌లో తొలి కరోనా కేసు నమోదైంది. కరోనాపై పోరులో ప్రపంచ దేశాలు లాక్‌డౌన్ పాటిస్తున్నా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

8లో

16,77,664
ప్రపంచవ్యాప్తంగా మొత్తం కేసులు

1,01,597
ప్రపంచవ్యాప్తంగా మొత్తం మరణాలు

| అమెరికా | | భారత | |
|---|---|---|---|
| మొత్తం కేసులు | 4,89,646 | మొత్తం కేసులు | 6,761 |
| మొత్తం మరణాలు | 18,034 | మొత్తం మరణాలు | 206 |




సికింద్రాబాద్ ప్రాంతంలోని ఓ కంటైన్మెంట్ క్లస్టర్‌ను ఇలా దిగ్బంధించారు

# అన్ని దారులూ బంద్

## 130 కరోనా హాట్‌స్పాట్‌లలో 14.40 లక్షల మంది క్వారంటైన్

**14 రోజులపాటు ప్రజలు బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు**

**ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఇళ్లకే నిత్యావసరాల సరఫరా**

**కొన్ని ప్రాంతాల్లో డ్రోన్లతో పోలీసుల నిఘా**

**2.88 లక్షల ఇళ్లలో వైద్య బృందాల సర్వే**

**కరోనా లక్షణాలున్న వ్యక్తులు ఆస్పత్రులకు తరలింపు**

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో హాట్‌స్పాట్ (కంటైన్మెంట్) ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలు గృహ నిర్బంధంలో ఉండిపోయారు. వారిని ప్రభుత్వం పూర్తిగా హోం క్వారంటైన్‌కు పరిమితం చేసింది. తెలంగాణలో వివిధ జిల్లాల్లో రోజురోజుకూ కరోనా కేసులు పెరుగుతుండటంతో ప్రభుత్వం 130 హాట్‌స్పాట్లను ప్రకటించింది. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో నిర్ణీత ప్రదేశం మేరకు పూర్తిగా అష్టదిగ్బంధం చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి ఎవరూ ఎటూ వెళ్లకుండా చర్యలు చేపట్టింది. అక్కడున్న ప్రజలకు అవసరమైన పాలు, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను కూడా ప్రభుత్వ యంత్రాంగమే సమకూరుస్తోంది. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో కొన్నిచోట్ల డ్రోన్లను వినియోగిస్తూ పోలీసులు పహారా కాస్తున్నారు. వైద్య బృందాలు ఇళ్లకు వెళ్లి జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలున్న వారిని గుర్తించి ఆస్పత్రులకు తరలిస్తున్నాయి.

**కేసులు ఎక్కువ ప్రాంతాల్లో...**

రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనా కేసులు 27 జిల్లాలకు విస్తరించగా అందులో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, గద్వాల, కరీంనగర్, నిర్మల్, వరంగల్ అర్బన్ జిల్లాల్లో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తుల ద్వారా వైరస్ వ్యాప్తి తక్కువగానే నమోదైనప్పటికీ ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారు, వారి కుటుంబీకుల ద్వారా అత్యధిక కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేసులు ఎక్కడెక్కడ అత్యధికంగా పెరిగాయో ఆయా ప్రాంతాలను ప్రభుత్వం హాట్‌స్పాట్లుగా గుర్తించింది. కనీసం రెండు, మూడు కేసులు మొదలుకొని గరిష్టంగా ఐదు కేసులు నమోదైన ప్రాంతాలను ఒక్కో హాట్‌స్పాట్‌గా పరిగణించింది. అలా రాష్ట్రంలో 130 హాట్‌స్పాట్లను గుర్తించినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. లాక్‌డౌన్ అమలులో కనీసం ఏదైనా అవసరానికి బయటకు వెళ్లడానికి వీలుండగా హాట్‌స్పాట్ ప్రాంత ప్రజలు ఎటూ వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో మొత్తం 2.88 లక్షల ఇళ్లను గుర్తించారు. ఒక్కో ఇంట్లో

మిగతా 2వ పేజీలో ▶

# 30 వరకు లాక్‌డౌన్?

**నేడు కేబినెట్ భేటీ అనంతరం సీఎం ప్రకటించే చాన్స్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరుగుతుంది. కరోనా వైరస్ వ్యాప్తి, దాని వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. కరోనా వ్యాప్తిని నిరోధించడానికి అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను పొడిగించే అంశంపై ప్రధానంగా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. సమావేశం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు ప్రకటన చేసే అవకాశముంది. ఏప్రిల్ 14తో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ ముగియనుండగా, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరో రెండు వారాలు పొడిగించే అవకాశముంది. ఏప్రిల్ 30 వరకు లాక్‌డౌన్ పొడిగిస్తున్నట్టు ఈ సమావేశం అనంతరం సీఎం ప్రకటిస్తారని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రివర్గ భేటీలో ఆర్థిక పరిస్థితులు – భవిష్యత్ వ్యూహ రూపకల్పన, రాష్ట్రంలోని పేదలు – ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులకు అందుతున్న సాయం, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, వడగండ్ల వాన నష్టం తదితర అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.



## సీఎంలతో నేడు ప్రధాని చర్చలు

- సమావేశం అనంతరమే లాక్‌డౌన్‌పై మోదీ తుది నిర్ణయం

- వివరాలు 8లో

# 487కు కరోనా కేసులు

- రాష్ట్రంలో కొత్తగా 16 పాజిటివ్
- రాజన్న సిరిసిల్ల జిల్లాకూ పాకిన మహమ్మారి.. మొత్తంగా 27 జిల్లాల్లో వైరస్ వ్యాప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 487కు చేరుకుంది. శుక్రవారం కొత్తగా 16 పాజిటివ్ కేసులు నమోదైనట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన బులెటిన్ విడుదల చేశారు. గత రెండ్రోజులుగా తక్కువ పాజిటివ్ కేసులు నమోదు కావడం ఊరట కలిగిస్తోంది. అయితే సిరిసిల్ల జిల్లాలో మొదటిసారిగా ఒక పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో రాష్ట్రంలో 27 జిల్లాల్లోనూ కరోనా వ్యాపించినట్లైంది. ఇక ఒక్క హైదరాబాద్‌లోనే శుక్రవారం 12 కేసులు అదనంగా

మిగతా 2వ పేజీలో ▶

# ఏపీలో మరో 18

**381కి కరోనా పాజిటివ్ కేసులు**

సాక్షి, అమరావతి: ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 381కి చేరింది. గురువారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం రాత్రి 8 గంటల వరకు కొత్తగా 18 కేసులు నమోదయ్యాయి. గుంటూరులో 7, తూర్పు గోదావరిలో 5, కర్నూలు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో రెండేసి కేసుల వంతున వెలుగులోకి వచ్చాయి. దీంతో కర్నూలు జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 77కు చేరగా గుంటూరు జిల్లాలో 58కి పెరిగాయి. కరోనా పాజిటివ్‌గా నిర్ధారించిన బాధితుల నివాస ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించి కట్టుదిట్టమైన ఆంక్షలు అమలుచేస్తున్నారు. వారితో సన్నిహితంగా ఉన్నవారందరినీ గుర్తించి క్వారంటైన్‌కు తరలిస్తున్నారు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారించిన వారు నివసిస్తున్న ప్రాంతాలను వైద్య,ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు ప్రకటిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 365 యాక్టివ్ కరోనా పాజిటివ్ కేసులున్నాయి.

# గడప దాటాలంటే మాస్క్ ఉండాల్సిందే!

**అత్యవసర పనులపై బయటికెళ్లే ప్రతి ఒక్కరూ మాస్క్ పెట్టుకోవాల్సిందే..**

- కరోనా బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం
- మాస్క్ ధారణ, తొలగింపు, వాటి భద్రత చర్యలపై ఉత్తర్వులు జారీ
- నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కరోనా వ్యాప్తిని నిలువరించేందుకు ప్రతి ఒక్కరూ మాస్కు తప్పనిసరిగా ధరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ఇదివరకు కరోనా లక్షణాలు ఉన్నవారు, అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడేవారు, రోగులకు సేవలందించే వారు మాత్రమే మాస్కులు ధరించాలనే నిబంధన ఉండేది. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. మాస్కులు ధరించే తీరు, జాగ్రత్త చర్యలకు సంబంధించి ఆదేశాలు జారీ చేసింది. వైద్య, ఆరోగ్య శాఖ చేసిన సూచనలు, ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది.

**అడుగు బయట పెడితే మాస్క్..**



ఇంట్లో నుంచి అడుగు బయట పెడితే మాస్క్ తప్పనిసరిగా ధరించాల్సిందే. ఇతరులతో మాట్లాడాల్సిన సమయంలోనూ మాస్కు వేసుకోవాల్సిందే. జపాన్‌లో మాస్కుల ధారణతో కరోనా వ్యాప్తి కట్టడిలోకి వచ్చిందనే అధ్యయనం ఆధారంగా రాష్ట్రంలో కూడా ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడంలో మాస్కులు క్రియాశీలకంగా పనిచేస్తాయని అధికారులు భావిస్తున్నారు. తుమ్మడం, దగ్గడం, మాట్లాడుతున్నప్పుడు తుంపర్లు రావడం వంటి కారణాలతో కరోనా వ్యాప్తి జరుగుతుంది. అదే మాస్కులు ధరిస్తే ఈ వ్యాప్తికి తగ్గించొచ్చు. మాస్కులు

మిగతా 2వ పేజీలో ▶




సూచించిన నేటి గ్రుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు


## ఇదండీ సంగతి



# వాంటెడ్.. నైటింగేల్స్!

## ప్రపంచవ్యాప్తంగా 59 లక్షల మంది నర్సుల కొరత..



**2.8 కోట్లు** ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న నర్సుల సంఖ్య

**47 లక్షలు** గత ఆరేళ్లలో కొత్తగా చేరినవారు

**17 %** మరో పదేళ్లలో రిటైర్ కానున్న నర్సులు

- 90% నర్సులు మహిళలే.. కానీ కీలక స్థానాల్లో పురుషులు
- ఆగ్నేయాసియా, ఆఫ్రికా, తూర్పు మధ్యధరా దేశాల్లో తీవ్ర కొరత
- ది స్టేట్ ఆఫ్ ద వరల్డ్స్ నర్సింగ్–2020 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ ప్రపంచ మానవాళిని గడగడలాడిస్తోంది. ఈ నేపథ్యంలోనే వైద్యరంగంలోని సదుపాయాలు, అనుకూలతలు, ప్రతికూలతలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. అంతేకాదు.. ఈ ఆపత్కాలంలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందిస్తోన్న వైద్య సిబ్బందికి గుర్తింపూ వస్తోంది. ఇది ఒక్క మన దేశంలోనే కాదు.. భూమి మీద మనిషి మనుగడ ఉన్న ప్రతి దేశం వైద్య రంగానికి సెల్యూట్ చేస్తోంది. ఏ దేశంలో ఏం జరుగుతుంది.. ఎక్కడి వైద్య సిబ్బంది ఎలా పని చేస్తున్నారు.. ఆయా దేశాల్లో వైద్యులు తగినంత మంది ఉన్నారా.. వారికి సహాయకంగా ఉండే నర్సులు (మిడ్‌వైఫరీ) చాలినంత మంది ఉన్నారా? వైద్య పరికరాలున్నాయా..? విస్తృత పరిశోధనలకు అవకాశముందా? తగినన్ని ఆర్థిక, వైద్య వనరులున్న దేశాలేమిటీ... ఇలా చెప్పుకుంటూ పోతే వైద్యానికి సంబంధించిన ప్రతి చిన్న అంశమూ ఇప్పుడు చర్చనీయాంశమే. ఆ కోవలోకే వస్తుంది 'ది స్టేట్ ఆఫ్ ద వరల్డ్స్ నర్సింగ్–2020'నివేదిక. ప్రపంచంలో నర్సుల కొరత తీవ్రంగా ఉందని, రానున్న పదేళ్లలో ఇది చాలా తీవ్రతరమవుతుందని, భవిష్యత్తులో కరోనా లాంటి మహమ్మారులను ఎదుర్కోవాలంటే 'నైటింగేల్స్' కొరత ఉండొద్దని చెబుతోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ (ఐసీఎన్), నర్సింగ్ నౌలు సంయుక్తంగా రూపొందించిన నివేదిక. ప్రతి యేటా ప్రతి దేశంలో 8 శాతం మంది నర్సులు పెరగాల్సిన ఆవశ్యకతను కూడా వివరిస్తోన్న ఈ రిపోర్ట్‌లోని ముఖ్యాంశాలు:

- ప్రపంచంలోని మొత్తం వైద్య సిబ్బందిలో సంఖ్యాపరంగా చూస్తే సగానికి పైగా నర్సులే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చే అంటు వ్యాధులు, మహమ్మారులను పారదోలడంలో వీరిదే కీలకపాత్ర. ప్రపంచంలోని అన్ని

మిగతా 2వ పేజీలో ▶

# ఏపీ ఈసీగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి

**పదవీకాలం 5 నుంచి 3 ఏళ్లకు కుదింపు**

**పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో ఆర్డినెన్స్**

3లో

# మీ నిస్వార్థ సేవలకు సెల్యూట్

- పారిశుధ్య సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల సేవలు మరువలేనివి
- కలెక్టర్లు, కోవిడ్ ఆస్పత్రుల వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం జగన్

epaper.sakshi.com

# ఇదిగిదిగో కరోనా వచ్చేదిలా..

కరోనా వైరస్ కణాలు కణ త్వచం గుండా లోపలకి ప్రవేశిస్తాయి




వైరస్ కణంలోకి ప్రవేశించిన తర్వాత కణ ద్రవ్యంలో వృద్ధి చెందడం ప్రారంభమవుతుంది




ఇప్పుడు ప్రజలకు కలల్లోనూ కరోనా కలవరమే.. అంతగా భయపెట్టేస్తోంది వైరస్.. ఇంతకీ కరోనా వైరస్ మన కణాలకు ఎలా సోకుతుందో తెలుసా.. బ్రెజిల్‌కు చెందిన పలువురు పరిశోధకులు ప్రపంచంలోనే తొలి సారిగా అధిక తీక్షణత కలిగిన ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ సాయంతో దీన్ని ఫొటోలు తీశారు. వైరస్ ఎలా సోకుతుంది.. ఎలా శరీరంలో రెట్టింపు అవుతుందనే విషయాలను తెలుసుకునేందుకు బ్రెజిల్‌లోని ఒస్వాల్డో క్రూజ్ ఫౌండేషన్ కు చెందిన నిపుణులు పరిశోధనలు జరిపారు. ఈ మైక్రోస్కోప్ సాయంతో ఏదైనా కణాన్ని ఉన్న పరిమాణం కన్నా దాదాపు 20 లక్షల రెట్లు పెద్దగా చూడొచ్చు. శరీరంలోకి వెళ్లిన వైరస్ కణాలు మొట్టమొదటగా.. కణ త్వచాన్ని టార్గెట్ చేస్తాయి. కణ త్వచం గుండా కణంలోకి ప్రవేశిస్తుంది. కణంలోకి వెళ్లీ వెళ్లగానే కణంలోని కేంద్రక త్వచం వద్దకు చేరుకుంటుంది. అంటే ఈ సమయంలోనే మనం ఈ వైరస్ ఇన్ఫెక్షన్ బారిన పడతామన్నమాట. ఆ తర్వాత కణంలో ఉన్న కణ ద్రవ్యంలో వైరస్ వృద్ధి చెందడం ప్రారంభం అవుతుంది. ఈ కణ ద్రవ్యంలోనే వైరస్ తన జన్యువులను అభివృద్ధి చేసుకుంటూ.. వేరే కణాలకు సోకుతూ వెళుతుంది.

సాక్షి సెంట్రల్ డెస్క్

## భద్రం బీకేర్‌ఫుల్ బ్రదరూ..



సూపర్‌మార్కెట్లు ఎలా ఉంటాయో తెలుసు కదా.. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలాంటి మార్కెట్లలో కరోనా వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుంది అన్నదానిపై ఫిన్లాండ్ శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు నిర్వహించారు. దానికి సంబంధించిన 3డీ మోడల్‌ను విడుదల చేశారు. అవే ఈ చిత్రాలు.. ఓ సూపర్‌మార్కెట్లో కరోనా రోగి తుమ్మాడే అనుకోండి.. లేదా దగ్గాడే అనుకోండి.. ఇలా వైరస్ మేఘం లాంటిది ఒకటి గాలిలో కొన్ని నిమిషాలపాటు ఉంటుందని.. అతడు దగ్గిన చోటే కాదు..ఆ పక్కనున్న రెండు లేయర్ల వరకూ అది వ్యాప్తి చెందుతుందని తెలిపారు.



# గడప దాటాలంటే మాస్కు ఉండాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో లేనప్పుడు చేతి రుమాలును రెండు వరుసలుగా చేసి కట్టుకోవాలి. మాస్క్ ధరించడం, భౌతిక దూరాన్ని పాటించే అంశాలపై జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు.

**ఈ సూచనలు తప్పనిసరి..**

- మాస్క్ ధారణ విషయంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ పలు రకాల సూచనలు చేసింది. మాస్కు కట్టు కుంటే చెవి, ముక్కు, చెంపలు పూర్తిగా కవర్ అయ్యేలా ఉండాలి. ముఖానికి మాస్కుకు మధ్యలో అంతరం ఉండకూడదు. చేతి రుమాలును వినియోగించే వారు రెండు వరుసలుగా మడత పెట్టి ముఖానికి కింది భాగం కవర్ అయ్యేలా కట్టుకోవాలి.
- ప్రభుత్వ కార్యాలయాలు, అత్యవసర సేవలందించే సంస్థల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో, విధులు నిర్వహించి, ఇంటికి చేరుకునే వరకు కూడా మాస్కులు ధరించాలి.



- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారంతా ఈ మాస్కులను ఇంటినుంచి బయట అడుగు పెట్టేటప్పుడు కచ్చితంగా ధరించాలి. మాస్క్ ధరించడమంటే మెడలో వేసుకోకుండా తప్పకుండా ముఖానికి నిర్దేశించినట్లుగా కట్టుకోవాలి.
- మాస్క్ పెట్టుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో/ శానిటైజర్/ హ్యాండ్ వాష్‌తో కడుక్కోవాలి. ప్రతిరోజూ శుభ్రపర్చిన/ కొత్త మాస్కు ధరించాలి. ఒకసారి వినియోగించిన మాస్కు మరుసటి రోజు అలా గే వాడొద్దు. మాస్కును ఒకరోజు ఒక వైపు, మరో రోజు మరో వైపు పెట్టుకోవద్దు. డిస్పోజబుల్ మాస్కులు కాకుండా బట్టతో తయారు చేసిన రీ యూజబుల్ మాస్కులు ధరిస్తే మంచిది. డిస్పోజబుల్ మాస్కులను ప్రతి ఆరుగంటల తర్వాత తప్పనిసరిగా తొలగించాలి. ముందువైపు పట్టుకోకుండా తొలగించి మూత ఉన్న చెత్త బుట్టలో వేయాలి.
- మాస్క్ తొలగించిన వెంటనే శానిటైజర్/సబ్బుతో చేతులు శుభ్రపర్చుకోవాలి. రీ యూజబుల్ మాస్కులను తొలగించిన వెంటనే సబ్బు నీళ్ల లేదా వేడి నీళ్ల ఉన్న దాంట్లో వేయాలి. అనంతరం దాన్ని సబ్బు లేదా డెటాల్, సావలాన్ ద్రావణాలతో వేడి నీళ్లలో 15 నిమిషాల పాటు ఉంచి శుభ్రపర్చాలి. అనంతరం 5 గంటల పాటు ఎండలో ఆరబెట్టాలి. లేదా ఇస్త్రీ పెట్టెతో 5 నిమిషాల పాటు ఆరబెట్టాలి. శుభ్రపర్చిన మాస్కును పొడిగా ఉన్న చోట జాగ్రత్తపర్చాలి.
- మాస్కును ధరించడంతో పాటు భౌతిక దూరాన్ని పాటిస్తూ పరిశుభ్రమైన పరిసరాల్లో ఉండాలి. మనిషికి మనిషికి దూరం కనీసం రెండు మీటర్లు ఉండేలా జాగ్రత్తపడాలి. అదేవిధంగా తరచుగా చేతులతో ముఖాన్ని తాకడాన్ని మానుకోవాలి.

## కరోనా లక్షణాలతో వ్యక్తి అనుమానాస్పద మృతి

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): హైదరాబాద్ నారాయణగూడలోని వైఎంసీఏ సమీపంలో శుక్రవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని జేబులో దొరికిన డాక్టర్ల ప్రిస్కిప్షన్ల ప్రకారం అతనికి కరోనా లక్షణాలున్నట్లు తేలింది. వివరాలివి.. నేపాల్‌కు చెందిన షర్వద్ బహదూర్ (77) హైదరాబాద్ లాలాపేటలోని ఓ వైన్స్ షాపులో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా దగ్గు వస్తుండటంతో అక్కడి దగ్గరలోని పీహెచ్‌సీ సెంటర్‌కు వెళ్లగా అక్కడి వైద్యులు అతడిని కింగ్‌కోఠి ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ నెల 9న మధ్యాహ్నం కింగ్‌కోఠి ఆస్పత్రికి వెళ్లిన బహదూర్‌ను అక్కడి వైద్యులు 60 సంవత్సరాల పైబడిన వారికి ఈ ఆస్పత్రిలో ఓపీ లేదని, కరోనా లక్షణాలు కూడా ఉన్నాయని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే ఏమైందో తెలియదుగానీ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నారాయణగూడలోని వైఎంసీఏ సమీపంలో అతను శవమై కనిపించాడు. డయల్–100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతని జేబులో వైద్యులు రాసిన ప్రిస్కిప్షన్ లభించింది. దాని ఆధారంగా అతడికి కరోనా లక్షణాలు ఉన్నట్లు, కింగ్‌కోఠి వైద్యులు అతడిని గాంధీకి రిఫర్ చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు జీహెచ్‌ఎంసీకి సమాచారమిచ్చారు. జీహెచ్‌ఎంసీ కరోనా టీం మృతదేహం దగ్గరకు రాని కారణంగా మృతదేహాన్ని సంఘటనాస్థలంలోనే ఓ అంబులెన్సులో ఉంచారు. శనివారం మహాప్రస్థానానికి తరలించే అవకాశమున్నట్లు సమాచారం.

# నగదు బదిలీ షురూ

- తెల్ల రేషన్ కార్డున్న ప్రతి కుటుంబానికీ రూ.1,500
- రేషన్ షాప్‌ల వద్ద నియంత్రిత పద్ధతి పాటించాలన్న ముఖ్యమంత్రి
- లాక్‌డౌన్‌ను ఇదే స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- అధికారులతో సీఎం సమీక్ష..



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చెప్పిన దాని ప్రకారం తెల్ల రేషన్ కార్డున్న ప్రతీ కుటుంబానికి రూ.1,500 చొప్పున నగదును బ్యాంకు అకౌంటులో వేసే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అందరికీ డబ్బులు చేరతాయి..'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. 'రేషన్ షాపుల ద్వారా నియంత్రిత పద్ధతిలో జరుగుతున్న ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి. చెప్పిన సమయానికి వచ్చి, సామాజిక దూరం పాటించి బియ్యం పొందాలి'అని ఆయన పిలుపునిచ్చారు. కరోనా వైరస్ సోకిన వారికి అందుతున్న చికిత్స, లాక్‌డౌన్ అమలు, వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. కరోనా వైరస్ లక్షణాలున్న వారికి పరీక్షలు జరుపుతున్నామని, శుక్రవారం కొత్తగా 16 మందికి పాజిటివ్ వచ్చిందని, వారికి చికిత్స అందిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. వారి కుటుంబసభ్యులు, వారు కలసిన వారిని కూడా గుర్తించి క్వారం టైన్ చేసినట్లు తెలిపారు. పాజిటివ్ కేసులు ఎక్కువైనప్పటికీ అందరికీ చికిత్స చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కరోనా వ్యాప్తి ని నిరోధించడానికి అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను ఇదే స్ఫూర్తితో కొనసాగించాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను కోరారు. కరోనా వైరస్ సోకిన వారిని గుర్తించి చికిత్స అందించడం, వారు కలసిన వారిని గుర్తించి క్వారం టైన్ చేయడం క్రమం తప్పకుండా చేస్తున్నామని వెల్లడించారు. లాక్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ నిత్యావసరాలకు కొరత రాకుండా చూడాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వరి కోతలు, ధాన్యం ఇతర పంటల కొను గోళ్లు యథావిధిగా జరపాలని చెప్పారు. ఇక శనివారం ప్రధాని నరేంద్ర మోదీతో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించాల్సిన అంశాలు, మధ్యాహ్నం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చకు పెట్టాల్సిన అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్‌రావు, రామకృష్ణ రావు తదితరులు ఇందులో పాల్గొన్నారు.

### సమీక్ష సందర్భంగా సీఎం కేసీఆర్ అధికారులకు చేసిన సూచనలివే..

- లాక్‌డౌన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి. దేశంలో, రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలు కావడం వల్లనే వైరస్ ఇతర దేశాల మాదిరిగా ఎక్కువగా విస్తరించడం లేదు. ఈ సత్యాన్ని గ్రహించి ప్రజలు సహకరించాలి.
- లాక్‌డౌన్ సందర్భంగా నిత్యావసర సరుకుల కొరత లేకుండా చూడాలి. పాలు, పండ్లు, కూరగాయలు, మందులు, మాంసం తదితర విక్రయాలు యథావిధిగా జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ షాపుల వద్ద జనం ఒకే దగ్గర పోగవ్వకుండా దూరం పాటించాలి.
- గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన కేంద్రాలను సరిగ్గా నిర్వహించాలి. రైతులు చెప్పిన సమయానికే వచ్చి, తమ ధాన్యం అమ్ముకుని పోవాలి.
- పట్టణ ప్రాంతాలు, ఇతర చోట్ల వలస కూలీల కోసం ఏర్పాటు చేసిన శిబిరాలను, సహాయ కార్యక్రమాలను అధికారులు పర్యవేక్షించాలి.

# వాంటెడ్.. నైటింగేల్స్!

▶ మొదటి పేజీ తరువాయి

దేశాల్లో కలిపి పనిచేస్తున్న నర్సులు 2.8 కోట్ల మంది. 2013–18 మధ్య కాలంలో ఈ వృత్తిలోకి వచ్చింది కేవలం 4.7 మిలియన్లే. ప్రస్తుత ప్రపంచ జనాభాను బట్టి మొత్తం 59 లక్షల మంది నర్సుల కొరత ఉంది. ముఖ్యంగా ఆఫ్రికా, ఆగ్నేయాసియా, తూర్పు మధ్యధరా దేశాల్లో నర్సుల కొరత తీవ్రంగా ఉంది.

- మొత్తం ప్రపంచంలో పనిచేస్తున్న నర్సుల్లో 80 శాతం మంది కొన్ని దేశాల్లోనే ఉన్నారు. ఆయా దేశాల్లోని జనాభాను కలిపితే ప్రపంచ జనాభాలో సగం కన్నా కొద్దిగా ఎక్కువుంటుంది. అంటే మిగిలిన ప్రపంచంలోని సగం కన్నా జనాభా ఉన్న అన్ని దేశాల్లో కలిపి ఉన్న నర్సులు 20 శాతం మందే.
- ప్రతి 8 మంది నర్సుల్లో ఒకరు తాము జన్మించి శిక్షణ పొందిన దేశాల్లో కాకుండా వేరే దేశాల్లో పనిచేస్తున్నారు.
- మరో విషయం ఏంటంటే.. ప్రతి ఆరుగురిలో ఒక నర్సు రానున్న పదేళ్లలో రిటైర్‌మెంట్ వయసు దాటబోతున్నారు. అంటే రానున్న పదేళ్లలో 17 శాతం మంది నర్సులు పదవీ విరమణ పొందబోతున్నారు.
- వైద్యరంగానికి తక్కువగా ఖర్చు పెడుతున్న దేశాలు తమ దేశంలో ఉన్న నర్సుల సంఖ్యలో ప్రతియేటా 8 శాతం పెంచుకోవాలి. ఆ మేరకు వారికి శిక్షణ ఇచ్చి వైద్య రంగంలో ఇముడ్చుకోవాలి.
- ఇందుకోసం ప్రతి మనిషి తలసరి ఆదాయంలో 10 యూఎస్ డాలర్లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంటే మన దేశ లెక్కల ప్రకారం దాదాపు 750 రూపాయల పైమాటే.
- ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న నర్సుల్లో 90 శాతం మంది మహిళలే ఉన్నారు. కానీ, కీలకమైన పోస్టుల్లో మాత్రం తక్కువ మంది ఉన్నారు. ఈ పోస్టుల్లో ఎక్కువమంది పురుషులుండటం మంచిది కాదు.
- ప్రపంచంలోని దేశాల వారీ పరిస్థితులను, ఆయా దేశాల్లో నర్సింగ్ సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యల గురించిన పూర్తి నివేదిక ఈ ఏడాది మేలో విడుదల కానుంది.



## వైరస్ వ్యాప్తి నిరోధానికి డీఆర్‌డీవో కొత్త పరికరం

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ కట్టడికి డీఆర్‌డీవో మరో పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది. రోగుల నుంచి వైద్య సిబ్బందికి వ్యాధి సోకకుండా ఉండేందుకు.. హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్, చండీగఢ్‌లోని టీబీఆర్‌ఎల్‌లు సంయుక్తంగా 'ఏరోసాల్ కంటెయిన్మెంట్ బాక్స్'ను రూపొందించింది. చికిత్స లేదా నమూనాల సేకరణ సమయాల్లో రోగి నోటి నుంచి వెలువడే తుంపర్లు ఏవీ వైద్య సిబ్బందికి తాకకుండా ఈ పరికరం అడ్డుగోడ మాదిరిగా పనిచేస్తుందన్నమాట. రోగికి పరీక్షలు జరిపేందుకు వీలుగా ఇందులో రెండు రంధ్రాలను ఏర్పాటు చేశారు. అక్రిలిక్/పెర్స్‌పెక్స్ పదార్థంతో తయారైన ఈ బాక్స్ తేలికగానే ఉంటుంది. రెండు సైజుల్లో లభించే ఈ పరికరం ద్వారా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవచ్చునని, హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో దీన్ని వైద్యులకు ప్రదర్శించామని డీఆర్‌డీవో ఒక ప్రకటనలో తెలిపింది.



పరికరాన్ని ప్రదర్శిస్తున్న డీఆర్‌డీవో సిబ్బంది

# 487కు కరోనా కేసులు

▶ మొదటి పేజీ తరువాయి

పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లాలో అదనంగా రెండు కేసులు నమోదయ్యాయి. ఇటు ఆదిలాబాద్ జిల్లాలో గురువారం 11 కేసులు నమోదైనట్లు బులెటిన్‌లో పేర్కొనగా, శుక్రవారం బులెటిన్‌లో ఒకటి తగ్గించి 10 మాత్రమే నమోదైనట్లు చూపించారు. అలాగే నల్లగొండ జిల్లాలో గురువారం 14 కేసులు చూపించి, శుక్రవారం బులెటిన్‌లో మాత్రం 12 మాత్రమే పేర్కొన్నారు. ఇటు సూర్యాపేట జిల్లాలో గురువారం 10 కేసులున్నాయని బులెటిన్‌లో పేర్కొంటే, శుక్రవారం బులెటిన్‌లో 9 కేసులు నమోదైనట్లు చూపించారు. ఇలా పలుమార్లు బులెటిన్‌లో తప్పులు దొర్లుతుండటంతో విమర్శలు వస్తున్నాయి. దీంతో ఏది వాస్తవమో, ఏది కాదో ఆయా జిల్లాల వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే ఈ మార్పులకు గల కారణాలను కూడా వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు ప్రకటించడం లేదు. ఏమైనా పొరపాటు వల్ల ఇలా జరిగిందా అనేది కూడా వెల్లడించడం లేదు.

### జిల్లాల వారీగా నమోదైన కేసులు, డిశ్చార్జి అయిన వారి వివరాలు

| జిల్లా | పాజిటివ్ కేసులు | డిశ్చార్జి |
|---|---|---|
| 1) ఆదిలాబాద్ | 10 | – |
| 2) భద్రాద్రి కొత్తగూడెం | 02 | 02 |
| 3) హైదరాబాద్ | 179 | 21 |
| 4) జగిత్యాల | 02 | – |
| 5) జనగామ | 02 | – |
| 6) భూపాలపల్లి | 02 | – |
| 7) గద్వాల | 19 | – |
| 8) కామారెడ్డి | 10 | – |
| 9) కరీంనగర్ | 07 | 11 |
| 10) మహబూబాబాద్ | 01 | – |
| 11) మహబూబ్‌నగర్ | 10 | 01 |
| 12) మెదక్ | 05 | – |
| 13) మేడ్చల్ | 21 | 02 |
| 14) ములుగు | 02 | – |
| 15) నాగర్‌కర్నూలు | 02 | – |
| 16) నల్లగొండ | 12 | – |
| 17) నిర్మల్ | 15 | – |
| 18) నిజామాబాద్ | 49 | – |
| 19) పెద్దపల్లి | 02 | – |
| 20) రంగారెడ్డి | 27 | 07 |
| 21) సంగారెడ్డి | 07 | – |
| 22) సిద్దిపేట | 01 | – |
| 23) సూర్యాపేట | 09 | – |
| 24) వికారాబాద్ | 08 | – |
| 25) వరంగల్ అర్బన్ | 23 | 01 |
| 26) ఖమ్మం | 02 | – |
| 27) సిరిసిల్ల | 01 | – |
| మొత్తం | 430 | 45 |

నోట్: పై పట్టికలో మరణాల వివరాలు కలపలేదు. మరణాల సంఖ్య 12 కూడా కలిపితే మొత్తం 487 కరోనా కేసులు.

**రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలు**

| | శుక్రవారం నమోదైనవి | మొత్తం |
|---|---|---|
| పాజిటివ్ కేసులు: | 16 | 430 |
| డిశ్చార్జి అయినవారు: | 0 | 45 |
| చనిపోయినవారు: | 0 | 12 |
| మొత్తం: | - | 487 |

# అన్ని దారులూ...

▶ మొదటి పేజీ తరువాయి

సరాసరి ఐదుగురు సభ్యులుంటారని అంచనా వేశారు. ఆ ప్రకారం 14.40 లక్షల మంది అష్టదిగ్బంధంలో ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో 3,116 వైద్య బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయి. ఒక్కో వైద్య బృందంలో ఇద్దరు సభ్యులున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**14 రోజులు ఇంటిపట్టునే ఉండాలి..**

130 హాట్‌స్పాట్‌లలో ఉండే లక్షలాది మంది ప్రజలు నిర్ణీత తేదీ నుంచి 14 రోజులపాటు హోం క్వారంటైన్‌లోనే ఉండాలి. కేసుల తీవ్రతను బట్టి జిల్లా అధికారులు హాట్‌స్పాట్‌లను మ్యాపింగ్ చేశారు. దాని పరిధిని కిలోమీటర్ నుంచి మూడు కిలోమీటర్ల వరకు నిర్ధారించారు. వైద్య, పోలీసు బృందాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటయ్యాయి. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు వైరస్ తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో 30 ఇళ్లను కవర్ చేస్తారు. హాట్‌స్పాట్‌లలో కొన్ని కేసులున్న సాధారణ ప్రాంతాల్లో 50 ఇళ్లను పర్యవేక్షిస్తారు. పీహెచ్‌సీ వైద్యులు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక్కో హాట్‌స్పాట్ ఏరియాలో తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు. అక్కడి ప్రజల్లో ఎవరికైనా అనుమానిత లక్షణాలుంటే వారిని గుర్తించి అవసరాన్ని బట్టి ఆస్పత్రులకు పంపిస్తారు. జ్వరం లేదా శ్వాసకోశ లక్షణాలు గుర్తించినప్పుడు ఎవరికివారు ఇళ్లలోనే వేర్వేరు గదుల్లో ఉండాలని సూచిస్తారు. హాట్‌స్పాట్‌లలో నిరంతరం పర్యవేక్షించేందుకు అవసరమైన వాలంటీర్లు, సహాయకులను జిల్లా అధికారులు ఏర్పాటు చేస్తారు.

**జిల్లాల వారీగా హాట్‌స్పాట్ ప్రాంతాలు...**

- ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్ జిల్లాలను రక్షిత ప్రాంతాలుగానే గుర్తించారు. అయితే సంగారెడ్డి జిల్లాలోని 7 ప్రాంతాలను హాట్‌స్పాట్ కేంద్రాలుగా గుర్తించారు. సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్, కొత్త బస్టాండ్ సెంటర్, అంగడిపేట్, జహిరాబాద్ టౌన్, జహిరాబాద్ పట్టణంలోని గడిమాహేళా, కొండాపూర్, సంగారెడ్డి పట్టణంలోని మధురానగర్ ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 17 హాట్‌స్పాట్లు ఉన్నాయి. వరంగల్ అర్బన్‌లో జులైవాడ, సుబేదారి, ఈద్గా, కుమార్‌పల్లి, మండి బజార్, పోచమ్మ మైదాన్, చార్‌బౌళి, కాశిబుగ్గ, గణేష్ నగర్, నిజాంపుర, లక్ష్మీపురం, రంగంపేట, శంభునిపేట, బాపూజీనగర్, చింతగట్టు.
- జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రం హాట్‌స్పాట్‌గా ఉంది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఎం.డి. కాలనీ మిలీనియం క్వార్టర్స్‌ను హాట్‌స్పాట్‌గా గుర్తించారు.
- మహబూబాబాద్ జిల్లాలో గడ్డిగూడెం, పక్కనున్న తండాను కంటైన్మెంట్ జోన్ పరిధిలో చేర్చారు.
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 14 హాట్‌స్పాట్లను ఏర్పాటు చేశారు. నందిగామ మండలం చేగూరు, షాహిన్‌నగర్, క్యూబా కాలనీ, ఎంఎం పహాడ్, దుబ్బచర్ల, మణికొండ (ఆరు) ఏరియాలను కంటైన్మెంట్ క్లస్టర్లుగా గుర్తించారు. వికారాబాద్ టౌన్‌లో రాజీవ్ నగర్, మధుకాలనీ, ఇసాక్‌ఖాన్ బాగ్, తాండూరు పట్టణంలోని శాంతినగర్, ఇందిరమ్మ కాలనీ, పరిగి పట్టణంలోని వల్లబ్ నగర్, ఎన్టీఆర్‌నగర్, మర్పల్లిలో హాట్‌స్పాట్లు ఉన్నాయి.
- నిజామాబాద్ జిల్లాలో 19 ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా ప్రకటించారు. నిజామాబాద్‌లో హైమద్‌పుర, బర్కత్‌పుర, గౌతంనగర్, ఎల్లమ్మగుట్ట, మాలపల్లి, ఆటోనగర్, ఖిల్లా రోడ్, హబీబ్‌నగర్, చంద్రశేఖర్ కాలనీలు ఉన్నాయి. ఇక బోధన్‌లో శక్కర్‌నగర్, రాకాసిపేట్, శక్కర్‌నగర్ చౌరస్తా ఉన్నాయి. రెంజల్‌లో కందకుర్తి గ్రామం (9వ వార్డు), మోస్రాలో 9వ వార్డు, మాక్లూర్‌లో మైనారిటీ కాలనీ, నందిపేటలో బర్కత్‌పుర, భీంగల్‌లో బొదిరెగల్లీ, బాల్కొండలో ఆత్తర్‌గల్లీ, ఆర్మూర్‌లో జిరాయిత్‌నగర్.
- కామారెడ్డి జిల్లాలో మూడు ప్రాంతాలను హాట్‌స్పాట్ క్లస్టర్లుగా గుర్తించారు. బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీ, అరాఫత్‌కాలనీ, మదీనా కాలనీ వీటి పరిధిలో ఉన్నాయి.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 12 హాట్‌స్పాట్‌లు ఉన్నాయి. కరీంనగర్‌లో ఇండోనేసియన్లకు కరోనా పాజిటివ్ వచ్చినట్లు తేలగానే ముకరంపురా, కశ్మీర్‌గడ్డ ప్రాంతాలను మార్చి 19 నుంచే రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ప్రభుత్వం తాజాగా హాట్‌స్పాట్‌ల నిర్ణయంతో ఈ రెండు ప్రాంతాలతోపాటు హుస్సేనిపురా, మంకమ్మతోటలను కూడా కంటైన్‌మెంట్ క్లస్టర్ల జాబితాలో చేర్చారు. హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీ, మార్కెట్ ఏరియా, విద్యానగర్, మామిండ్లవాడలోని 1,620 ఇళ్లను ఈ పరిధిలోకి తెచ్చారు.
- పెద్దపల్లి జిల్లాలోని రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్టీపీసీ అన్నపూర్ణ నగర్ కాలనీ, గోదావరిఖనిలనుహాట్‌స్పాట్లుగా ప్రకటించారు.
- జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని భీమునిదుబ్బ, కల్లూరు గ్రామాలు హాట్‌స్పాట్లు.
- ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ అర్బన్ (19 వార్డులు), నేరడిగొండ మండలం (మూడు గ్రామాలు), ఉట్నూర్ మండలం (ఐదు గ్రామాలు) పరిధిలో 72,666 మంది ప్రజలను హోంక్వారంటైన్‌కు పరిమితం చేశారు.
- నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్, మొఘల్‌పుర, గుల్జార్ మార్కెట్, జోహ్రానగర్ ప్రాంతాలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. భైంసా పట్టణంలో మదీనాకాలనీ, పాండ్రి గల్లీలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించారు. నల్లగొండ పట్టణం పరిధిలో మీర్ బాగ్ కాలనీ, రహమత్ నగర్, బర్కత్‌పుర, మాన్యం చెలక, మిర్యాలగూడ పట్టణంలో సీతారాంపురం, దామరచర్ల మండలంలో దామరచర్ల ఈ జాబితాలో ఉన్నాయి.
- సూర్యాపేట జిల్లాలో 4 హాట్‌స్పాట్‌లు ఉన్నాయి. సూర్యాపేట పట్టణంలో కుడకుడ, భగత్‌సింగ్ నగర్, కొత్తగూడెం బజార్, నాగారం మండలంలో వర్ధమానుకోట ఉన్నాయి.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 5 ప్రాంతాలను హాట్‌స్పాట్ కేంద్రాలుగా గుర్తించారు. రామయ్య బౌళి, మర్లు, బీకే రెడ్డి కాలనీ, సద్దలగుండు, షాషాబ్ గుట్ట (కొంత ప్రాంతం).
- జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అయిజ, శాంతినగర్, రాజోళి ప్రాంతాలను అధికారులు కంటైన్‌మెంట్ జోన్లుగా గుర్తించారు. గద్వాల జిల్లా కేంద్రంలోని 37 వార్డులను కంటోన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. అయిజలో 12, 17, 19, 20 వార్డుల పరిధిలోని కమతంపేట, కాలమ్మపేట, రంగుపేట, తెలుగుపేట, గుర్రంతోట, ఉప్పరిపేట, కుమ్మరిపేట, నదీమ్ మసీద్ కాలనీ, బ్రాహ్మణ వీధి, సంత బజార్, అంబేడ్కర్ కాలనీ, టీచర్స్ కాలనీలను కంటోన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. శాంతినగర్‌లో 7వ వార్డు పరిధిలోని జమ్ములమడుగుకు చెందిన ముగ్గురికి పాజిటివ్ రాగా, అందులో ఒకరు మృతి చెందారు. దీంతో 7వ వార్డుతో వడ్డేపల్లి, శాంతినగర్ ప్రాంతాల్లోని 3, 4, 5, 6, 8, 8, 10 వార్డులను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించారు. రాజోళిలో రెండు కేసులు నమోదవడంతో మండల కేంద్రాన్ని పూర్తిగా కంటైన్‌మెంట్ జోనుగా ప్రకటించారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గాంధీ పార్క్ కాలనీని హాట్‌స్పాట్‌గా గుర్తించారు.
- కల్వకుర్తి పట్టణంలోని బలరాంనగర్, సుభాష్ నగర్ ప్రాంతాలను రెడ్ జోన్లుగా గుర్తించారు.
- ఖమ్మం జిల్లాలో హాట్‌స్పాట్ ప్రాంతాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాలతీ తెలిపారు. అయితే కరోనా పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో హాట్‌స్పాట్ తరహాలోనే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలతోపాటు ప్రజలు స్వీయ నిర్బంధం పాటించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఖిల్లా, పెద్దతండా ప్రాంతాల ప్రజలు బయటికి రావద్దని కోరారు.
- హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో 12 హాట్‌స్పాట్లను గుర్తించారు. రాంగోపాల్‌పేట, షేక్‌పేట, మలక్‌పేట/సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, అల్వాల్, మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్/గాజులరామారం, మయూరినగర్, యూసఫ్‌గూడ, ఖైరతాబాద్, చందానగర్‌లలో ఎక్కువ కేసులు నమోదైనట్లు గుర్తించి ఆయా ప్రాంతాలను ఇప్పటికే అష్టదిగ్బంధం చేశారు.



సీఎం కేసీఆర్‌కు చెక్కును అందజేస్తున్న మై హోమ్స్ గ్రూప్ డైరెక్టర్లు జూపల్లి రామారావు, జూపల్లి శ్యామ్‌రావు

## మై హోమ్స్ గ్రూప్ రూ.3 కోట్ల విరాళం

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు తమవంతు సాయంగా మై హోమ్స్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.3 కోట్ల విరాళం ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును మై హోమ్స్ గ్రూప్ డైరెక్టర్లు జూపల్లి రామారావు, జూపల్లి శ్యామ్‌రావు శుక్రవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. అలాగే గంగవరం పోర్టు లిమిటెడ్ చైర్మన్ డి.వి.ఎస్ రాజు కోటి రూపాయల చెక్కును కేసీఆర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సంస్థ చైర్మన్ కుమారుడు రాజేశ్ రాజ్, డి.టి నాయక్ పాల్గొన్నారు.



కేసీఆర్‌కు చెక్కును ఇస్తున్న గంగవరం పోర్టు లిమిటెడ్ చైర్మన్ డి.వి.ఎస్ రాజు

## సీఎం సహాయ నిధికి రూ.10 కోట్ల విరాళం

### మంత్రి కేటీఆర్‌కు చెక్కులు అందజేసిన దాతలు



మంత్రి కేటీఆర్‌కు రూ. 5కోట్ల చెక్కును అందిస్తున్న రిలయన్స్ జియో సీఈఓ కేసీ రెడ్డి, రిలయన్స్ ప్రతినిధి కమల్ పొట్లపల్లి

**సాక్షి, హైదరాబాద్:** కరోనాపై రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న పోరుకు మద్దతుగా పలువురు దాతలు శుక్రవారం సీఎం సహాయ నిధికి సుమారు రూ.10 కోట్లు విరాళంగా అందజేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ప్రగతిభవన్‌లో పలువురు దాతలు విరాళానికి సంబంధించిన చెక్కులు అందజేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ తరపున రిలయన్స్ జియో సీఈఓ కేసీ రెడ్డి, రిలయన్స్ ప్రతినిధి కమల్ పొట్లపల్లి రూ.5 కోట్ల చెక్కును కేటీఆర్‌కు అందజేశారు.

- అమీర్‌పేట్, ఎస్‌ఆర్‌నగర్ హాస్టల్స్ అసోసియేషన్, ఇతర వెల్ఫేర్ అసోసియేషన్లకు చెందిన 161 మంది రూ.45 లక్షలను కేటీఆర్‌కు అందించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు రూ.42 లక్షలు విరాళంగా ఇచ్చారు.
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య నేతృత్వంలో 18 మంది రూ.30.88 లక్షలను విరాళంగా ఇచ్చారు. సుమధుర ఇన్‌ఫ్రా, తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, వాసవి రియల్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 లక్షల చొప్పున విరాళాన్ని అందజేశాయి.
- దీపీక్షిత మహిళా క్లబ్ రూ.21 లక్షలు, విరూపాక్షి ఆర్గానిక్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.15 లక్షలు, వెర్మాంట్ డెవలపర్స్ తరపున రూ.11లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో కేటీఆర్‌కు అందజేశాయి.
- శ్రీకో ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శ్రీనివాసరావు, మంత్రి గంగుల కమలాకర్ నేతృత్వంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా, జనప్రియ ఇంజనీర్స్ సిండికేట్, నక్షత్ర ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, చిన్మయ సేవా ట్రస్ట్, శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ రూ. 10 లక్షల చొప్పున చెక్కులను కేటీఆర్‌కు అందజేశాయి.
- భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ రూ.10 లక్షల రూపాయల చెక్కును కేటీఆర్‌కు అందజేశారు.

**గుత్తా తనయుడి విరాళం**

కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌కుమార్‌రెడ్డి తన మిత్ర బృందంతో కలిసి సీఎం సహాయ నిధికి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసిన అమిత్‌కుమార్‌రెడ్డి వర్క్ ఎండీ నిమ్మ సుదర్శన్‌రెడ్డితో కలిసి విరాళాన్ని అందజేశారు.

## ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి బయలుదేరిన అమెరికన్లు



**శంషాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం, అమెరికా కాన్సులేట్ సమన్వయంతో శుక్రవారం పలువురు అమెరికన్లు 2 ఎయిరిండియా విమానాల్లో ఇక్కడి నుంచి ముంబై మీదుగా వాళ్ల దేశానికి బయలుదేరారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఏఐ–1615 విమానం 69 మంది పెద్దలు, ఒక శిశువుతో ఇక్కడి నుంచి ముంబైకి బయల్దేరగా.. ఏఐ–1617 విమానం 96 మంది పెద్దలు, ఇద్దరు శిశువులతో సాయంత్రం 4.24 గంటలకు టేకాఫ్ తీసుకుంది. పూర్తి శానిటైజేషన్ చేసిన టెర్మినల్ ద్వారా వీరికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలతోపాటు ఇమిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి విమానంలోకి పంపారు. లాక్‌డౌన్ తర్వాత శంషాబాద్ విమానాశ్రయం నుంచి కార్గో విమానాలు కాక 5 ప్రయాణికుల విమానాలు రాకపోకలు సాగించాయి. ఈ నెల 7న కూడా ఇక్కడి నుంచి అమెరికాకు ఓ విమానం బయలుదేరి వెళ్లింది.

## ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించిన రవీంద్రభారతి స్కూల్స్

**సాక్షి, హైదరాబాద్:** కరోనా నేపథ్యంలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో అన్ని విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల సౌలభ్యం కోసం రవీంద్రభారతి విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులకు శ్రీకారం చుట్టాయి. ఈ మేరకు తాము ప్రారంభించిన ఆన్‌లైన్ తరగతులను ప్రతీరోజు 80 వేల మంది విద్యార్థులు వింటున్నారని రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్ మణి ఓ ప్రకటనలో తెలిపారు. తమ ఆన్‌లైన్ విధానంలో క్లాసులే కాకుండా డైలీ వర్క్‌షీట్లు, ప్రాక్టీస్ టెస్టులు, పజిల్స్, జనరల్ నాలెడ్జ్, కో–కరిక్యులర్ యాక్టివిటీలు, మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్ వంటి విషయాలను కూడా అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# వ్యాక్సిన్ అంటే ఆషామాషీ కాదు..

### ‘సాక్షి’ ఇంటర్వ్యూలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ రఘు డీకే

సాక్షి, హైదరాబాద్

వైరస్‌లను కట్టడి చేసే వ్యాక్సిన్లను తయారుచేయడం అంత ఆషామాషీ కాదని, సాధారణ పరిస్థితుల్లో ఈ వ్యాక్సిన్ తయారీకి ఏడాదిన్నర నుంచి రెండేళ్ల సమయం పడుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఏడాది చివరి నాటికి కరోనా వ్యాధిని నయం చేసే వ్యాక్సిన్ అందుబాటులోకి రావచ్చని అంటున్నారు ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ రఘు డీకే. అన్నీ నిర్ధారించుకోకుండా వ్యాక్సిన్‌ను మార్కెట్‌లోకి పంపితే అది కరోనా కంటే ప్రమాదకారిగా మారుతుందని అంటున్నారాయన. ఉదర సంబంధ వ్యాధులున్న వారు ఈ కరోనా వైరస్‌కు గురయ్యే అవకాశాలు తక్కువేనని, అయితే, కరోనా ప్రాథమిక లక్షణాలతో పాటు కడుపునొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడమే మంచిదంటున్నారు ఈ యూఎస్ ఫెలోషిప్ వైద్యుడు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ఉదర సంబంధిత వ్యాధులున్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఆయన ‘సాక్షి’కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- అనేక అధ్యయనాలు చేయాలి.. జంతువులు, మానవులపై ప్రయోగించాలి
- సరైన నిర్ధారణ లేకుండా వ్యాక్సిన్ విడుదల చేస్తే అది కరోనా కన్నా డేంజర్
- ఈ ఏడాది చివరి నాటికి కరోనా వ్యాక్సిన్.. దేశంలోనూ తీవ్ర ప్రయత్నాలు
- కడుపునొప్పి, విరేచనాలు, ఆకలి మందగిస్తే కరోనా పరీక్షలు చేయించుకోండి
- షుగర్, బీపీ, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు చాలా జాగ్రత్తగా ఉండాలి
- కేసుల సంఖ్య జీరో.. లేదా కనీస స్థాయికి చేరినప్పుడే ‘లాక్‌డౌన్’పై ఆలోచించాలి
- హాట్‌స్పాట్లలో కొనసాగిస్తూనే మిగిలిన ప్రాంతాల్లో దశల వారీగా ఎత్తేస్తే మేలు..



**వాటితో పాటు అవి ఉంటే...!**

వాస్తవానికి... దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస తీసుకోలేకపోవడం లాంటివే కరోనా ప్రాథమిక లక్షణాలు. కానీ, పాజిటివ్ వచ్చిన కొన్ని కేసుల్లో కడుపునొప్పి, డయేరియా, ఆకలి మందగించడం లాంటివి కూడా కనిపించాయి. అంటే కరోనా ప్రాథమిక లక్షణాల్లో ఏ ఒక్కదానితో అయినా ఉదర సంబంధిత కడుపునొప్పి, డయేరియా, ఆకలి తగ్గిపోవడం లాంటివి కనిపిస్తే పరీక్ష చేయించుకోవడమే మంచిది. ఎందుకంటే కరోనా వైరస్ పేగులపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.

**వాటికేం సంబంధం ఉండదు..**

కడుపులో మంట, అజీర్తి, గ్యాస్, అల్సర్ ఇలాంటి లక్షణాలున్న వారికి కరోనా వైరస్ సోకితే పెద్ద ప్రమాదం ఉంటుందని చెప్పలేం. ఈ వ్యాధులకు కరోనాకు సంబంధం ఉండదు. కానీ, షుగర్, బీపీ, ఊపిరితిత్తుల సమస్యలున్న వారికి రిస్క్ ఎక్కువ ఉంటుంది. వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. వయసు పైబడిన వారు అసలు ఇంట్లో నుంచి బయటకు రాకూడదు. వారికి వైరస్ సోకితే చాలా ప్రమాదకరం.

**క్వారంటైన్‌లో ఉన్నప్పుడు జాగ్రత్త**

వైరస్ సోకిన వారికి ఉదర సంబంధిత వ్యాధులు ముదురుతాయా లేవా అన్న దానిపై శాస్త్రీయ ఆధారాలు లేవు కానీ క్వారంటైన్‌లో ఉన్నవారు మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి. క్వారంటైన్‌లో ఉన్నవారు సమయానికి పుష్టికరమైన ఆహారం తీసుకోవాలి. నీళ్లు ఎక్కువ తాగాలి. వ్యాయామం చేయాలి. ఆల్కహాల్ తీసుకోవద్దు. ఉదరసంబంధ వ్యాధులున్న వారు (గ్యాస్ట్రో సమస్యలు) క్వారంటైన్‌లో జాగ్రత్త తీసుకోకపోతే అవి ముదిరే అవకాశం మాత్రం ఉంది.

**‘పాజిటివ్’రావద్దంటే నెగెటివ్‌గానే..**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. అన్నింటి కన్నా ముఖ్యమైనది భౌతిక దూరం పాటించడం. ఇంట్లోనే ఉండటం. పని ఉంటే తప్ప ఎవరూ ఇంట్లోంచి బయటకు రావద్దు. ఎవరిని చూసినా వైరస్ ఉందేమో అనే భావనతోనే మెలగాలి. ఇది నెగెటివ్ మైండ్‌సెట్ కాదు. ప్రస్తుతం ఇదే పాజిటివ్. కరోనా పాజిటివ్ రావద్దంటే ఇదే మైండ్‌సెట్ ఉండాలి. అవసరం లేని మందులు వాడే ప్రయత్నం చేయకండి. క్వారంటైన్ ప్రోటోకాల్ తప్పకుండా పాటించండి. వయసు మీద పడిన వారికి మరింత జాగ్రత్త అవసరం.

**ఎలక్ట్రొలైట్స్ తగ్గిపోతే గుండెకు ముప్పు**

లాక్‌డౌన్ కారణంగా మద్యం మానేసిన వారికి ఉదర సంబంధ సమస్యలేవీ రాకపోవచ్చు. మద్యం తాగకపోవడం కాలేయం, మూత్రపిండాలకు మంచిదే. కానీ, మానసిక సమస్యలు మాత్రం వస్తాయి. వీటితో పాటు శరీరంలో ఎలక్ట్రొలైట్స్ (సోడియం, పొటాషియం, ఫాస్పరస్ లాంటి మూలకాలు) హెచ్చు తగ్గులు వస్తే మాత్రం గుండెకు ముప్పు ఉంటుంది.

**మన ప్రభుత్వాల చర్యలు భేష్**

కరోనా వైరస్ నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు చాలా బాగున్నాయి. మిగిలిన దేశాలన్నింటికన్నా ముందే మనం సురక్షిత చర్యలు ప్రారంభించాం. లాక్‌డౌన్ ఎప్పుడు ఎత్తేయాలన్నది ఇదమిత్థంగా చెప్పడం కష్టం. మన దేశంలో రోజురోజుకూ కేసుల లోడ్ పెరుగుతోంది. లాక్‌డౌన్ ఎత్తేసే అంశానికి ఒకటే ప్రాతిపదిక ఉండాలి. కనీసం వారం నుంచి 10 రోజుల పాటు ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కావద్దు. లేదంటే కనీస సంఖ్యలో రావాలి. అప్పుడు లాక్‌డౌన్ ఎత్తివేత గురించి ఆలోచించాలి. ఉన్నట్టుండి లాక్‌డౌన్ ఎత్తేస్తే ప్రజలు మళ్లీ కలసిపోవడం వలన పెద్ద స్థాయిలో వైరస్ లోడ్ అయ్యే అవకాశముంది. అందుకే అప్పుడు కూడా హాట్‌స్పాట్లను మినహాయించాలి. అక్కడ లాక్‌డౌన్ కొనసాగిస్తూనే మిగిలిన ప్రాంతాల్లో దశల వారీగా ఎత్తేయడమే మంచిది.

**సాధారణంగా రెండేళ్లు పడుతుంది**

వైరస్ నియంత్రించే వ్యాక్సిన్లను కనుగొనడం ఆషామాషీ కాదు. అసలు వైరస్ జీనోమ్ ఏంటన్నది గుర్తించాలి. దానిపై అధ్యయనం చేయాలి. జంతువులు, మనుషులపై ప్రయోగాలు జరపాలి. వాటినీ అధ్యయనం చేయాలి. సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా అన్నది నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే వ్యాక్సిన్‌ను విడుదల చేయాలి. అలాంటిది జరగకుండా వ్యాక్సిన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తే కరోనా వైరస్ కన్నా అది ప్రమాదకారి అవుతుంది. ఇదంతా జరగడానికి సాధారణ పరిస్థితుల్లో అయితే రెండేళ్లు పడుతుంది. కానీ, ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన జరుగుతోంది కాబట్టి ఈ ఏడాది చివరికల్లా వ్యాక్సిన్ అందుబాటులోకి రావచ్చు. పాశ్చాత్య, అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వనరులు, ప్రయోగశాలలు అనుకూలిస్తాయి కనుక ఎక్కువగా అక్కడే పరిశోధనలు జరుగుతున్నాయి. మన దేశంలో కూడా అన్ని సౌకర్యాలున్నాయి. మంచి శాస్త్రవేత్తలున్నారు. వ్యాక్సిన్ కోసం అహోరాత్రులు శ్రమిస్తున్నారు. సీసీఎంబీ లాంటి సంస్థలు వర్కవుట్ చేస్తున్నాయి. ఈ ఏడాది చివర కల్లా వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందనేది నా అభిప్రాయం.

## మాస్కులు, పీపీఈ కిట్లు త్వరగా ఇవ్వండి

- కేంద్రానికి మంత్రి ఈటల విన్నపం
- తెలంగాణలో ఇప్పటివరకు 8,500 మందికి కరోనా పరీక్షలు
- వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కేంద్ర మంత్రి హర్షవర్ధన్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రానికి ఎన్–95 మాస్కులు, పీపీఈ కిట్లు, టెస్టింగ్ కిట్లు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్ని రాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖ మంత్రులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ బీఆర్కే భవన్ నుంచి మంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. రాష్ట్రం, దేశంలో తయారవుతున్న మందులు, వైద్య పరికరాలపై పన్ను ఎత్తివేయాలని ఈటల కోరారు. అలాగే విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వైద్య పరికరాలకు కస్టమ్స్ టాక్స్ రద్దు చేయాలని విన్నవించారు. వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలు ఈసీఐఎల్, డీఆర్‌డీవో వంటి సంస్థల్లో తయారుచేసి ప్రభుత్వాలకు అందజేయాలని కోరారు. వైద్య పరికరాలు, కరోనా నియంత్రణ కోసం వినియోగిస్తున్న వాటిని బ్లాక్ మార్కెట్ చేయకుండా నియంత్రించాలని సూచించారు. వీటిని కేంద్ర ప్రభుత్వమే సేకరించి రాష్ట్రాలకు అందించాలని మంత్రి విన్నవించారు. తెలంగాణలో ఇప్పటివరకు జనసమూహంలోకి కరోనా వైరస్ సోకలేదని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 8,500 మందికి కరోనా పరీక్షలు చేస్తే 471 మందికి పాజిటివ్ అని తేలిందని పేర్కొన్నారు. 45 మంది కోలుకొని డిశ్చార్జ్ కాగా, 12 మంది చనిపోయినట్లు తెలిపారు. లాక్‌డౌన్ పొడిగించే అంశంపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలని కూడా మంత్రి ఈటల సూచించారు.

## గిరిజన గురుకుల సొసైటీ ద్వారా ‘ఓక్స్’

**సాక్షి, హైదరాబాద్ :** విద్యార్థుల కోసం తెలంగాణ గిరిజన గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్‌ఐఎస్) సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.ప్రస్తుతం లాక్‌డౌన్, అనంతరం వేసవి సెలవుల్లో విద్యార్థులకు పాఠ్యాంశంపై అవగాహన పెంచేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఓక్స్ (ఓఏకేఎస్)ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గిరిజన గురుకుల సొసైటీ పరిధిలో గురుకుల పాఠశాలలు, మినీ గురుకులాల్లో దాదాపు 70వేల మంది విద్యార్థులుంటారు. వీరిలో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఈయాప్‌ను రూపొందించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, సోదరుల స్మార్ట్ ఫోన్లను వినియోగించుకుని ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్

# ఏపీ ఎన్నికల కమిషనర్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి

**పదవీ కాలం 5 ఏళ్ల నుంచి 3 ఏళ్లకు కుదింపు**

- పంచాయతీరాజ్ చట్టానికి సవరణతో ఆర్డినెన్స్
- గవర్నర్ ఆమోదం తర్వాత ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- స్థానిక సంస్థల ఎన్నికల సంస్కరణల కొనసాగింపులో భాగంగా కీలక నిర్ణయం
- హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎస్‌ఈసీ అయితే మరింత నిష్పాక్షికతకు అవకాశం
- వరుస సంస్కరణలతో దేశంలో కొత్త ఒరవడి
- తాజా ఆర్డినెన్స్‌తో ముగిసిన ప్రస్తుత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీకాలం
- కొత్త ఎస్‌ఈసీగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి

**సాక్షి, అమరావతి:** స్థానిక సంస్థల ఎన్నికలను మద్యం, ధనం ప్రభావమన్నది లేకుండా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఇటీవల అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని ఏపీ ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ)గా నియమించేలా చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం–1994 సెక్షన్–200కు చేసిన సవరణల ఆర్డినెన్స్‌కు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆమోద ముద్ర వేయడంతో ఏపీ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇకపై ఎస్‌ఈసీగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి**

- ఇప్పటి వరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్లుగా నియమితులవుతూ వచ్చారు. ఇక మీదట హైకోర్టు రిటైర్డ్ జడ్జి.. ఎస్‌ఈసీ కానున్నారు.
- రిటైర్డ్ ఐఏఎస్‌లు ప్రభుత్వ పెద్దల వద్ద పని చేసి ఉండటం వల్ల చాలా సందర్భాల్లో వారి ‘నిష్పాక్షికత’ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఎన్నికల సంస్కరణల్లో కొనసాగింపుగా ఎస్‌ఈసీగా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- ఈ నిర్ణయం దేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో కొత్త ఒరవడి సృష్టించనుంది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించడం దేశంలో ఇదే ప్రథమం కానుంది. పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని ప్రజాస్వామ్యవాదులు, న్యాయనిపుణులు, విశ్లేషకులు, మేధావి వర్గాలు అభిప్రాయ పడుతున్నారు.

**గరిష్టంగా రెండు పర్యాయాలు**

- ఏపీ ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని 5 ఏళ్ల నుంచి 3 ఏళ్లకు కుదించినట్లు ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. మరో 3 ఏళ్ల పదవీ కాలాన్ని గవర్నర్ తన అభీష్టం మేరకు పొడిగించడానికి అవకాశం కల్పించారు.
- ఒక వ్యక్తిని గరిష్టంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రెండు పర్యాయాలు (3+3 ఏళ్లు) మాత్రమే కొనసాగించాలని పరిమితి విధించారు.
- ప్రస్తుతం ఏపీ ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ)గా పని చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ 2016 ఏప్రిల్ 1వ తేదీన ఆ బాధ్యతల్లో చేరారు. ఆయన నాలుగేళ్లకు పైగానే ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. తాజా ఆర్డినెన్స్ ప్రకారం.. ఎస్‌ఈసీ పదవీకాలం 3 ఏళ్లకు చేసిన.. ఫలితంగా నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పదవీకాలం పూర్తయింది. దీంతో ఆయన స్థానంలో.. ఆర్డినెన్స్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం కొత్త రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఆదిలోనే ఎన్నికల సంస్కరణకు శ్రీకారం**

- పంచాయతీ రాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి అభ్యర్థులు మద్యం, డబ్బులు పంపిణీ వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే అటువంటి వారు గెలిచినప్పటికీ ఆయా పదవుల్లో కొనసాగటానికి అనర్హులుగా పరిగణించేలా రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో సంస్కరణలకు శ్రీకారం చుట్టడం తెలిసిందే.
- గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీ పాలక వర్గాలకు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ చేసింది.
- ప్రస్తుతం సుదీర్ఘమైన స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రలోభాలకు తావివ్వకుండా 13 రోజుల వ్యవధికి తగ్గించింది.
- ఎన్నికల్లో గెలిచిన తర్వాత గ్రామ పంచాయతీ సర్పంచ్ సంబంధిత గ్రామంలోనే నివసించాలని, గ్రామ పంచాయతీ కార్యాలయానికి క్రమం తప్పకుండా హాజరు కావాలని నిబంధన విధించింది.
- ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఓటర్లను ప్రలోభ పెట్టడం, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా చేయటం వంటి నేరాలకు పాల్పడినట్లయితే 3 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.10వేల వరకు జరిమానా విధించడానికి అవకాశం కల్పిస్తూ చట్టంలో మార్పులు చేసింది.

# మీ నిస్వార్థ సేవలకు సెల్యూట్

మనలాగే ఆర్గనైజ్డ్‌గా, క్రమశిక్షణతో అన్ని రాష్ట్రాలు పని చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాలు.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి అభివృద్ధి చెందిన నగరాల్లో గొప్ప మౌలిక వసతులున్న ఆసుపత్రులతో పోటీ పడే ఆసుపత్రులు మన దగ్గర లేవు. అయినప్పటికీ మన వద్ద ఉన్న మంచి డాక్టర్లు, సిబ్బంది వారితో పోటీ పడుతూ అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు, మన రాష్ట్రానికి మధ్య తేడా ఇదే.

క్రిటికల్ కేర్, కోవిడ్ ఆసుపత్రుల్లో పని చేస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది అందరికీ.. కోవిడ్–19 అనేది తెలియని వ్యాధి. డాక్టర్లు, నర్సులు, ఆసుపత్రుల్లో పని చేసే వారికి ఈ వ్యాధి సోకే అవకాశంఉందని తెలిసినా వారంతా సేవలందిస్తున్నారు. వారి కష్టానికి సెల్యూట్ చేస్తున్నా. తెలియని భయం ఉన్నా.. నిస్వార్థంగా పని చేస్తున్నారు. ఆ నిస్వార్థానికి సెల్యూట్ చేస్తున్నా.

డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య రంగాల్లో వివిధ స్థాయిల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఐఎంఏ అసోసియేషన్ ఆఫ్ అనస్థీషియా, పల్మనాలజిస్టులు, శిక్షణలో ఉన్న నర్సులు, ఆయుష్, డెంటల్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, వలంటీర్లు, కోవిడ్– వారియర్స్.. తదితరుల హృదయ పూర్వక సేవలకు నా కృతజ్ఞతలు.



- పారిశుధ్య సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల సేవలు మరువలేనివి
- జిల్లా కలెక్టర్లు, కోవిడ్ ఆసుపత్రుల వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం జగన్
- కరోనాపై యుద్ధంలో వైద్యుల సేవలు ప్రశంసనీయం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మీద యుద్ధంలో వైద్యులు, పారా మెడికల్, పారిశుధ్య సిబ్బంది, నర్సులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య రంగాల్లో సేవలందిస్తున్న ఉద్యోగులను ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసించారు. జిల్లా కలెక్టర్లు, కోవిడ్ ఆసుపత్రుల వైద్యులతో శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ‘క్లిష్ట సమయంలో సేవలు అందిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని ప్రశంసించకుండా ఉండలేను. ఏ ఒక్కరూ మీ సేవలను ప్రశంసించకుండా ఉండలేరు. అంత ఎక్కువగా కష్టపడుతున్నారు. అంత ఎక్కువగా సేవలు అందిస్తున్నారు’అని అభినందించారు. రాబోయే రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని నమ్ముతున్నానని చెప్పారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వారికి మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. అందరం సమష్టిగా కృషిచేసి కరోనా వైరస్‌ను సమర్థవంతంగా నిలువరిద్దామని పిలుపునిచ్చారు. కోవిడ్–19ను ఎదుర్కోవడంలో భాగంగా నాలుగు బెస్ట్ క్రిటికల్ ఆసుపత్రులను గుర్తించామనీ, ఇక్కడకు ఐదు శాతం మంది సీరియస్‌గా ఉన్న పరిస్థితుల్లో వస్తారని తెలిపారు. ప్రతీ జిల్లాలో 2,000 బెడ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేసులు, వారి ప్రైమరీ కాంటాక్టు కేసుల పరీక్షలు అయిపోయాయనీ, సెకండరీ కాంటాక్ట్ పరీక్షలు కొద్దిగా ఉండగా, లోకల్ కమ్యూనిటీ కేసులు ఉన్నాయా లేదా అనేది పరిశీలిస్తున్నామన్నారు.

## అతను కరోనాను జయించాడు

**ఏపీలో మరో యువకుడు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి**

**లబ్బీపేట (విజయవాడ తూర్పు):** ప్రపంచాన్ని వణికిస్తు న్న కోరానా మహమ్మారిని ఆ యువకుడు జయించాడు. స్వీడన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అతను.. అక్కడ కరోనా ప్రభావం ఎక్కువగా ఉండటంతో మార్చి 17న విజయవాడకు వచ్చాడు. 25న జలుబు, దగ్గు, జ్వరం రావడంతో కోవిడ్–19 ఓపీకి రాగా, అక్కడి వైద్యులు పరీక్ష చేసి ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అనంతరం నిర్వహించిన నిర్ధారిత పరీక్షలో పాజిటివ్ రావడంతో 15 రోజులపాటు చికిత్స అందించారు. ప్రస్తుతం అతనికి రెండుసార్లు చేసిన పరీక్షల్లో నెగిటివ్ వచ్చింది. దీంతో డిశ్చార్జి చేసినట్లు కోవిడ్–19 ట్రీట్‌మెంట్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ గోపీచంద్ తెలిపారు. ఇప్పటి కే నగరానికి చెందిన ఇద్దరు యువకులు కోలుకోవడంతోవారిని డిశ్చార్జి చేశామని.. ప్రస్తుతం మూడో యువకుడి ని కూడా డిశ్చార్జి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వైద్య లు తనకందించిన సేవలకు ఆ యువకుడు కృతజ్ఞతలు తెలిపాడు. అనునిత్యం పర్యవేక్షిస్తూ చికిత్స అందించడంతోనే తాను కోలుకుని డిశ్చార్జి అవుతున్నట్లు తెలిపారు.

# సాక్షి

శనివారం, ఏప్రిల్, 11

## బెర్నీ నిశ్శబ్ద నిష్క్రమణ

ఈసారైనా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని చేజిక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నించిన బెర్నీ సాండర్స్ వరస ఎదురు దెబ్బలతో రంగం నుంచి నిష్క్రమించారు. పర్యవసానంగా వచ్చే నవంబర్‌లో అమెరికా అధ్యక్ష పీఠానికి జరిగే ఎన్నికల్లో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై డెమొక్రటిక్ పార్టీ తరఫున బిడెన్ తలపడటం ఖాయమైంది. మొదట్లో సాండర్స్‌కు మంచి ఆదరణ లభించినా క్రమేపీ అది కొడిగట్టింది. న్యూహాంప్‌షైర్‌లో ఆయనదే పైచేయి అయింది. నెవెడాలో ఆయనకు అద్భుతవిజయం దక్కింది. అయోవా సైతం ఆయనకే మొగ్గు చూపింది. అంతా బాగుందనుకుంటుండగా సూపర్ ట్యూస్‌డే పెద్ద దెబ్బ తీసింది. ఆ రోజు జరిగిన 14 రాష్ట్రాల ప్రైమరీల్లో పది బిడెన్ ఖాతాలో పడ్డాయి. ముఖ్యంగా నల్లజాతీయులు అధికంగా వున్న సౌత్ కరోలినాలో అత్యధికులు బిడెన్ వైపే మొగ్గడం సాండర్స్‌కు పెను విఘాతమైంది. వచ్చే జూలై లోపు మరికొన్ని ప్రైమరీలున్నా ఇక కొనసాగడం అనవసరమని సాండర్స్ భావించారు. ఆయన రంగం నుంచి తప్పుకున్నాడని తెలియగానే స్టాక్ మార్కెట్ హుషారెత్తి 700 పాయింట్లు పెరిగిం దంటే... సాండర్స్ విధానాలు, ఆయన ఆలోచనలు ఎలాంటివో అర్థమవుతుంది. ఆయనకు అధికారం దక్కితే తమ ప్రయోజనాలు దెబ్బతినడం ఖాయమని అమెరికన్ బహుళజాతి సంస్థలు భయపడ్డాయి. వారికి కరోనా వైరస్ సంక్షోభం కన్నా సాండర్స్ బెడదే ప్రమాదకరమనిపించింది.

విచిత్రమేమంటే రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ మొదటినుంచీ 'బయటి వ్యక్తి'లాగే వ్యవహరిస్తూ వచ్చి చివరకు 2016లో అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని సాధించుకున్నారు. ఇప్పుడు రెండోసారి కూడా పోటీ చేస్తున్నారు. సాండర్స్ కథ కూడా ఇదే. ఆయన కూడా డెమొక్రటిక్ పార్టీలో 'బయటి వ్యక్తే'. పార్టీలో అత్యధికులకు ఆయనంటే పొసగదు. అయితే ట్రంప్ మొదటినుంచీ దూకుడుగా వుంటూ, సంచలనాత్మక ప్రకటనలు చేస్తూ, వివాదాలు రేకెత్తిస్తూ తన సొంత పార్టీలోని ప్రత్యర్థులపై అవలీలగా పైచేయి సాధించారు. తన ముగ్గురు ప్రత్యర్థులనూ ఆయన సునాయాసంగా ఓడించగలిగారు. కానీ సాండర్స్ తీరే వేరు. ఆయనకు హుందాతనం ఎక్కువ. విధానాలపై విమర్శలే తప్ప వ్యక్తులనుద్దేశించి మాట్లాడటం ఆయనకు అలవాటు లేదు. బిడెన్ విధానాలను ఆయన నిశితంగా విమర్శించారు. ఆ విధానాలకూ, ట్రంప్ ఆచరిస్తున్న విధానాలకూ తేడా లేదని దుయ్యబట్టారు. అంతేతప్ప ప్రత్యర్థి గురించి పరుషంగా మాట్లాడటం, ఆరోపణలు గుప్పించడం ఆయనకు చేతకాదు. ఈ విషయంలో సొంత టీంలోని వారు నచ్చజెప్పినా సాండర్స్ వినలేదు. ఆ పని చేసివుంటే మొదట్లో దక్కిన విజయాలను కొనసాగించడం వీలయ్యేదని వారి నమ్మకం. సాండర్స్‌కు విద్యార్థులు, యువత గట్టి మద్దతుగా నిలిచారు. అయితే నల్లజాతీయుల్లో విశ్వాసం కలిగించలేకపోవడం సాండర్స్‌కు శాపమైంది. ట్రంప్‌కు ఆయన దీటైన అభ్యర్థి అవుతాడన్న నమ్మకం వారికి కలగలేదు. ఒబామా హయాంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన బిడెన్ అయితేనే తమ ప్రయోజనాలు నెరవేరతాయని, సాండర్స్ ఓడిపోతే మళ్లీ ట్రంప్ పాలనలో మగ్గాలని మెజారిటీ నల్లజాతీయులు భావించారు. వాస్తవానికి సాండర్స్ ప్రచారం ముందు బిడెన్ వెలవెలబోయారు. పేదలకు ఉచిత వైద్యం అందించే 'ఒబామా కేర్'కు ఆయన వ్యతిరేకి. బిడెన్ కుటుంబాన్ని చుట్టుముట్టిన కుంభకోణాలు అనేకం. ఒక సెనేట్ ఉద్యోగినిపై ఆయన లైంగిక దాడి చేశాడన్న ఆరోపణ వుంది. వీటన్నిటికీ భిన్నంగా సాండర్స్ విధానాలు ప్రగతిశీలమైనవి. సంపన్నులపై పన్నుల పెంపు, ఆదాయ వ్యత్యాసాల తగ్గింపు, అల్పాదాయ వర్గాలకు ఉచిత వైద్యం, ఉచితంగా కళాశాల విద్య, కార్మికులకు కనీస వేతనం పెంపు వంటివి ప్రజానీకాన్ని విశేషంగా ఆకర్షించాయి. అందుకనే మొదట్లో సాండర్స్‌కు 30 శాతం మొగ్గు కనబడింది. బహుశా పార్టీ ఓటర్లతో నేరుగా సంభాషించే అవకాశం వస్తే సాండర్స్ తన స్థితిని మరింత మెరుగుపరుచుకునేవారు. కానీ కరోనా వైరస్ స్వైర విహారంతో ప్రచార సభలకు వీలు లేకపోవడం ఆయనకు మైనస్‌గా మారింది. మొదటినుంచీ స్వతంత్రంగా వ్యవహరిస్తూ, సోషల్ డెమొక్రాట్‌గా పేరుబడిన సాండర్స్‌కు అమెరికా వంటి పెట్టుబడిదారీ సమాజంలో అనుకూలత వ్యక్తం కావడం సులభం కాదు. ఆయన న్యూహాంప్‌షైర్, నెవెడాల్లో నెగ్గినప్పుడే అక్కడి బహుళజాతి సంస్థలు ఉలిక్కిపడ్డాయి. అప్పటినుంచి సాండర్స్‌కు వ్యతిరేకంగా మీడియాలో పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువడ్డాయి. మూడు దశాబ్దాల క్రితం యూరప్‌ను నాశనం చేసిన సోషలిస్టు విధానాలను అమెరికాలో ఆయన ప్రవేశపెట్టాలనుకుంటున్నాడని దుమ్మెత్తిపోశాయి. సాండర్స్ కోసం రష్యా తహతహలాడుతున్నదని ప్రచారం చేశాయి. డెమొక్రటిక్ పార్టీలోని యువత, విద్యార్థులు సాండర్స్ వైపున్నా, వృద్ధ తరం ఓటర్లు మాత్రం అధ్యక్ష ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఎవరికున్నాయన్నదే గీటురాయిగా తీసుకున్నారు. బిడెన్ పార్టీని గట్టెక్కిస్తాడని వారు భావించారు. ఇదంతా సాండర్స్‌కు ప్రతికూలంగా మారింది.

కరోనా మహమ్మారి కారణంగా అమెరికాలో ఇప్పటికే 16,000 మందికిపైగా మరణించగా, లాక్‌డౌన్‌తో లక్షలాదిమంది ఉపాధి కోల్పోయారు. కనుకనే సాండర్స్ మద్దతుదార్లను కూడ గట్టుకునేందుకు బిడెన్ కూడా సంక్షేమం గురించి మాట్లాడుతున్నారు. ఉచిత వైద్యం పరిధిలోకి మరింతమందిని తెచ్చేందుకు వయో పరిమితిని 60కి తగ్గిస్తానని, అల్పాదాయ, మధ్య ఆదాయ వర్గాల విద్యార్థులు తీసుకునే రుణాల్లో కొంత మేర మాఫీ చేస్తానని తాజాగా హామీ ఇస్తున్నారు. సాండర్స్ ఎన్నికల రంగం నుంచి తప్పుకున్నా, ఆయన విధానాలు అంత త్వరగా మరుగున పడిపోవు. నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల తర్వాత ట్రంప్ ఏలుబడే కొనసాగినా, బిడెన్ అధ్యక్షుడైనా సాండర్స్ ప్రతిపాదించిన విధానాలపై చర్చ, వాటి అమలుకు ఉద్యమాలు కొనసాగుతాయి.

### గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి బ.చవితి రా.12.16 వరకు తదుపరి పంచమి, నక్షత్రం అనూరాధ రా.1.15 వరకు తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం... లేదు
దుర్ముహూర్తం ఉ.5.51 నుంచి 7.28 వరకు
అమృతఘడియలు... ఉ.4.44 నుంచి 6.12 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# పొంచివున్న పెనుముప్పు 'ధారవి'

విశ్లేషణ



సాయ్లు ఉదాస్ మన్కికర్

**ఆసియాలోనే అతిపెద్ద మురికివాడగా పేరొందిన ధారవి కోవిడ్–19 విషయంలో పేలనున్న టైమ్‌బాంబ్‌లా ఉంటోంది. దేశంలోనే అత్యంత ఇరుకైన, కిక్కిరిసిన జనాభాతో కూడిన ధారవి మురికివాడలో 10 లక్షల మంది జనాభా నమ్మశక్యం కానంత ఇరుకు గుడిసెల్లో ఉండటం వల్ల ముంబై నగరంలో వైరస్ ఉత్పత్తి కేంద్రంగా ఉంటూ భయాందోళనలు కలిగిస్తోంది. ప్రభుత్వం, ఆరోగ్య కార్యకర్తలు, పౌర సమాజం ఈ ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు కలిగిన ప్రాంతంలో వైరస్ నియంత్రణతో ఎలా వ్యవహరించాలనే విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇంతవరకు ఇక్కడ చేసిన కృషి ఏమాత్రం సరిపోదు. ఒక్క మాటలో చెప్పాలంటే ధారవిని యథాతథ స్థితికి తీసుకురావడం ప్రభుత్వ యంత్రాంగానికి, పౌర సమాజానికి అతి పెద్ద సవాలుగా మారనుంది.**

ఆసియాలోనే అతిపెద్ద మురికివాడగా పేరొందిన ధారవిలో కరోనా వైరస్ వ్యాప్తిపై పోరాడేందుకు అతివేగంగా మాస్ పరీక్షలు చేయడం, భారీ మౌలిక వైద్య వ్యవస్థను ఏర్పర్చడం ఇప్పుడు మహారాష్ట్ర ముందున్న అతి పెద్ద సవాలు. ముంబై పురపాలక సంస్థ నుంచి 274 మంది కమ్యూనిటీ హెల్త్ కేర్ కార్మికులు, ఆరు వైద్య బృందాలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మరో 200 మంది సిబ్బంది ధారవిలో కోవిడ్–19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆ మురికివాడపై దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో ఇప్పుడు తక్షణ సవాళ్లు ఏవంటే.. వివిధ సామాజిక బృందాలకు శరవేగంతో భారీ స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించడం, కొత్త ఐసోలేషన్, వైద్య మౌలిక వ్యవస్థలను సిద్ధం చేసుకోవడమే. కరోనా వైరస్ రోగి మృతి చెందాక మహారాష్ట్ర ప్రభుత్వం వీటిని యుద్ధప్రాతిపదికన ఏర్పర్చడానికి ప్రయత్నాలు చేస్తోంది. మెడికల్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆమోదించిన వెంటనే ర్యాపిడ్ టెస్టింగ్ యూనిట్లను కూడా ధారవికి పంపుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే చెప్పారు.

239 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు పది లక్షలమంది జనాభాకు నెలవుగా ఉన్న ధారవిని కరోనా వైరస్ వ్యాప్తికి సంబంధించి హైరిస్క్ జోన్‌గా, ముంబై మహానగరానికే సాంక్రమిక వ్యాధికి చెందిన ఎపిసెంటర్‌గా ముంబై పురపాలక సంస్థ గుర్తించింది. ముంబై మహారాష్ట్ర రాజధాని. భారత్‌లోనే అత్యధిక సంఖ్యలో కోవిడ్–19 రోగులు నమోదైన రాష్ట్రమిది. వారం రోజుల క్రితమే అంటే ఏప్రిల్ 1న ధారవిలో తొలి కోవిడ్–19 మరణం నమోదైంది. మార్చి 23న జ్వరం రావడంతో రోగి సమీపంలోని సియోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. అప్పటి నుంచి ధారవిలో కరోనా కేసులు పెరుగుతున్నాయి.

ఏప్రిల్ 8 నాటికి, ధారవిలో 9 కరోనా కేసులను నిర్ధారించారు. వీరిని ఈ ప్రాంతంలోనే ఉన్న రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూపొందించిన ఐసోలేషన్ వార్డులకు తరలించారు. స్థానికుల వినోదానికి రూపొందించిన ఈ కాంప్లెక్స్‌ను రాత్రికి రాత్రే 300 పడకలతో కూడిన ఐసోలేషన్ కేంద్రంగా మార్చేశారు. ఇరుగుపొరుగున ఉన్న డాక్టర్ బలిగానగర్, వైభవ్ అపార్ట్‌మెంట్, ముకుంద్ నగర్, మదీనా నగర్, ధన్‌వాడ చావల్ ప్రాంతాల్లో ఇప్పటికే 5 వేలమందిని క్వారంటైన్ చేశారు. ధారవిలో 150 చదరపుటడుగుల నివాస ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు సాగించే 85 క్లస్టర్లున్నాయి. ఈ ఇళ్లలో సగటున ఆరుమంది నివసిస్తుంటారు.

ఈ ప్రాంతంలో 25 శాతం మేరకు పక్కా నిర్మాణాలు ఉండి ఇక్కడ 20 వేల చిన్నతరహా వర్క్ యూనిట్లు పనిచేస్తున్నాయి. తోలు ఉత్పత్తుల ఎగుమతులు, జౌళి, జరీ పని, గ్లాస్ పని, కుండల తయారీ, రీసైకిలింగ్ వంటి వృత్తులు ధారవిలో వంద కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తున్నాయి. ఇక్కడి నివాస ప్రాంతాల్లో కమ్యూనిటీ టాయ్‌లెట్లు ఉన్నాయి. ఒక్కో టాయ్‌లెట్‌ని దాదాపు 1400 మంది ఉపయోగించుకుంటున్నారు.

ఇక్కడ కరోనా రోగి 400 చదరపుటడుగుల విస్తీర్ణం గల ఇంటిలో 8 మంది కుటుంబ సభ్యులతో నివసించేవాడు. ఇటీవలే ఇక్కడ మసీదుని సందర్శించి పలువురు వ్యక్తులను కలిసి ప్రార్థనలు చేసిన 10 మంది తబ్లిగీ జమాత్ సభ్యులకు అతడు ఆశ్రయమిచ్చాడు. ఆ తర్వాతే అతడికి కరోనా సోకింది. దాంతో అతడు సంబంధం పెట్టుకున్న 74 మందిని క్వారంటైన్ చేశారు. భౌతిక దూరం పాటించడానికి అతికష్టమైన భౌగోళిక పరిస్థితులు కలిగిన ఇరుకైన ప్రాంతమైన ధారవిలో వ్యక్తుల కాంటాక్టుల జాడ పట్టుకోవడం చాలా కష్టమైన పని. అందుకే పురపాలక సంస్థ వార్డు ఆఫీసర్ కిరణ్ దివాకర్ నేతృత్వంలోని టీమ్ కరోనా రోగివల్ల ప్రమాదంలో పడిన బాధితుల జాడ పట్టడానికి సులువైన వర్క్ నమూనాను రూపొందించుకుంది. ప్రాంతాలను ఐసోలేట్ చేయడం, వారికి అవసరమైన నిత్యావసర సరుకులను వారి ఇళ్లవద్దకే తెచ్చివ్వడం సాగించారు. అయితే భవనాల్లో నివసిస్తున్న వారికి ఈ మోడల్ కాస్త విభిన్నంగా ఉంటుంది.



భవనాల్లో ఉంటున్నవారు ఒక మోస్తరు వ్యాధి లక్షణాలను కలిగివుంటే అలాంటివారిని తమ ఇళ్లలోనే ఉంచేస్తున్నారు. అయితే మొత్తం భవనాలను మాత్రం సీల్ చేస్తున్నారు. ఇక మురికివాడలో గుడిసెల్లో ఉంటున్నవారిని ఐసోలేట్ చేయడం అసంభవం. ఎందుకంటే ఇరుకైన ప్రాంతంలో ఇక్కడ జనాభా కిక్కిరిసిపోయి ఉంటుంది. పైగా అనేకమంది ప్రజలు తమ ఇళ్ల బయట నిద్రపోతుంటారు.

పైగా ఉమ్మడిగా పారిశుద్ధ్య వసతులను ఉపయోగించుకోవడం అనేది వైరస్ వ్యాప్తికి అతిపెద్ద కేంద్రంగా ఉంటోంది. ఇక్కడ వ్యాధి సోకినవారిని వెంటనే ఐసోలేషన్‌కు పంపించాల్సి ఉంది. అందుకే ధారవిలోని అయిదు ఐసోలేటెడ్ ఏరియాల్లో ఫీవర్ క్లినిక్‌లను లేదా హెల్త్ క్యాంపులను నగరపాలక సంస్థ ఏర్పర్చింది. అనుమానిత కేసులన్నింటినీ ఇక్కడికే తీసుకువస్తున్నారు. కోవిడ్–19 కేసుల్లో పాజిటివ్‌గా తేలినవారితో సంబంధంలోకి వచ్చిన వారిని కూడా ఇక్కడికే తీసుకొస్తున్నారు. ఈ క్యాంపులకు రోజుకు సగటున 50 మంది అనుమానితులను తీసుకొస్తున్నారు.

ప్రతి అనుమానిత రోగిని డాక్టరు, పురపాలక అధికారి ఇంటర్వ్యూ చేస్తారు. డాక్టరేమో పరీక్షలతో వైద్య ప్రక్రియను ప్రారంభిస్తారు. ఇక పురపాలక అధికారి ఆ రోగితో సంబంధం ఉన్న వారి జాడను కనుగొనడానికి ప్రయత్నిస్తారు. ఆరోగ్య కార్యకర్తలను స్థానిక ఎన్జీవోలు ఆ రోగితో కాంటాక్టులోకి వచ్చిన వారికోసం ఇల్లిల్లూ తిరిగి సమాచారం సేకరిస్తారు. వీళ్లందరికీ పరీక్షలు జరిపాక వారిలోని వ్యాధి లక్షణాల తీవ్రతను బట్టి వారిని ఇళ్లలోనే ఉండమని చెబుతారు. ఒక మోస్తరు లక్షణాలున్నవారిని రాజీవ్ గాంధీ కాంప్లెక్స్‌కు పంపుతారు. లేదా కొత్తగా నిర్మించిన సాయి హాస్పిటల్‌కు తీవ్రస్థాయిలో ఉన్న కేసులను పంపుతున్నారు. దాదాపు 51 పడకలు ఉన్న ఈ ప్రైవేట్ హాస్పిటల్‌లో 8 ఐసీయూ బెడ్లు, డాక్టర్లతో కూడి ఉంది. దీన్ని నెలకు 30 లక్షల రూపాయలకు ముంబై పురపాలక సంస్థ లీజుకు తీసుకుంది. సీరియస్ కేసులను ఇక్కడికే పంపుతున్నారు.

ప్రజలను తమ ఇళ్లలోనే ఉండేలా క్వారంటైన్ చేయడం, వారి రోజువారీ రేషన్ సరుకులను ఉచితంగా అందించడం అనేది ఏకకాలంలోనే కొనసాగిస్తున్నారు. నగరంలోని వ్యాపార వర్గాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విరాళాల ద్వారా మునిసిపల్ కార్పొరేషన్ దీన్ని నిర్వహిస్తోంది. ఐసోలేట్ చేసిన అన్ని ఇళ్లకూ బియ్యం బస్తాలు, ఉల్లిపాయలు, టమాటాలు, ఆయిల్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. పలువురు ఎన్జీవోలకు చెందిన వారు కూడా ప్రజలకు ఆహారం అందిస్తున్నారు. 150 మంది కార్మికులతో కూడిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రోజూ చెత్త ఏరివేయడం, ఇళ్లలో, రూముల్లో, భవనాల్లో ఇన్ఫెక్షన్లు రాకుండా క్రిమిసంహారక మందులను స్ప్రే చేయడం, మురికికాలువలను క్లీన్‌గా ఉంచడం వంటి విధులను నిర్వహిస్తున్నారు.

కరోనా వైరస్ నివారణకు సంబంధించిన అన్ని ప్రొటోకాల్స్‌ని అమలు చేస్తూ బాధ్యతగా వ్యవహరిస్తున్నప్పటికీ ఈ క్లినిక్కులలో పనిచేస్తున్న వారు తమ ఆందోళనలను వ్యక్తపరుస్తున్నారు. ర్యాపిడ్ టెస్టులను భారీ స్థాయిలో చేయడం అనేదే ఇప్పుడు ఏకైక కార్యక్రమంగా ఉంటున్నప్పటికీ గుడిసెల్లో ఉంటున్న వారు కరోనా వైరస్‌కు కేంద్రాలుగా ఉంటున్నందున ధారవి వంటి మురికివాడల్లో ప్రత్యేకించి మాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లను ఏర్పర్చాల్సిన అవసరం ఉందని వీరు చెబుతున్నారు. పోలీసు బలగాలు కూడా భారీ స్థాయిలో ధారవిలో మోహరించారు కానీ చిన్న చిన్నగదుల్లో నివసిస్తున్న ప్రజలను నిర్బంధంలో ఉంచటం చాలా కష్టంగా ఉంటోంది. ప్రత్యేకించి టాయ్‌లెట్స్ ఉమ్మడిగా ఉపయోగించుకోవడం, ఇళ్లకు బయట ఉంటున్నందున ఇక్కడి ప్రజలను అటూ ఇటూ తిరగకుండా నియంత్రించడం చాలా కష్టమైన పని అని పోలీసు అధికారులు చెబుతున్నారు.

అందుకే ధారవి మురికివాడ కోవిడ్–19 విసురుతున్న పెను సవాలుకు సంబంధించి టైమ్ బాంబులాగా ఉంటోందని వర్ణిస్తే ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఇంతవరకు ఇక్కడ చేసిన కృషి ఏమాత్రం సరిపోదు. ప్రభుత్వం, ఆరోగ్య కార్యకర్తలు, పౌర సమాజం ఈ ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు కలిగిన ప్రాంతంలో వైరస్ నియంత్రణతో ఎలా వ్యవహరించాలనే విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ధారవిని యథాతథ స్థితికి తీసుకురావడం ప్రభుత్వ యంత్రాంగానికి, పౌర సమాజానికి అతి పెద్ద సవాలుగా మారనుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### సోషల్ మీడియా

#### మాస్క్



నా ఎన్ 95 మాస్క్‌ను ఏడుగంటల పాటు నిరంతరాయంగా ధరించడంతో ఆకలి, దాహంతో అలిసిపోయా. నా రక్షణ దుస్తులను జాగ్రత్తగా ధరించిన తరువాత... ఊపిరితిత్తులు సరిగా పనిచేయకపోవడంతో ఆక్సిజన్ సరఫరాపై ఊపిరిపీల్చుకుంటున్న 72 ఏళ్ల వృద్ధుడిని చూడటానికి వెళ్లా. తాను మిషన్ దగ్గర చనిపోవాలనుకోవడం లేదనీ, నీలాకాశాన్ని చూడాలనుకుంటున్నానని చెప్పాడతను. దాంతో ఇద్దరం ఆకాశాన్ని చూస్తూ కూర్చున్నాం. నిర్ణాయక క్షణాల్లోనూ చిన్నిచిన్ని కోరికలు తీరడం ఎంత బావుంటుందో కదా!

– నదియా ఆలమ్, వైద్యురాలు

#### సమోసా



సమోసా తయారు చేయడంలో ఇదే నా మొదటి ప్రయత్నం. అంటే, దీనిని పూర్తిగా నేనే చేశా. దీనిపేరు పంజాబీ ఆలూ సమోసా. నవ్వు ముఖంలా, హృదయాకారంలో పిండిని మలచడం లాంటి వాటన్నింటినీ మాస్టర్ చెఫ్ అయిన మా అమ్మ దగ్గర నుంచి ఆడుతూ పాడుతూ నేర్చుకున్నా. కుటుంబంతో గడుపుతూ.. తెలియనివి నేర్చుకోవడం బావుంది.

– కాజల్ అగర్వాల్, నటి

#### వేతనం



లాక్‌డౌన్ సందర్భంగా మా పనివాళ్లందరికీ పూర్తి వేతనం చెల్లిస్తున్నాం. కానీ, టైలర్లు, బ్యూటీ థెరపిస్టులు, జిమ్ కోచ్‌లు, ప్లంబర్లు లాంటి ఎంతో మంది లాక్‌డౌన్ వల్ల ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని మనకు తెలుసు. ఒక్కొక్కళ్లు ఒక్కొక్కరిని ఆదుకునే విధంగా ఒక క్యాంపైన్ మొదలుపెట్టి, సహాయం కావాలంటే అడగమని కోరితే ఎలా ఉంటుంది?

– షేఫాలీ వైద్య, రచయిత్రి

#### పాజిటివ్



ఈ నెల 4వ తేదీన పశ్చిమ ఢిల్లీలోని మహారాజా అగ్రసేన్ ఆసుపత్రిలో కరోనా వైరస్ సోకిన వ్యక్తి మరణించాడు. అధికారులకు ఆ విషయం తెలియజేయకుండా ఆసుపత్రి వర్గాలు మృతదేహాన్ని బంధువులకు అప్పగించేశాయి. కుటుంబ సభ్యులు కూడా కరోనా వ్యవహారాన్ని కప్పిపుచ్చడంతో అంతిమ సంస్కారానికి పలువురు హాజరయ్యారు. ఇప్పుడు మరణించిన వ్యక్తి కుమారుడికి కరోనా పాజిటివ్ అని తేలింది.

– సాహి మురళీ మెంఘానీ, యాంకర్

#### విద్వేషం



మీరు గనుక న్యూజిలాండ్‌లో ఉన్నట్టయితే ఉమ్మివేయడం ద్వారా ఉద్దేశపూర్వకంగా వూహాన్ వైరస్ వ్యాప్తికి కారణమయ్యారని 14 ఏళ్లు జైలులో పెట్టేవారు. అదే సౌదీ అరేబియాలో అయితే మరణ శిక్షే. కానీ, భారతదేశంలో మాత్రం మీరు చర్చా కార్యక్రమంలో పాల్గొనవచ్చు. విద్వేషపూరితంగా మాట్లాడొచ్చు. ఇది చాలా దారుణమైనది. నేరపూరిత చర్య.

– పాల్కి శర్మ, జర్నలిస్ట్

#### ఇబ్బందులు



కరోనా వైరస్ వ్యాప్తితో పాకిస్తాన్‌లోని మైనారిటీల పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది. పాకిస్తాన్‌లోని హిందూ, క్రైస్తవ మైనారిటీలకు అధికారులు నిత్యావసరాలు అందించడం లేదు.

– ఫరనాజ్ ఇస్పహానీ, రచయిత

ఇన్‌బాక్స్

## బడుగుల ఆశాజ్యోతి పూలే

స్వతంత్ర భారతాన గాంధీజీ 'మహాత్మ' అయితే, స్వతంత్ర భారతానికి వందేళ్ళ ముందే బడుగు బలహీన వర్గాలచే 'మహాత్ముడి'గా జన నీరాజనాలు అందుకున్న సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిబాపూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించిన జ్యోతి రావ్ గోవింద్ రావు పూలే అన్ని రకాలుగా బడుగు బలహీన వర్గాల ప్రజల వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు. ఏడాది వయస్సులోపే తల్లిని కోల్పోయిన పూలే ఒక మరాఠీ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించి, తరువాత చదువు మానివేసి వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉండేవాడు. పుస్తక పఠనం పట్ల చాలా ఆసక్తిని కలిగి ఉన్న పూలేను చూసి ఒక ఉపాధ్యాయుడు, జ్యోతి రావ్ తండ్రిని ఒప్పించి ఆయన విద్యాభ్యాసం కొనసాగేలా చేశారు. చిన్నప్పుడే మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలపై జ్ఞానాన్ని సంపాదించాడు పూలే.



జ్యోతిరావ్‌కు చిన్నప్పటి నుంచే శివాజీ అంటే అభిమానం ఎక్కువ. శివాజీ, జార్జ్ వాషింగ్టన్‌ల జీవితచరిత్రలు ప్రభావితం చేయడంవల్ల దేశభక్తి, నాయకత్వ గుణాలు అలవాటయ్యాయి. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని, స్త్రీలు విద్యావంతులు కావాలని ముందు తన భార్య సావిత్రీబాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఆనాటి సమాజంలో జరిగే బాల్యవివాహాల వల్ల చిన్నతనంలోనే వితంతువులైన మహిళలకు పునర్వివాహాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. దేశంలోనే మొట్టమొదటిగా 'బాలహత్య ప్రతిబంధక్ గృహ' కేంద్రాన్ని స్థాపించి, వితంతు గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. సమసమాజ స్థాపనకై శ్రమించిన జ్యోతిబా పూలే 1890 నవంబర్ 28న కన్నుమూశారు.

(నేడు పూలే 193వ జయంతి)

– డా. కమలేకర్ నాగేశ్వర్‌రావు, అచ్చంపేట । 98484 93223

# మందులు దొరక్క ఎన్‌ఆర్‌ఐల ఇక్కట్లు

సందర్భం



చెన్నూరి వేంకట సుబ్బారావు

అమెరికాలో ఎన్నారైలు ఎప్పుడూ ఎదురుచూడని సంక్లిష్ట స్థితిని నేడు ఎదుర్కొంటున్నారు. అమెరికాలో ప్రస్తుతం ఉంటున్న ఎన్నారైలు ఎక్కువమంది 35–45 ఏళ్ల వయస్సులోని వారే. దాంతో వారు తమకు తోడుగా తల్లిదండ్రులను, అత్తమామలను అమెరికాకు పిలిపించుకోవడం మామూలే. విజిటర్స్ వీసా మీద వారు వచ్చి ఆరునెలలు తమ పిల్లలకు సహాయంగా ఉంటూ ఇండియాకు వెళుతుంటారు. తాము ఉండే కాలానికి తగ్గట్టుగా షుగర్, బీపీ, ఇతర మందులను వారు భారత్ నుంచి తమతో తెచ్చుకుంటారు. కానీ ఇప్పుడు కరోనా వైరస్ అమెరికాను అష్టదిగ్బంధనం చేయడంతో వారి పరిస్థితి కూడా అగమ్యగోచరంగా తయారైంది. లాక్‌డౌన్‌తో వారు ఇండియాకు వెళ్ళలేని పరిస్థితి. అమెరికాలో ఉందామంటే తెచ్చుకున్న మందులు అయిపోయి మందులకోసం వారు పడుతున్న కష్టాలు చెప్పనలవి కావు. టెక్సాస్, కాలిఫోర్నియా, న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ తదితర రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో తెలుగువాళ్ళు ఉన్నారు. తాము ఉండాల్సిన కాలానికి తెచ్చుకున్న బీపీ, షుగర్, ఇతర మందులు అయిపోవడంతో ఆ మందులకోసం వారు పడరాని కష్టాలు పడుతున్నారు. మామూలు సమయాల్లో ఇలాంటివారు ఇండియా నుంచి వచ్చేవారితో, లేదా తెలిసినవారి ద్వారా ఇండియానుంచి మందులను తెప్పించుకుంటారు. కానీ, లాక్‌డౌన్ వేళలో ఇండియా నుంచి మందులు వచ్చే పరిస్థితి లేదు. అమెరికాలోనే మందులు కొందామంటే తమ వల్ల కావడం లేదని పలువురు తల్లిదండ్రులు, అత్తమామలు వాపోతున్నారు. ఎందుకంటే భారతదేశంలో లాగా వీధి చివర ఉన్న మందుల షాపుకు వెళ్ళి తీసుకుని వచ్చేంత ఈజీగా అమెరికాలో కుదరదు. దానికి చాలా ప్రొసీజర్ ఉంటుంది. పేషెంట్‌కు మందులు ఇవ్వాలని డాక్టర్ ఇచ్చే ప్రిస్కిప్షన్‌తోపాటు, వాళ్ళు ఎంక్వైరీలు చేసిన తరువాతనే మందులను ఇస్తారు. ఎవరైనా ఫార్మసీ షాప్‌కు వెళ్ళి తమ డాక్టర్ ఇచ్చిన చీటి చూపగానే వాళ్ళు డాక్టర్ ఎవరో నిర్ధారించుకుని ఎన్పీఐ (నేషనల్ ప్రొవైడర్ ఐడెంటిఫికేషన్) నెంబర్ అడుగుతారు. అలాగే డీఈఏ (డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ) నెంబర్ అడుగుతారు. ఇప్పుడు తెలుగువారికి సహాయం చేయడంకోసం ముందుకు వచ్చిన డాక్టర్లు కూడా ఒక్కో ఫార్మసిస్ట్‌తో మాట్లాడి, ఒక్కో కేసు విశదీకరించేందుకు సమయం చాలడం లేదు. దానికితోడు ఆ ఫార్మసిస్ట్‌ను ఒక్కో కేసుకు సంబంధించి కన్విన్స్ చేయడం కుదరడం లేదు.

ఈ విషయంపై శాండియాగోలో వున్న హైదరాబాద్ వాస్తవ్యులు పాలకోడేటి ప్రభాకర్, ఉష దంపతులు మాట్లాడుతూ తాముతమ కుమార్తె స్వాతి దగ్గరకు వచ్చామని, తిరుగు ప్రయాణం అనుకున్నట్టుగా ఏప్రిల్ నెలలో వెళ్ళలేమని, తమ మందులు అయిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డల్లాస్‌లో తెలుగువారికి సుపరిచితులైన డాక్టర్ శ్రీనివాస రెడ్డి ఆళ్ళ మాట్లాడుతూ వ్యక్తిగతంగా చాలా ఏళ్లుగా తనకు తెలిసిన తెలుగువారి తల్లిదండ్రుల మెడికల్ అవసరాలకు సహాయపడుతూ ఉంటానని, ఇప్పుడు కరోనా నేపథ్యంలో ఈ సమస్య పెద్దది అయ్యిందని, ప్రతి పట్టణంలో తనలాంటి డాక్టర్లు కలిసి కొంతవరకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఫిలడెల్ఫియాలో నివసిస్తున్న నాగరాజు నలజుల మాట్లాడుతూ చాలామంది తెలుగు వారు తమ ఇంటిలో వున్న పెద్దవారి మెడికల్ అవసరాలకు సహాయం కోసం వస్తున్నారని, మా పట్టణంలోనే వున్న డాక్టర్ ప్రమీల నాయుడుగారు వారికి సలహాలు ఇస్తున్నారని, ఆవసరం అయితే పేషెంట్‌గా గుర్తించి వైద్య సదుపాయాలు కూడా చేస్తున్నారని తెలిపారు. బే ఏరియాలో వున్న తానా ఉపకోశాధికారి వెంకట్ కోగంటి మాట్లాడుతూ అమెరికాలో వచ్చిన విజిటర్స్ తగిన ఇన్సూరెన్స్ కవరేజ్ లేకుండా మెడికల్ సౌలభ్యం పొందటం కష్టమే కాకుండా చట్టరీత్యా తప్పు కూడా కనుక తెలుగువారు ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించుకోవాలి అన్నారు.

ఆటా అధ్యక్షుడు పరమేష్ భీంరెడ్డి మాట్లాడుతూ, ఒకట్రెండురోజుల్లో ఒక డాక్టర్ ప్యానెల్ ఏర్పాటు చేసి వారిని ఈ–మెయిల్ ద్వారా సంప్రదించే ఏర్పాటు చేస్తామని, అప్పుడు ఆ డాక్టర్లు కూడా వారి ఫ్రీ టైమ్‌లో వారికి వచ్చిన ఈ–మెయిల్ చూసి ప్రిస్క్రిప్షన్‌లో ఉన్న మందులను గుర్తించి వారికి ఈ–మెయిల్ ద్వారా జవాబు ఇస్తారని చెప్పారు. అప్పుడు ఎవరికి వారు తమ దగ్గరలో ఉన్న ఫార్మసిస్ట్ దగ్గరకు వెళ్లి ఆ మందులు కొనుక్కొని వారి తల్లిదండ్రులు, అత్తమామలను వీలున్నంతవరకు అటెండ్ కావచ్చని పరమేష్ భీంరెడ్డి తెలిపారు.

వ్యాసకర్త సంపాదకులు, తెలుగుటైమ్స్ పత్రిక, అమెరికా

## రామావతారం

దుష్టశిక్షణ, శిష్టరక్షణలకై రూపొందిన హరి అవతారాలలో శ్రీరామావతారం ఒకటి. రాముని అవతారానికి అనేక కారణాలున్నాయి. వైకుంఠ ద్వార పాలకులుగా ఉన్న జయ, విజయులు, సనకసనందుల శాపంతో రాక్షస వంశంలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులై జన్మించారు. వరాహ, నృసింహ రూపాలలో ఉన్న హరిచే హతులయ్యారు. వారే రావణ, కుంభకర్ణులుగా జన్మించారు. అప్పుడు హరి, రాముడై అవతరించాడు.

నారదుడు తాను జితేంద్రియుణ్ణని శివుని దగ్గర, హరి దగ్గర ప్రగల్భాలు పలికినప్పుడు అతనికి తగిన శాస్తి చేయాలని హరి మాయ కల్పిస్తాడు. అందులో ఒక రాజ కుమార్తెను స్వయంవరంలో చూసి నారదుడు ఆమెను మోహించి పెళ్లాడాలని అనుకుంటాడు. హరిని ప్రార్థించి, తనకు హరి రూపాన్నిమ్మంటాడు. హరి సరేనంటాడు. నారదుడు తన రూపాన్ని చూసి ఆమె తననే వరిస్తుందనుకుంటాడు. కానీ, నారదుడు రాజకుమార్తె కళ్లకు కోతిలాగా, సభికుల కళ్లకు మునిలా కనిపిస్తాడు. రాజకుమార్తె స్వయంవరంలో రాజు రూపంలో ఉన్న హరిని వరిస్తుంది. అక్కడకు వచ్చిన శివ సేవకులు ఇద్దరూ పరిహసిస్తూ నారదుని అద్దంలో ముఖాన్ని చూసుకొమ్మంటారు. జలంలో ప్రతిబింబం కోతిలా ఉండటం చూసి, నారదుడు కోపంతో హరిని నిందించి ఏ రాజ రూపంతో తనను వంచించాడో అలాగే రాజులా భూమిపై అవతరించి, భార్యా వియోగాన్ని అనుభవించమని శపిస్తాడు. తనకు కోతి రూపాన్నిచ్చి పరాభవించాడు కాబట్టి కోతులనే ఆశ్రయిస్తాడని శపిస్తాడు. శివ సేవకులను రాక్షసులుగా పుట్టమని శపిస్తాడు. వారే రావణ, కుంభకర్ణులుగా పుడతారు. రామావతారానికి నారద శాపం ఒక కారణం. స్వాయంభువ మనువు, శతరూపలు కొన్నివేల సంవత్సరాలు ఘోర తపస్సు చేశారు. హరి ప్రత్యక్షమైనప్పుడు ఆ జగన్మోహనాకారాన్ని ఎంత చూసినా తనివితీరక తమ పుత్రుడుగా జన్మించమని హరిని కోరుకుంటారు. హరి అయోధ్యలో వీరి గర్భంలోనే రాముడిగా అవతరిస్తానని వరమిస్తాడు. త్రేతాయుగంలో వీరే దశరథుడు, కౌసల్యలుగా అవతరించారని కథ. శ్రీరామావతారానికి కారణాలనేకం!




– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 11-4-2020

సంతోషం సగం బలం అన్నారు. అందుకే దానిని అందరితో పంచుకుంటాం.
కాని దుఃఖం కూడా బలమే. మన స్పందనాగుణానికి కొలబద్ధ.
నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి అన్నాడు ఆత్రేయ.
కాని ఏడ్చే సందర్భాలలో వచ్చే కన్నీరు మనసును తేలికపరుస్తుందని నమ్మేవారున్నారు.
జపాన్‌లో 'క్రయింగ్ క్లబ్స్' ఫేమస్. మన దేశంలో సూరత్‌లో ఉంది.
ఉద్వేగాలు చుట్టుముట్టినప్పుడు, నిరాశ నిస్పృహలు లొంగదీస్తున్నప్పుడు
వాటిని ఎదిరించడానికి కన్నీరును మించిన ఆయుధం లేదు.
కరోనా వొత్తిడిని అశ్రువులతో జయించండి.

# అశ్రువులూ ధైర్యమిస్తాయి



అప్పుడే పుట్టిన శిశువు ఏడుస్తూ ఏ భూమ్మీదకు వొస్తాడు. అది దుఃఖం కాదు. తన రాకను వ్యక్తం చేసే ఆనందం. కళ్లు స్వచ్ఛమైన స్పందనావయవం. అవి అబద్ధం చెప్పలేవు. కల్మషంతో ఉండలేవు. కళ్లలోకి చూసి ఎదుటి మనిషి ఆలోచనలను పసిగట్టవచ్చు. అందుకే కళ్లు లోపలి భావోద్వేగాలకు కూడా అంతే స్వచ్ఛంగా స్పందిస్తాయి. సంతోషం వచ్చినా, దుఃఖం కలిగిన స్రావాలను వెదజల్లుతాయి. నలుగురితో చెప్పుకుంటే బాధ తగ్గుతుంది అంటారు పెద్దలు. నలుగురితో కలిసి ఏడిస్తే ఇంకా తగ్గుతుంది అంటున్నారు రోదన ప్రియులు.

**ఏడుపు చెడ్డది కాదు**

మన సమాజంలో ఏడ్వడాన్ని బలహీనమైన స్పందనగా చూశారు. ఏడుపు దాచుకుని ఉండటానికి 'ధీరో లక్షణంగా' చూశారు. స్త్రీలు తమ స్పందనను రోదన రూపంలో ఎక్కువ వ్యక్తపరచడానికి న్యూనత పరిచారు. 'ఏడ్చే మగాణ్ణి నమ్మొద్దు' అని కూడా అన్నారు. కన్నీరుకు అంత తక్కువ విలువ ఎందుకు ఇస్తున్నట్టు? గమనించి చూస్తే చిన్న పిల్లలకు ఏడుపు, కన్నీరు ఆయుధాలు అని గ్రహిస్తాము. వాళ్లు ఏది కావాలన్నా ఏడ్చి సాధించుకుంటారు. మనం కూడా ఎదుటివారు కన్నీళ్లు పెట్టుకొని ఏదైనా విషయం విన్నవించుకుంటే కరిగిపోతాము. మరి ఏడుపు బలమైన వ్యక్తీకరణే కదా. 'దుఃఖం, విషాదం, బాధ కలిగినప్పుడు గుండె ఆ భావోద్వేగాలతో బరువెక్కుతుంది. వాటిని బయటపడేసి తేలికపడాలనుకుంటుంది. అందుకు కన్నీటిని మార్గంగా ఎంచుకుంటుంది' అంటారు సూరత్‌లో 'క్రయింగ్ క్లబ్' నడుపుతున్న కమలేష్ మసాలావాలా. ఈయన అక్కడ 'లాఫింగ్ క్లబ్' నడిపేవారు. కాని కన్నీటికి ఉన్న స్వాంతనగుణం అర్థమయ్యాక 'క్రయింగ్ క్లబ్' నడుపుతున్నాడు. ప్రతి నెలలో ఆఖరు ఆదివారం ఈ క్లబ్ సభ్యులంతా సామూహికంగా ఏడుస్తారు. తమ గోడు వెళ్లబుచ్చుకుంటారు. తేలికపడి వెళతారు. ఏది చెప్పకున్నా తోటివారితో మనసారా ఏడ్చి సేద తీరేవారు కూడా ఉంటారు. 'నా ఉద్యోగ వొత్తిడిని నేను ఇంటికెళ్లి కోపంగా మార్చి నా భార్య మీద చూపలేను. ఇక్కడ మనసారా ఏడ్చానంటే సగం విముక్తం అవుతాను' అని ఈ క్లబ్ సభ్యుడైన ఒక పురుష ఉద్యోగి అన్నాడు. 'ఇక్కడికొచ్చి నలుగురితో కలిసి ఏడుస్తూ ఉంటే కష్టలు, సమస్యలు, బాధలు, వొత్తిడి మన ఒక్కరి సొంతం కాదని మనలాంటి వాళ్లు చాలామంది ఉంటారని ఒక ధైర్యం వస్తుంది' అని మరో పురుష సభ్యుడు అన్నాడు. 'మగవాళ్లను ఏడవ్వొద్దు అంటారు కాని ఆ అవసరం వారికే ఎక్కువ' అని మరికొందరు చెప్పారు.

**ఇప్పుడు ఏడ్వాలని ఉందా?**

అనంతమైన వేదన కలిగినప్పుడు మనిషి చేసే పని దేవుని ముందుకెళ్లి రోదించడం. కన్నీళ్లతో ప్రాధేయ పడటం. హిందూమతంలోకాని, ఇస్లాం, క్రైస్తవాలలో గాని దేవుని ముందు కన్నీటి విన్నపాలకు గౌరవం ఉంది. దేవుడు ఆ మొర ఆలకించినా ఆలకించకపోయినా ఆ ఏడుపు గుండెలను తేలిక పరుస్తుంది. ప్రతి మనిషికి అంతర్ కారణాల రీత్యా, బాహ్య కారణాల రీత్యా ఒక్కోసారి తీవ్ర నిస్సహాయత, ఆందోళన, వేదన, భయం, దుఃఖం కలుగుతాయి. అప్పుడు ఆ ఉద్వేగాన్ని లోలోపలే దాచిపెట్టడం చాలా అనవసరం. అనారోగ్యం. వాటిని బయటకు వెదజల్లాలి. అందుకు ఏడ్వాలి. ఒక్కరే ఏడ్వగలిగితే మంచిది. ఏవరితోనైనా చెప్పుకుని ఏడిస్తే మరీ మంచిది. ఇప్పుడు కరోనా వంటి విపరీత సమయంలో అంతటా భయాందోళనలు నిండి ఉన్న సమయంలో గంభీరంగా ఉండాల్సిన పని లేదు. దేవును ముందు ప్రార్థిస్తూ ఏడ్వదిలిస్తే హాయిగా ఏడవండి. మిత్రులతో మీ ఆందోళనను పంచుకుంటూ నిస్సిగ్గుగా ఏడవండి. వాళ్లు కూడా అదే ఆందోళనతో ఏడిస్తే కలిసి రోదించండి. ఇవన్నీ ఉద్వేగ మలినాలని శుభ్రపరుస్తాయి. దూరం దూరంగా ఉండి పోయిన కుటుంబ సభ్యులు, ఎక్కడెక్కడో చిక్కుబడిపోయిన అయినవాళ్లు, స్నేహితులు... అందరూ ఫోన్ ద్వారా, వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకుంటూ, వస్తే కన్నీరు కారుస్తూ తేలికపడటంలో తప్పులేదు. ఒక్కసారి ఏడ్చేశాక ధైర్యం వస్తుంది. ఒక ఉదాత్త భావన కలుగుతుంది. సిట్యుయేషన్ పట్ల నిర్లిప్తత ఏర్పడుతుంది. ఇప్పుడు కాలసింది అదే. కనుక ఏడ్చి తేలిక పడండి.

– సాక్షి ఫ్యామిలీ

# అచ్చుకైనా లేదు



బ్యాట్‌మన్, సూపర్‌మ్యాన్, హల్క్, స్పైడర్‌మ్యాన్, వండర్ ఉమన్ వంటి భూమికలెన్నిటికో పురుడు పోసిన కామిక్ బుక్స్ పుటలను మూసేశాయి. కరోనా భయం కామిక్ పుస్తకాలనూ పట్టుకుంది. దాంతో కొత్త కథలతో కామిక్ పుస్తకాలను ప్రచురించడం ఆపేశాయి అమెరికాలోని ప్రచురణ సంస్థలు. సూపర్‌మ్యాన్ సృష్టితో (1938) ఈ కామిక్ బుక్స్ కథలు చెప్పడం మొదలుపెట్టాయి. అప్పటి నుంచ ఇప్పటి వరకు ఈ ఎనభై ఏళ్ల కాలంలో వీటి ప్రచురణను ఆపిన చరిత్ర ఎప్పుడూ లేదు. రెండో ప్రపంచ యుద్ధం, ఇంకే ప్రకృతి వైపరీత్యం, వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ కూలినప్పుడు కూడా కామిక్ పుస్తకాల ప్రచురణ ఆగలేదు. టీవీ వచ్చాక వీటి ఆదరణ కాస్త తగ్గినా.. పూర్తిగా అదృశ్యమైపోలేదు. పైగా కొత్త రూపు తీసుకున్నాయి యానిమేషన్ చిత్రాలుగా, చలన చిత్రాలుగా. కాని ఇప్పుడు కరోనా ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేసింది. తొలినాళ్లలో కామిక్ పుస్తకాలను ప్రమోట్ చేయడానికి నిత్యావసర సరకుల దుకాణాల్లో, పెట్రోల్ బంకుల్లో పంచేవారట. అవి చదవడం జనాలకు అలవాటయ్యాక అప్పుడు న్యూస్ పేపర్ల స్టాండ్స్‌లోకి.. ఆ తర్వాత పుస్తకాల దుకాణాల్లోకి మారాయి. పాఠకాదరణ మరింత పెరిగి కామిక్ బుక్స్ కోసమే ప్రత్యేక బుక్ షాప్స్ వెలిశాయి. అంతటి ఆదరణనూ అచ్చుకైనా కనపడకుండా చేసింది కరోనా.



పులి గాండ్రిస్తుంది. సింహం గర్జిస్తుంది.
ఏనుగు ఘీంకరిస్తుంది.
మనిషి?
మనిషి.. 'హారన్' కొడతాడు!
గాండ్రించే పులి కూడా
గర్జించే సింహం కూడా
ఘీంకరించే ఏనుగు కూడా
'హారన్'కు అదిరిపడతాయి.
లాక్‌డౌన్‌తో ఇప్పుడు హారన్ సౌండ్ లేదు.
వన్యప్రాణులకు పీస్ ఆఫ్ మైండ్!
మనిషి 'లోపల' ఉన్నాడు కదా.
ఇప్పుడు వాటికి చాన్సొచ్చింది.
లోపల్నుంచి బయటికొస్తున్నాయి!

# చాన్సొచ్చింది

ఒక్క జంతువులు, పక్షులేనా! నింగి నాట్యమాడుతోంది. నేల విహంగమౌతోంది. చంద్రుడు తెల్లటి గడ్డ పెరుగు. సూర్యుడు మరికొన్ని ఎల్యీడీల వెలుగు. అద్దం తుడిచినట్లు నదులు. కడిగి బోర్లించిన గిన్నెల్లా కనుచూపు కొండలు. బాగుంది కవిత్వం. బ్యాంకుల్లో డబ్బులేవి? బియ్యం డబ్బాల్లో నిల్వలేవి? ఆఫీస్‌లలో కొలువులేవి? వేసవికి సెలవులేవి? కరువు, కవిత్వం ఎప్పుడూ ఉండేవే. లాక్‌డౌన్‌కు ముందు మాత్రం.. జీవితంలో అది లేదని, ఇది లేదని నోరు చప్పరించలేదా? ఇన్నాళ్లూ ప్రకృతిని బోనులో ఉంచి మనం విహరించాం. ఈ కొన్నాళ్ల బందిఖానా నుంచి ప్రకృతి వింతలను వినోదిద్దాం.

•••

మార్చి 25 అర్ధరాత్రి నుంచి మన దగ్గర లాక్‌డౌన్ మొదలైంది. దేశానికి 1947లో అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చినట్లే.. నేచర్‌కీ ఇది అర్ధరాత్రి స్వతంత్రం! పది రోజులు గడిచాయి. స్వాతంత్ర్యం ఎంత స్వేచ్ఛను ఇస్తుందో ఒక్కో ప్రాణీ మనకు చూపించడం మొదలైంది. ఉత్తరాఖండ్‌లో మూడు సంబార్ జాతి జింకలు వీధిల్లోకి వచ్చాయి. తప్పిపోయినట్లు రాలేదు. తాపీగా రొడ్డెక్కాయి. నోయిడాలో నీలంరంగు ఎద్దు (నీల్‌గాయ్) తోకను ఆడించుకుంటూ, చేతులు వెనక్కు పెట్టుకుని నెమ్మదిగా.. 'దారంతా నాదే' అని నడుస్తున్న మనిషిలా తిరిగింది. డెహ్రాడూన్‌లో గజరాజు షికారు కొట్టింది. కోళికోడ్‌లో చిన్న పునుగుపిల్లి.. 'ఏమైపోయారు ఈ మనుషులంతా..' అనో ఏమో.. వెనక్కు చూసుకుంటూ ముందుకు వెళ్లింది. ఆలివ్ 'రిడ్లే' తాబేళ్లు ఒడిశా బీచ్ అలలపై జారుడు బండ ఆడాయి! కర్ణాటకలో ఒక అడవి దున్న మార్కెట్‌లోకి వచ్చింది. ముంబై వీధుల్లో నెమళ్లు నాట్యమాడాయి. పాట్నా దగ్గరి వైమానిక స్థావరంలో చిరుత ఒకటి తిండి మాని మరీ ఆటలు ఆడింది. తిరుపతి ఘాట్‌రోడ్‌లలో లేళ్లు గంతులేశాయి. ఏటూరు నాగారంలో ఎలుగుబంట్లు అభయారణ్యం నుంచి కంచె దాకా వచ్చి 'వాటీజ్ హ్యాపెనింగ్! డప్పుల్లేని లోకంలోకి వచ్చిపడ్డామా' అని జిల్లా ఫారెస్టు ఆఫీసర్‌ల వైపు చూశాయి.



సంబార్ జింకలు, ఉత్తరాఖండ్



నీల్‌గాయ్, నోయిడా



పునుగుపిల్లి, కోళికోడ్



జలంధర్ నుంచి కనిపిస్తున్న ధౌలాధర్ కొండలు



తేటపడిన 'యమున': వజీరాబాద్ బ్యారేజ్, నార్త్ ఢిల్లీ



కాన్పూర్‌లో 'గంగ'లో నింగి

లాక్‌డౌన్‌తో బయటికి వస్తున్న వాటిలో కొన్ని అరుదైన జీవులు. కొన్ని అంతరించిపోతున్న జీవులు. సంబార్ జాతి జింకలు బలంగా ఉంటాయి. సంఖ్యలో మాత్రం బలహీనం. 'రెడ్ లిస్ట్'లో ఉన్నాయి. పులులు, ఎలుగులు, రిడ్లే తాబేళ్లు కదలికలు ఉండేవీ కానీ అస్తమానం కనిపించేవి కావు. అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, పోలండ్, ఇంగ్లండ్‌లోనూ అడవుల నుంచి జంతువులు బయటికి వస్తున్నా.. ఇంత పెద్ద దేశంలోని నూటా ముప్పై కోట్ల జనాభా ఒక్కసారిగా ఇళ్లలోనే లాక్ అయిపోవడంతో, మన మూగజీవులకు పెద్ద బ్లాక్ తొలగిపోయింది. ఎం.ఎస్.రామారావు గారు పాడినట్లు.. 'ఈ విశాల, ప్రశాంత, ఏకాంత..' లాక్‌డౌన్‌లో మనుషులు నిదురిస్తుంటే.. జంతు ప్రపంచం ఒళ్లు విరుచుకుని లేస్తోంది.

•••

జలంధర్‌లో ఈమధ్య ఉదయాన్నే నిద్రలేచి బాల్కనీలోకి వచ్చినవాళ్లు దూరంగా కనిపిస్తున్న ధౌలాధర్ కొండల్ని చూసి షాక్ తిన్నారు. రాత్రికి రాత్రి ఇంటి ముందుకు కొండ వచ్చేస్తే అలాగే ఉంటుంది మరి. గత ముప్పై ఏళ్లుగా పరిశ్రమల కాలుష్యంలో మసకబారి క్రమంగా అదృశ్యం అయిపోయిన ఆ కొండలు ఈ లాక్‌డౌన్‌లో క్లీన్ అయి కళ్లముందుకు వచ్చాయి.

దేశంలో ఇంకా చాలా కాలుష్యాలు తగ్గిపోయాయి. ఢిల్లీ, మిగతా మెట్రో నగరాలు వానొచ్చి కడిగేసినట్లుగా అయ్యాయి. బెంగళూరులో ప్రాణవాయువు నాణ్యత పెరిగింది. గంగా యమునా నదీ జలాలు తేటపడ్డాయి. 'ఆశ్చర్యం' అంటున్నారు డాక్టర్ పి.కె.మిశ్రా. వారణాసిలోని ఐఐటిలో కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఆయన. 'యమున' గురించైతే 'అన్‌బిలీవబుల్.. బట్ ట్రూ' అంటుంటోంది కేంద్ర 'జలశక్తి' మంత్రిత్వ శాఖ. పరిశ్రమలు, కర్మక్రియలు ఆగిపోయి నదులు ప్రక్షాళన అయ్యాయి.

అంతా మన మంచికే అనుకోవడం నిర్వేదం కాదు, జీవనవేదం కాదు. వాస్తవం. పరుగుల జీవితంలోని ఈ తాత్కాలిక విరామంలో మన ఇళ్లూ, ఒళ్లు కూడా శుభ్రం అవుతున్నాయి. అవనిద్దాం. అవని చోటును అవనికే ఉంచేద్దాం.

# ఈ వెంటిలేటర్ చిన్నదీ, చవకైనదీ!

ఈ కథనంలో ఉన్న చిత్రంలో మీరు చూస్తున్న వెంటిలేటర్ అతి చిన్నదీ... చాలా చవకైనది. 'ఏ–సెట్ రొబోటిక్స్' అనే రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ దివాకర్ వైష్ దీన్ని రూపొందించారు. ఈయన గతంలో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో మొట్టమొదటి 3–డీ ప్రింటెడ్ హ్యూమనాయిడ్ రోబోనూ (దీని పేరు మానవ్), మన మనసు ఆజ్ఞలతో నడిచే వీల్ చైర్‌నూ తయారు చేశారు. పూర్తిగా దేశీయంగా... తయారవుతున్న ఈ వెంటిలేటర్ల ప్రత్యేకతలు ఎన్నో ఎన్నెన్నో. ఉదాహరణకు కొన్ని చూద్దామా?



దివాకర్



- ప్రపంచంలోనే అత్యంత చిన్న వెంటిలేటర్ ఇది.
- ఇది ఎంత చిన్నదంటారా? మన హాస్పిటళ్లలో ఉపయోగించే మామూలు వెంటిలేటర్ల సైజులో దీనిది 450వ వంతు. అంటే ఓ సాధారణ వెంటిలేటర్ స్టాండ్‌తో కలిపి దాదాపుగా ఓ చిన్న పిల్లాడి సైజ్ అంత ఉంటే... ఇది మాత్రం వాడి జేబులో పట్టేంత చిన్నదిగా ఉంటుంది. మరో పోలిక చెప్పాలంటే... మన ఇళ్లలో వాడే 'ఫ్లెక్స్ బాక్స్' అంత ఉంటుంది. చూడ్డానికి దాదాపూ అలాగే ఉంటుంది.
- ఈ వెంటిలేటర్‌ను బ్లూటూత్‌తో, మన స్మార్ట్ ఫోన్‌లోని ఒక ఆప్ సహాయంతో ఇంట్లోనూ వాడుకోవచ్చు.
- దీన్ని వాడటానికి ఆక్సిజన్ సిలెండర్ కూడా అక్కర్లేదు.
- ఎటూ కదలలేకుండా ఉంటే పక్షవాతం రోగులు దీన్ని కొని ఇంట్లోనే వాడుకోవచ్చు.
- దీని ఖరీదూ, సైజూ చిన్నదైనందున పెద్ద పెద్ద నగరాల్లోని హాస్పిటల్స్ మాత్రమే కాదు... చిన్న చిన్న పట్టణాలూ, పల్లెల్లోని డాక్టర్లు సైతం దీన్ని వాడుతూ... సంక్లిష్టమైన స్థితిలో ఉన్న రోగిని నగరానికి చేర్చే వరకు ప్రాణాలను కాపాడవచ్చు.

మామూలు వెంటిలేటర్ ధర దాదాపు ఐదారు లక్షల రూపాయల నుంచి రూ. 15 లక్షల వరకు ఉంటుంది. కానీ దీని ధర అటు ఇటుగా దాదాపుగా పదిహేనువేల రూపాయలు మాత్రమే. అంటే మామూలు పెద్ద వెంటిలేటర్ల ధరలో వందో వంతు. రేయింబవళ్లూ కష్టపడి నెల రోజుల్లోపల కనీసం 20,000 వెంటిలేటర్లను మన హాస్పిటల్స్‌కు అందిస్తానని గత నెల 22న ప్రొఫెసర్ దివాకర్ వైష్ ట్వీట్ చేశారు. అంటే... మరో పదిహేను రోజుల్లో ఈ కొత్త వెంటిలేటర్లను మనం వాడటమే కాదు... అతి త్వరలోనే... మొన్నటి హైడ్రాక్సీ క్లోరోక్విన్‌లాగే ప్రపంచానికీ అందించగలం. అదీ మన సత్తా!!

**కరోనా వారియర్స్**

# కవలలు పాడిన కరోనా సాంగ్

కరోనా వైరస్‌ని అరికట్టడానికి లాక్డౌన్ టైమ్‌లో ఎలా ఉండాలి, ఆరోగ్యకార్యకర్తలను ఏ విధంగా చూడాలనే అంశాలను పాటలుగా కట్టి ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నారు ఈ కవలలు. జమ్మూలో ఇటీవలే పదవ తరగతి పూర్తి చేసిన సాయిబా గుప్త, సయేషా గుప్తలు తాము పాడిన పాటను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. నెటిజన్లను ఆకట్టుకుంటున్న ఈ పాట ద్వారా లాక్డౌన్ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, సామాజిక దూరాన్ని కొనసాగించాలని ఈ కవలలు కోరుతున్నారు.

**టీనేజర్లు పాడిన పాట..**

'ఇస్‌కో భారత్‌సే కైసే భగాయే .. జిందగీ ఓ హమ్‌కో కైసే బచాయే.. కరోనా సే డరోనా..' అంటూ కలిసి గానం చేసిన ఈ కవలలు ప్రస్తుత లాక్డౌన్ రోజులను తమలోని గాన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు. జనంలో అవగాహన కలిగించడానికి ఇప్పటికే ఎంతోమంది రచయితలు, సంగీతకారులు తమ వంతు అవగాహన చేపడుతున్నారు. ఇదే కోవలోకి చేరుతున్న ఈ ఇద్దరు



తోబుట్టువులు జమ్మూలోని ప్రెజెంటేషన్ కాన్వెంట్ స్కూల్లో ఇటీవల పదవతరగతి పూర్తి చేశారు. 'ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకున్నాక కరోనా వైరస్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి మా వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రజలు భయపడకూడదు. ప్రభుత్వంతో సహకరించాలి. వైరస్ వ్యాప్తిని నివారించడానికి ఆరోగ్య అధికారులు సూచించిన విధంగా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి' అని ఈ ఇద్దరమ్మాయిలు చెబుతున్నారు. ఎటువంటి కారణం లేకుండా తమ ఇళ్ల నుండి బయల్దేరిన వారు తమ ప్రాణాలను మాత్రమే కాకుండా, తమ కుటుంబంలోని వారి ప్రాణాలనూ ప్రమాదంలోకి నెడుతున్నారు' అంటోంది సయేషా.

**మరో సాంగ్..**

ఈ ఇద్దరు అమ్మాయిల గానానికి ముచ్చటపడిన వారి తల్లిదండ్రులు, ఇద్దరు డాక్టర్ల అంగీకారంతో మరొక పాటను కూడా కంపోజ్ చేశారు. ఇటీవల ఆరోగ్య కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై సాయిబా, సయేషాలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. 'వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు దేశానికి గొప్ప సేవ చేస్తున్నారు. వారిపై దాడులు జరుగుతుండటం చాలా బాధగానూ, భయానకంగానూ ఉంది' అంటున్నారు ఈ కవల సోదరీమణులు.

**లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్**

## పెంచిన తల్లి

బోస్టన్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు బాషా ముఖర్జీ (24). మార్చి రెండోవారంలో ఆమె సెలవు మీద ఇండియా వచ్చారు. తిరిగి వెళ్దామంటే లాక్‌డౌన్. ఎక్కడి విమానాలు అక్కడే ఆగిపోయాయి. అయితే తను ఆగలేకపోయారు. ఇంగ్లండ్‌లో కరోనా కేసులు పెరుగుతున్నాయని విని కోల్‌కతాలోని బ్రిటిష్ హై కమిషనర్ సహకారం తీసుకున్నారు. మెడలో స్టెతస్కోప్ వేసుకుని, రెక్కలు కట్టుకుని బోస్టన్ వెళ్లిపోయారు. ముఖర్జీ తల్లిదండ్రులది కోల్‌కతా. నాన్న దుర్గాదాస్, అమ్మ మధుమిత, తమ్ముడు ఆర్య. ముఖర్జీకి ఎనిమిదేళ్ల వయసులో ఆ కుటుంబం ఇంగ్లండ్ వెళ్లి అక్కడే స్థిరపడింది. మంచి ఐక్యూ ఉన్న అమ్మాయి ముఖర్జీ. గత ఏడాది 'మిస్ ఇంగ్లండ్' టైటిల్ కూడా గెలుచుకున్నారు. మోడలింగ్‌లోకి వెళ్లకుండా వైద్య వృత్తిలోనే ఉండిపోవాలని ఆమె నిర్ణయించుకోవడం ఈ కష్టకాలంలో.. పెంచిన తల్లి ఇంగ్లండ్‌కి ఎంతో మేలయింది.



డాక్టర్ బాషా ముఖర్జీ

## ఇప్పటికి ఒకటయ్యాయి



ఇంగ్ ఇంగ్, లె లె

మనుషుల సంచారం లేకపోవడంతో 'జూ'లో జంతువులు కూడా ఉల్లాసంగా ఉంటున్నాయి. హాంకాంగ్‌లోని 'ఓషన్ పార్క్' జూ లో.. పదేళ్లుగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒక్కనాడూ కలవని ఇంగ్ ఇంగ్, లె లె అనే పాండాల ఆడామగ జంట ఈ లాక్‌డౌన్ లో తమంతట తామే కలవడం జూ సంరక్షణ అధికారులకు గొప్ప సంతోషకరమైన విషయం అయింది. పద్నాలుగేళ్ల వయసున్న పాండాలవి. ఈడూజోడుగా ఉన్నా ఏనాడూ ఒకదానిలో ఒకటి తోడు వెతుక్కోడానికి అవి ఆసక్తి చూపలేదట. ఇన్నాళ్లకు వాళ్ల కల ఫలించింది. పాండాల జీవిత కాలం ఇరవై ఏళ్ల వరకు ఉంటుంది. ఇంగ్ ఇంగ్, లె లె.. జీవితం మొత్తం ఇలాగే నిస్సారంగా, నిర్లిప్తంగా ఉండిపోతాయేమోనని అనుకున్న అధికారులకు వాటి కలయిక ఊహించని వరమే.

## లాక్‌డౌన్‌లో ఎంపీ

బీజేపీ ఎంపీ సంగీత కుమారి సింగ్ దేవ్.. ఇంట్లో కుట్టు మిషన్‌పై తనే స్వయంగా కరోనా మాస్కులు కుడుతూ చుట్టుపక్కల పేద కుటుంబాలకు పంపిణీ చేయిస్తున్నారు. ఈ అత్యవసర స్థితిలో ఎవరికి చేతనైనా సహాయం వారు చేయాలని కూడా ఆమె ట్వీట్ చేశారు. సంగీత ఒడిశా లోని బోలంగిర్ లోక్ సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బోలంగిర్ సంస్థాన పూర్వపు రాజవంశీకుడైన ఆమె భర్త కనకవర్ధన్ సింగ్ మాజీ ఎమ్మెల్యే. ఆయన కూడా ఈ కరోనా సమయంలో ప్రజల అవసరాలను గుర్తించి భార్యకు సహాయంగా ఉంటున్నారు.



సంగీత కుమారి సింగ్ దేవ్

## కరోనా యోధురాలు



కుల్వంత్ నిర్మల్

పంజాబ్‌లోని మొహాలీలో 81 ఏళ్ల కరోనా పేషెంట్ కుల్వంత్ నిర్మల్.. మధుమేహం, అధిక రక్తపోటు ఉండి కూడా కరోనా నుంచి బయటపడటం పెద్ద విశేషం అయింది. ఆమెను అభినందిస్తూ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ ఆమె మాట్లాడుతున్న వీడి యోను షేర్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలను చక్కగా పాటిస్తే కరోనాను సులభంగా జయించవచ్చునని ఆ వీడియోలో కుల్వంత్ నిర్మల్ చెప్పారు. కరోనా ప్రధానంగా ఊపిరితిత్తులను బలహీనపరిచే వ్యాధి. వృద్ధాప్యంలో ఊపిరితిత్తులు అసలుకే బలహీనంగా ఉంటాయి. అందుకే వృద్ధుల్లో ఎక్కువగా కరోనా మరణాలు కనిపిస్తున్నాయి. అయితే కరోనా చెలగాటానికి వయసుతో సంబంధం లేదని కొన్ని కేసులలో నిర్ధారణ అవుతోంది కనుక.. ఏ వయసు వారికైనా మెడిసిన్‌తో పాటు మానసిక బలం కూడా అవసరమేనన్నది.. కరోనా నుంచి కోలుకున్న కుల్వంత్ నిర్మల్ సందేశం.

## వదిలి వెళ్లను

చైనాలోని వుహాన్‌లో 76 రోజుల తర్వాత లాక్‌డౌన్ తొలగించారు. ఇన్నాళ్లూ అక్కడే ఉండి అంబులెన్సుల సైరన్ శబ్దాలు, చైనీస్ భాషలోని రేడియో మెజేస్‌లు మాత్రమే వింటూ గడిపిన అనిల పి అజయన్ అనే కేరళ యువతి.. ప్రపంచమంతా కరోనా తగ్గే వరకు వుహాన్‌ను వదిలి ఎక్కడికీ వెళ్లనని అంటున్నారు. పొరపాటున కూడా తను కరోనా వాహకం కాదలచుకోలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని అమె చెబుతున్నారు. ''మనకు సోకుతుందేమోనన్న భయం కంటే.. మన నుంచి సోకుతుందేమోనన్న భయం ఉంటే ప్రపంచంలో ఇప్పుడిన్ని కరోనా కేసులు, మరణాలు ఉండేవే కావు'' అని అంటున్న అనిల.. ''ఆ.. భయం వల్లనే.. కేరళ నుంచి మా వాళ్లు ఫోన్ చేసి రమ్మంటున్నా.. నేను వెళ్లడం లేదు'' అని నవ్వుతూ అంటున్నారు. అనిల వుహాన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రో బయాలజీలో పోస్ట్ డాక్టొరల్ రిసెర్చ్ చేస్తున్నారు.



అనిల పి అజయన్

## టీటీలో మరమనిషితో మన మనిషి పోరు...

**చెన్నై:** అప్పట్లో మనం వెండితెరపై తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్... తనను పోలిన రోబోతో ఇంచుమించు యుద్ధమే చేస్తాడు. ఇదంతా సినిమా 'ట్రిక్'. కానీ నిజజీవితంలో భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) ఆటగాడు సత్యన్ జ్ఞానశేఖరన్... రోబోతో తన ఆట ప్రాక్టీస్ చేస్తున్నాడు. కరోనా వైరస్ వ్యాపిస్తుండటంతో ప్రపంచంతో పాటు భారత్ కూడా లాక్‌డౌన్‌లో ఉంది. అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో సత్యన్ తన భాగస్వామిగా మరో మనిషిని కాకుండా మరమనిషిని ఎంచుకున్నాడు. రోబోతోనే తన ప్రాక్టీస్ చురుగ్గా సాగుతోందని చెప్పాడు. ఈ రోబోను జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్నాడు. ఇది నిమిషానికి 120 బంతుల్ని నెట్‌పై ఆడగలదు. అన్నట్లు బంతుల స్పిన్, వేగ నియంత్రణను చేసుకునే సౌకర్యం ఇందులో ఉంది. ఈ మరమనిషితోనే రోజు గంటన్నర సేపు ప్రాక్టీస్ చేస్తున్నట్లు 27 ఏళ్ల సత్యన్ తెలిపాడు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) మొత్తం ఈవెంట్లను జూన్ 30 దాకా రద్దు చేసింది.





# మన క్రికెటర్లకు ఢోకా లేదు

### బాకీలు చెల్లించిన బీసీసీఐ

**ముంబై:** కోవిడ్–19 కారణంగా ప్రపంచమంతా అతలాకుతలమవుతోంది. ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినడంతో సహజంగానే ఆ ప్రభావం అన్ని రంగాలపై పడింది. దాదాపుగా అన్ని టోర్నీలు, సిరీస్‌లు రద్దు కావడం లేదంటే వాయిదా పడటంతో క్రికెట్ బోర్డుల ఆదాయం ఆగిపోయింది. కరోనా కారణంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెటర్ల వేతనాల్లో కోత పడటం ఖాయమైంది. అయితే ఇలాంటి స్థితిలో కూడా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఆర్థికపరంగా తమ బలమేమిటో చూపిస్తూ భారత కాంట్రాక్ట్ క్రికెటర్లకు ఒక్క రూపాయి కూడా తగ్గించకుండా వారి వేతనాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది తొలి మూడు నెలల వరకు మన ఆటగాళ్లకు ఇవ్వాల్సిన బాకీలన్నీ చెల్లించినట్లు బీసీసీఐ ప్రకటించింది. 'కష్టకాలంలో మన క్రికెటర్లు ఎవరూ సమస్యలు ఎదుర్కోరాదు. మార్చి 24 నుంచి ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించగానే జరగబోయే పరిణామాలను బీసీసీఐ అంచనా వేసి దానికి అనుగుణంగా సిద్ధమైంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఒక్క రూపాయి బాకీ కూడా లేకుండా బోర్డు కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లకు చెల్లింపులు జరిపేశాం. దీంతో పాటు ఈ మధ్య కాలంలో భారత్, భారత 'ఎ' జట్టు తరపున ఆడిన ప్లేయర్లకు కూడా మ్యాచ్ ఫీజులు ఇచ్చేశాం' అని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. కరోనా నేపథ్యంలో ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు తన ఆటగాళ్ల చెల్లింపులను వాయిదా వేయగా, ఇంగ్లండ్ క్రికెటర్లు ప్రభుత్వం సహకారం అందించే పథకం (ఫర్లాఫ్ స్కీమ్)కు దరఖాస్తు చేసుకున్నారు. 'ప్రపంచం మొత్తం జీతాల కోత గురించే వినిపిస్తోంది. అయితే ఇన్నేళ్లుగా చేస్తున్నట్లే ఇప్పుడు కూడా బీసీసీఐ తమ ఆటగాళ్ల బాగోగులు అందరికంటే ఎక్కువ చూసుకుంటుంది. మా పరిధిలోని ఒక్క అంతర్జాతీయ లేదా దేశవాళీ క్రికెటర్ కూడా బాధపడే పరిస్థితి రాకూడదు' అని సదరు అధికారి వ్యాఖ్యానించారు.

#### ఐపీఎల్ జరగాల్సిందే...

మరోవైపు ఐపీఎల్‌తో ముడిపడి ఉన్న డబ్బును బట్టి చూస్తే ఈ ఏడాది చివర్లోనైనా టోర్నీ జరగాలని కోరుకుంటున్నట్లు ఆయన అన్నారు. అయితే ఇప్పటికే నిర్ణయమైపోయిన ఇతర టోర్నీలు, దేశవాళీ క్రికెట్ షెడ్యూల్‌లను బట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుత పరిస్థితిలో ఏమీ చెప్పలేం. అసలు ప్రపంచం సాధారణస్థితికి ఎప్పుడో వస్తుందో ఎవరికీ తెలియనప్పుడు ఐపీఎల్ తేదీల గురించి ఎలా మాట్లాడగలం. అయితే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌తో మొదలు పెడితే స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్, ఆ తర్వాత టి20 ప్రపంచకప్ కూడా ఉన్నాయి. మన దేశవాళీ టోర్నీల సమయం కూడా అదే. కాబట్టి చాలా అంశాలు ఆలోచించాల్సి ఉంది' అని బోర్డు అధికారి స్పష్టం చేశారు.

## కరోనా వ్యాక్సిన్ వచ్చాకే... మైదానాలకు వస్తాం!

### అమెరికా ప్రజల మనోగతం

**న్యూయార్క్:** లీగ్‌లు, ఆటలు ప్రస్తుతానికైతే కోవిడ్–19 వల్ల జరగట్లేదు. ఒకవేళ త్వరలో ఆటలు మొదలైనా కూడా ప్రేక్షకులు కరువయ్యే అవకాశాలున్నాయి. అమెరికా ప్రజల్లో చాలా మంది కరోనాకు మందు, వ్యాక్సిన్ లేదు కాబట్టి ప్రత్యక్షంగా చూసేందుకు స్టేడియాలకు వెళ్లబోమని చెప్పారు. ఇటీవల అక్కడ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో 72 శాతం మంది ప్రస్తుతం ఆరోగ్యకర పరిస్థితులేవీ లేవు కాబట్టి ఆటలకు హాజరు కాబోమని చెప్పారు. 12 శాతం ప్రజలు మాత్రం ఆటలు చూసేందుకు ఆసక్తి కనబరిచినప్పటికీ గ్యాలరీలో సామాజిక దూరం పాటిస్తేనే వెళ్తామని చెప్పారు. కేవలం 13 శాతం మంది మాత్రం ఏదేమైనా ప్రత్యక్ష వీక్షణను ఆస్వాదించేందుకు సిద్ధమేనన్నారు. స్టిల్‌మన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పరిధిలో షార్కీ ఇన్‌స్టిట్యూట్ ఈ నెల 6,7,8 తేదీల్లో ఈ పోల్ నిర్వహించింది. మొత్తం 762 మంది అభిప్రాయాల్ని సేకరించగా... ఇందులో పాల్గొన్న అమెరికన్లు మాత్రం ఇంతకుముందులా ఆటల కోసం ఎగబడి మైదానాలకెళ్లి చూడాలనుకోవడం లేదని... టీవీల్లో చూసేందుకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

## విల్లు వదిలి వంట గదిలో...

- భారత ఆర్చర్ దీపిక బిజీబిజీ
- కాబోయే భర్త అతాను దాస్‌తో కలిసి ఇంట్లోని తాత్కాలిక రేంజ్‌లో సాధన





**కోల్‌కతా:** టోక్యో ఒలింపిక్స్ తర్వాత పెళ్లితో ఒక్కటవ్వాలనుకున్న ఆ జంటకు కరోనా 'శరా'ఘాతంలా తగిలింది. మెగా ఈవెంట్ ఏకంగా ఏడాది పాటు వాయిదా పడటంతో వారి ప్రణాళిక మారిపోయింది. ఒలింపిక్స్‌కు సమయముంది కాబట్టి ఇక ముందుగా పెళ్ళికే వీరిద్దరు సిద్ధమైపోతున్నారు. భారత అగ్రశ్రేణి ఆర్చర్లు దీపికా కుమారి, అతాను దాస్ గురించే ఇదంతా. వీరిద్దరి నిశ్చితార్థం జరిగి దాదాపు రెండేళ్లవుతోంది. టోక్యో ఒలింపిక్స్‌కు వీరిద్దరు ఇప్పటికే అర్హత సాధించారు. రాంచీకి చెందిన దీపిక, ప్రస్తుతం కోల్‌కతాలో దాస్‌తో కలిసే ఉంటోంది. ఇప్పుడు లభించిన విరామంలో ఆమె దృష్టి ప్రస్తుతం విల్లంబులకంటే వంటగదిపైనే ఉంది. ఇదే విషయాన్ని తాను చెప్పుకుంది. 'ఇప్పటివరకు నాకు అన్నం, కొంత వరకు పప్పు వండటం మాత్రమే వచ్చు. ఇప్పుడు నాన్ వెజిటేరియన్ నేర్చుకునే ప్రయత్నంలో ఉన్నా. ముఖ్యంగా చికెన్ వంటకాలంటే ఇష్టం. రాంచీ నుంచి మా అమ్మ ఆన్‌లైన్‌లో ఇవన్నీ నాకు నేర్పిస్తోంది. ప్రాణాయామంతో రోజు మొదలు పెడితే బ్రేక్‌ఫాస్ట్ తర్వాత నా పని వంట నేర్చుకోవడమే' అని దీపిక చెప్పింది.

దీపిక, అతాను దాస్ కలిసి ప్రస్తుతం తమ ఇంట్లోనే ఐదు మీటర్ల తాత్కాలిక రేంజ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వాస్తవానికి అసలు లక్ష్యంతో పోలిస్తే ఇది ఏమాత్రం లెక్కలోనికి రాదు. 'ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతకంటే ఏమీ చేయలేం. ఒక రకంగా ఇది కంప్యూటర్ గేమ్‌లాంటిదే. కానీ కనీసం ఆర్చరీని మరచిపోకుండా ఇది గుర్తు చేస్తున్నట్లు, క్యాంప్ మొదలయ్యే సమయానికి ఆటపై ఆసక్తి పోకుండా ఉంచుతుందనేది మా నమ్మకం. కనీసం రెండు గంటల పాటు ఇలా సాధన చేస్తున్నాం' అని దీపిక వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్ ముగియగానే పెళ్లి చేసుకోవాలనుకున్నా... ఇప్పుడు కరోనా నుంచి అంతా సాధారణ స్థితికి మారగానే వివాహ ఏర్పాట్లు మొదలుపెడతామని వీరిద్దరు చెప్పారు. దీపిక 2012, 2016 ఒలింపిక్స్‌లలో, అతాను 2016 ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు.

## డోలాయమానంలో టోక్యో ఒలింపిక్స్!

### వచ్చే ఏడాదీ నిర్వహణపై కచ్చితమైన హామీ ఇవ్వలేమన్న నిర్వాహక కమిటీ



**టోక్యో:** అసలే విశ్వక్రీడలు అనుకున్న సమయంలో జరగకపోవడంతో నిరుత్సాహానికి గురైన క్రీడా లోకంపై టోక్యో ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) తోషిరో ముటో మరో బాంబు పేల్చే వ్యాఖ్యనొకటి వదిలారు. వచ్చే ఏడాది జూలై 23కి వాయిదా పడిన ఒలింపిక్స్ అప్పుడైనా సరైన సమయంలో జరుగుతాయనే హామీ ఇవ్వలేమని చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో 2021 ఒలింపిక్స్ క్రీడల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. అసలు ఈ మెగా ఈవెంట్ జరుగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 'వచ్చే ఏడాది జూలై నాటికి కరోనాతో ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితి అదుపులోకి వస్తుందని నమ్మకంగా ఎవరూ చెప్పలేరు. ఈ పరిస్థితుల్లో క్రీడల నిర్వహణ అనుకున్న సమయానికే జరుగుతుందనే కచ్చితమైన హామీ ఇవ్వలేం. ప్రస్తుతం క్రీడలకు ప్రత్యామ్నాయాలు వెతకడం కన్నా మనముందున్న సవాలుపై సమష్టిగా పోరాటం చేయాలి. మానవజాతి అంతా ఏకమై తమ మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఈ కరోనా మహమ్మారికి చికిత్స, వ్యాక్సిన్, మందులు కనిపెట్టేందుకు శ్రమించాలి' అని ముటో పేర్కొన్నాడు.

## భారత్, న్యూజిలాండ్ ప్రో హాకీ లీగ్ మ్యాచ్‌లు రద్దు

**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో 23, 24వ తేదీల్లో భువనేశ్వర్‌లో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన రెండు ప్రో హాకీ లీగ్ మ్యాచ్‌లు రద్దయ్యాయి. న్యూజిలాండ్ ప్రభుత్వం లాక్‌డౌన్ మార్గనిర్దేశకాలను అనుసరించి ప్రస్తుత పరిస్థితుల్లో తాము విదేశాల్లో పర్యటించే అవకాశం లేదని... అందుకే భారత్‌తో జరిగే రెండు ప్రో హాకీ లీగ్ మ్యాచ్‌లను, చైనాలో మహిళల హాకీ జట్టు పర్యటనను రద్దు చేసుకుంటున్నామని న్యూజిలాండ్ హాకీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇయాన్ ఫ్రాన్సిస్ తెలిపారు.

## సినిమా



మహాభారతం



రామాయణం

# డీడీ నంబర్ వన్

కేబుల్ రాకముందు దూరదర్శన్ (డీడీ) ఛానలే అందరికీ వినోదం, విజ్ఞానం అందించింది. కేబుల్ టీవీ, స్మార్ట్ ఫోన్స్ వినియోగం ఎక్కువ కావడంతో దూరదర్శన్ కి ఇంతకు ముందు ఇచ్చిన ప్రాధాన్యత ఇవ్వడంలేదనే చెప్పాలి. అయితే ఈ 'లాక్ డౌన్' సమయంలో 'డీడీ నేషనల్' తన పూర్వ వైభవాన్ని చూస్తోంది. టీ. ఆర్. పీ రేటింగ్స్ లో అగ్రగామిగా నిలుస్తోంది. కారణం దూరదర్శన్ లో ఒకప్పుడు బాగా పాపులర్ అయిన సీరియల్స్, షోలను పునః ప్రసారం చేయడమే. బ్రాడ్ కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) విడుదల చేసిన డేటా ఆధారంగా దేశంలో దూరదర్శన్ నంబర్ వన్ స్థానంలో ఉంది. లాక్ డౌన్ కి ముందు వారాల్లో టాప్ 10లో లేకపోయినా ప్రస్తుతం నంబర్ వన్ స్థానంలో కొనసాగడం విశేషం. మార్చి చివరి వారం (మార్చి 21–27) రేటింగ్ సంఖ్యతో పోలిస్తే ఆ మరుసటి వారం (మార్చి 28– ఏప్రిల్ 3) దూరదర్శన్ వీక్షకుల సంఖ్య సుమారు 580 రెట్లు పెరిగినట్టు తెలిసింది. ''రామాయణం, మహాభారతం, శక్తిమాన్, సర్కస్, బ్యోమకేష్ బక్షి వంటి పాపులర్ సీరియళ్ల, ప్రోగ్రాములు తిరిగి ప్రసారం కావడం దేశం మొత్తాన్ని శ్రద్ధగా టీవీలకు అతుక్కుపోయేలా చేసింది డీడీ. ముఖ్యంగా రామాయణం , మహాభారతం ప్రసారం అవుతున్న సమయాల్లో వీక్షకుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగింది. అలాగే క్వారంటైన్ సమయాల్లో టీవీ వీక్షించే సమయం కూడా 43 శాతం వరకు పెరిగింది'' అని బార్క్ సంస్థ తెలిపింది.

# సమోసా రెడీ



లాక్ డౌన్ కారణంగా అందరికీ వీలైనంత ఖాళీ సమయం దొరుకుతోంది. షూటింగ్లు, ప్రమోషన్లు లేకపోవడంతో సినిమా స్టార్స్ కూడా ఇంట్లోనే ఉండిపోయారు. ఈ సమయంలో కొత్త విషయాలు నేర్చుకోవడానికి, ప్రయోగాలు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. కాజల్ కూడా వంట గదిలోకి వెళ్లి సమోసాలు తయారు చేశారు. బాగా రావడంతో శబాష్ అనేసుకున్నారు కూడా. ''తొలిసారి సమోసా చేశాను. చాలా బాగా కుదిరింది. మా అమ్మ ఆధ్వర్యంలో చాలా శుభ్రతను, క్వాలిటీని పాటిస్తూ తయారు చేశాను'' అని పేర్కొన్నారు కాజల్.



కాజల్

# లారెన్స్... లక లక లక



లారెన్స్

పదిహేనేళ్ల క్రితం రజనీకాంత్ హీరోగా పి. వాసు దర్శకత్వంలో తెరకెక్కిన 'చంద్రముఖి' చిత్రం విశేష ప్రేక్షకాదరణను దక్కించుకుని సూపర్‌హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' తెరకెక్కనుంది. 'చంద్రముఖి'ని డైరెక్ట్ చేసిన పి. వాసుయే సీక్వెల్‌ను తెరకెక్కించనున్నారు. ఈ రెండో భాగంలో నటించనున్నట్లు దర్శక–నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవా లారెన్స్ తెలిపారు. అయితే పార్ట్1లో రజనీ లక లక లక అంటే పార్ట్2లో లారెన్స్ లక లక లక అంటారన్నమాట. ''రజనీకాంత్‌గారి అనుమతితో పి. వాసుగారు దర్శకత్వం వహించనున్న 'చంద్రముఖి 2' చిత్రంలో నేను నటించబోతున్నాను. సన్ పిక్చర్స్ కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మించనున్నారు'' అని లారెన్స్ పేర్కొన్నారు.

**మూడు కోట్లు విరాళం**

మూడు కోట్ల రూపాయలను కరోనా వైరస్ రిలీఫ్ ఫండ్‌గా ఇస్తున్నట్లు వెల్లడించారు లారెన్స్. ఈ మూడు కోట్ల రూపాయల్లో యాభై లక్షలను పీఎమ్ కేర్స్ ఫండ్‌కు, యాభై లక్షలను తమిళనాడు ముఖ్య మంత్రి సహాయనిధికి, ఎఫ్ఈఎఫ్ఎస్ఐ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ సౌత్ ఇండియా)కు యాభై లక్షలను విరాళంగా ప్రకటించారు లారెన్స్. ఇంకా డ్యాన్సర్స్ యూనియన్‌కు 50లక్షలు, దివ్యాంగులకు పాతిక లక్షలు, తన స్వస్థలమైన రాయపురం దేశియానగర్‌లోని ప్రజలకు, దినసరి కార్మికులకు 75 లక్షలను విరాళంగా ఇవ్వబోతున్నారు.

# అల.. బాలీవుడ్ తెరపైకి!

ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన 'అల.. వైకుంఠపురములో..' అనూహ్య విజయాన్ని సాధించింది. అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం హిందీలో రీమేక్ కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. తెలుగు హిట్ 'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్ సింగ్'కి ఒక నిర్మాతగా ఉన్న అశ్విన్ వార్దే 'అల.. వైకుంఠపురములో..' హిందీ రీమేక్ రైట్స్‌ను దక్కించుకున్నారని సమాచారం. ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారు? ఎవరు హీరోగా నటిస్తారు? అనే విషయాలు తెలియాల్సి ఉంది. హీరోగా అక్షయ్ కుమార్ లేదా షాహిద్ కపూర్ నటిస్తారనే ప్రచారం జరుగుతోంది.

## కరోనా విరాళం



**బ్రహ్మానందం** – 3 లక్షలు ('సీసీసీ మనకోసం'కి)

**చదలవాడ శ్రీనివాస్** – పది లక్షలా పదకొండు వేల నూట పదకొండు రూపాయిలు ('తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి' కోసం )

**తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్** – 25 లక్షలు (తెలంగాణ ప్రభుత్వానికి)

**రాజమౌళి, డీవీవీ దానయ్య** – 10 లక్షలు. ('సీసీసీ మన కోసం'కి).





# డైరెక్టర్ ఎవరు?

మలయాళంలో మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన సూపర్‌హిట్ మూవీ 'లూసీఫర్' తెలుగులో రీమేక్ కానున్న సంగతి తెలిసిందే. ఈ పొలిటికల్ థ్రిల్లర్ తెలుగు రీమేక్ హక్కులను నటుడు–నిర్మాత రామ్‌చరణ్ దక్కించుకున్నారు. ఇందులో చిరంజీవి హీరోగా నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహించనున్నారు? అనే ప్రశ్నకు సమాధానంగా సుకుమార్, హరీష్ శంకర్ ఇలా కొంతమంది దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా యువ దర్శకుడు సుజిత్ పేరు వినిపిస్తోంది. 'లూసీఫర్' తెలుగు స్క్రిప్ట్‌ను రెడీ చేయాల్సిందిగా సుజిత్‌కు చిరంజీవి చెప్పారట. ఇంతకు ముందు శర్వానంద్ 'రన్ రాజా రన్', ప్రభాస్ 'సాహో' చిత్రాలకు సుజిత్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే.







వేలాదిగా కార్లు.. అందులోనే గంటలతరబడి వేచి చూస్తున్న జనం.. అమెరికాలోని శాన్ అంటోనియోలోనిదీ దృశ్యం.. ఇంతకీ ఇక్కడ వీరంతా ఎందుకు ఉన్నారో తెలుసా? ఉచితంగా అందించే ఆహార పదార్థాల కోసం.. అక్కడి ఫుడ్ బ్యాంకు వద్ద ఇలా వేలాదిగా జనం గంటలతరబడి వేచిచూశారు. కరోనా విలయం నేపథ్యంలో గురువారం ఒక్కరోజే దేశంలో 66 లక్షల మంది ఇలాంటి అన్‌ఎంప్లాయ్‌మెంట్ బెనిఫిట్స్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని అమెరికా కార్మిక శాఖ తెలిపింది.

# నాడు తెలియనితనం.. నేడు నిర్లక్ష్యం

- వందేళ్లలో రెండు వైరస్‌ల విషయంలో మన తీరిది
- 1918లో స్పానిష్ ఇన్‌ఫ్లుయెంజాకు దేశంలో కోటిన్నర మందికిపైగా బలి
- కరోనాకు భౌతిక దూరమే విరుగుడని తెలిసినా పాటించని వైనం
- ఇప్పుడదే ఉపద్రవానికి కారణమంటున్న నిపుణులు

**వందేళ్ల కిందటితో పోలిస్తే ప్రపంచం కొత్త పోకడలతో ఆధునిక సమాజంగా మారిపోయింది. ఊళ్లకు ఊళ్లకు మధ్య అంతగా సంబంధాలు లేని కాలం నుంచి దేశానికి, దేశానికి మధ్య విరామం లేని తరుణం ఆవిష్కృతమైంది. ప్రస్తుతానికి వందేళ్ల గతాన్ని ఓసారి పరిశీలిస్తే ఈ మార్పే కాదు.. రెండు అతిభయంకరమైన పరిణామాలు చరిత్రలో సుస్థిరంగా ఉంటాయి. 1918 నుంచి రెండేళ్లపాటు ఓ వైరస్ కరాళనృత్యం చేసి ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 4 కోట్ల మందిని బలి తీసుకుంది. ఆ మృత్యువు పేరు స్పానిష్ ఇన్‌ఫ్లుయెంజా. దాదాపు వందేళ్లకు అది మళ్లీ పుట్టింది. ఈసారి కోవిడ్-19 పేరిట విరుచుకుపడుతూ నాటి భయాన్ని మళ్లీ రుచిచూపుతోంది. నాడు వైరస్ అంటే ఏమిటో తెలియక ప్రజలు పిట్టల్లా రాలిపోగా నేడు వైరస్ విసిరే పంజా గురించి అందరికీ స్పష్టంగా తెలిసినా దాన్ని ఆచరించనీయని నిర్లక్ష్యం ఆవరించింది.**

**సాక్షి, హైదరాబాద్:** 1918.. ప్రపంచ చరిత్రలో చీకటి నింపిన సంవత్సరం. రెండేళ్లపాటు యావత్తు ప్రపంచాన్ని గడగడలాడించిన స్పానిష్ ఇన్‌ఫ్లుయెంజా సృష్టించిన మారణహోమం అంతాఇంతా కాదు. ప్రపంచవ్యాప్తంగా 4 కోట్ల మంది మృత్యువాతపడ్డారని అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. ఇది నాటి ప్రపంచ జనాభాలో 2 శాతం కంటే ఎక్కువ. ఆ మహమ్మారి భారత్‌పైనే ఎక్కువ ప్రభావం చూపడంతో ఏకంగా 1.67 కోట్ల మంది బలయ్యారు. ఇది మన దేశ జనాభాలో ఏకంగా 5% కంటే ఎక్కువ.



స్పానిష్ ఇన్‌ఫ్లుయెంజా సోకి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైనికులు (ఫైల్)

## అవగాహన లేకపోవడం వల్లే...

‘‘మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక మన దేశం నుంచి వెళ్లిన సైనికుల్లో చనిపోయినవారు పోను మిగిలిన వేల మంది సముద్రమార్గంలో వచ్చి ముంబైలో అడుగుపెట్టారు. అప్పటికే వారి శరీరంలో స్పానిష్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఉందన్న సంగతి అప్పటికి వారికి తెలియదు. సొంతగడ్డపై కాలుమోపామన్న సంతోషంతో ఎవరి ఊళ్లకు వారు వెళ్లిపోయారు. అంతే.. ఒక్కసారిగా దేశవ్యాప్తంగా హాహాకారాలు మొదలయ్యాయి. సైనికులు మోసుకెళ్లిన వైరస్ ఆయా ప్రాంతాల్లో శరవేగంగా విస్తరించింది. అంతుచిక్కని విష జ్వరాలు జనాన్ని పొట్టనపెట్టుకుంటున్నాయని జనం అనుకున్నారే తప్ప వైరస్ పంజా విసురుతోందని గుర్తించలేకపోయారు. వైరస్‌తో మృతిచెందిన వారి ఇళ్లకు తండోపతండాలుగా వెళ్లి దాని కోరలకు చిక్కిన వారెందరో.



- అసలు వైరస్ అంటూ ఒకటుంటుందని, అది ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్న విషయాలు తెలియనివారే ఎక్కువ. వైరస్ బారిన పడ్డ వారికి దూరంగా ఉండాలన్న అవగాహన అప్పట్లో లేదు.
- వైరస్‌బారిన పడి మన దేశానికి వచ్చిన సైనికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారి ద్వారా చూస్తుండగానే లక్షల మందికి వైరస్ సోకింది.
- అది వైరస్ సృష్టిస్తున్న విలయమని గుర్తించేందుకే ఎక్కువ సమయం పట్టింది. కానీ దానికి చికిత్స లేకపోవడంతో ప్రభుత్వం కూడా ఏమీ చేయలేకపోయింది.
- వైరస్ సోకిన వారికి దూరంగా ఉండాలన్న సూచన ప్రభుత్వం వరకు రావడానికే ఎక్కువ సమయం పట్టింది. దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కొద్దోగొప్పో సూచనలు ఆలస్యంగానైనా వెలువడ్డా జనంలోకి వెళ్లే ప్రసారమాధ్యమాలు బలహీనంగా ఉండటంతో జనానికి చేరలేదు.
- స్థానికంగా ఉండే వైద్యులకు వైరస్‌పై అవగాహన లేక సరైన చికిత్సలు అందించలేకపోయారు. ఆసుపత్రి వసతి కూడా తక్కువగా ఉండటంతో జనం పెద్ద సంఖ్యలో చనిపోయారు.’’

– డాక్టర్ రాజారెడ్డి, ప్రఖ్యాత సర్జన్, చరిత్ర పరిశోధకులు

## జనంలో ‘స్మార్ట్’నెస్ వస్తేనే అడ్డుకట్ట...

‘‘ఓ సమస్య ఎదురైంది.. దానికి పరిష్కారమేంటో స్పష్టమవుతుంది. అప్పుడేం చేయాలి. ఆ పరిష్కారమేంటో కచ్చితంగా ఆచరించాలి. ఇప్పుడు ప్రపంచానికి కొత్తగా పరిచయమై విలయతాండవం చేస్తున్న కోవిడ్–19 వైరస్ ప్రబలకుండా ఉన్న పరిష్కారం భౌతిక దూరాన్ని పాటించడమే. మందు కనుక్కునే వరకు ఇదే ఏకైక మందు. ఈ విషయం మిలియనీర్ మొదలు పూరి గుడిసెలో ఉండే వ్యక్తి వరకు అందరికీ తెలుసు. ఆ రీతిలో సామాజిక మాధ్యమాలు, ప్రభుత్వ యంత్రాంగం చేసిన ప్రచారం చేరింది. మనం చేయాల్సిందల్లా ‘స్మార్ట్ (ఎస్ఎంఏఆర్‌టీ)’గా వ్యవహరించడమే. ఈ నిర్లక్ష్యం వెనక ఎన్నో సామాజిక సమస్యలున్నాయి.

**వద్దన్న పని చేయడం...**

కుటుంబ పెద్ద మొండిగా వ్యవహరించే తత్వంతో ఉండి వద్దన్న పనిచేసే వాడైతే వారి పిల్లల్లోనూ అదే తత్వం వస్తుంది. ఇప్పుడు లాక్‌డౌన్ రూల్స్ పాటించని వారిలో వారే ఎక్కువగా ఉంటున్నారు. చిన్నప్పుడు నిర్లక్ష్యానికి గురై కుటుంబం, సమాజంపై కోపంగా ఉండేవారు కూడా ఈ తరహా నిబంధనలు ఉల్లంఘించేందుకు అలవాటు పడి ఉంటారు. ప్రభుత్వాన్ని మోసం చేశామన్న తృప్తి వారికి కిక్ ఇస్తుంది. నిబంధనలు ఉల్లంఘించడం వారికి సరదాగా మారుతుంది. అందుకే లాక్‌డౌన్ సమయంలోనూ వారు ఇళ్లకు పరిమితం కారు.

**పౌర సమాజం స్పందించాలి..**

సైకాలజీలో ఓ మాట చెబుతాం. జైళ్లలో ఉండే క్రిమినల్స్ కంటే సమాజంలో ఉండే నేరస్తుల సంఖ్య ఎక్కువ. అలాగే యూనిఫామ్ వేసుకున్న పోలీసుల కంటే సాధారణ పౌరుల్లో ఉండే ‘పోలీసు’లు పది రెట్లు ఎక్కువ. వారికి సమాజంపై బాధ్యత ఉంటుంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో వీరు ముందుకు రావాలి. పోలీసు కాని ఈ పోలీసులు లాక్‌డౌన్ సరిగ్గా అమలు చేసేలా పోలీసు యంత్రాంగానికి సాయంగా రావాల్సి ఉంటుంది. పాఠశాలల్లో మోరల్ క్లాస్ ఉండాలి. గతంలో ఉండేవి. సమాజంపై మంచి అవగాహన రావడానికి, సత్ప్రవర్తన పెరిగేందుకు ఆయా తరగతుల్లో వివరించే అంశాలు దోహదం చేస్తాయి. ఆ తరగతులు విననివారు నిబంధనల పాటించేందుకు ఆసక్తి చూపరు. ఇవన్నీ సైకాలజీ చెబుతున్న మాట.’’

– డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు



**S-** సోషల్ డిస్టెన్సింగ్. జనం దూరదూరంగా ఉండటం.
**M-** మాస్క్ వాడటం. బయటకు వెళ్లి రాగానే చెప్పులు ఇంటి బయటే విప్పడం, దుస్తులు శుభ్రం చేసుకోవడం లాంటివి ఇందులో భాగమే.
**A-** అవాయిడ్ షేక్ హ్యాండ్స్. ఎదుటివారిని పలకరించేందుకు నమస్కారమే చేయాలి.
**R-** రిపీటెడ్ క్లీనింగ్. బయట దేన్ని ముట్టుకున్నా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
**T-** టైమ్, టాక్, టీచ్.. ఇంట్లోనే సమయం గడపడం, కుటుంబ సభ్యులతో హాయిగా మాట్లాడుతుండటం, పిల్లలకు నీతి బోధనలు చేయడం. కరోనా భయం, ఇంట్లోనే ఉండటంతో వచ్చే మానసిక ఇబ్బందులను దూరం చేసుకోవడానికి ఇవి చేయాలి. ఇవి కొత్త విషయాలు కాదు, అందరికీ ఎప్పుడో తెలిసింది. అయినా ఇంకా 25 శాతం మంది పాటించటంలేదు. దీనికి నిర్లక్ష్యం ఒక్కటే కారణం.

# ఆ గ్రామాల్ని ముంపునకు గురిచేయొద్దు

**కొండపోచమ్మ రిజర్వాయర్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**



**సాక్షి, హైదరాబాద్:** కొండపోచమ్మ జలాశయం నీటితో సిద్దిపేట జిల్లా ములుగు మండలం బహిలాంపూర్, మామిడ్యాల గ్రామాల్ని ముంపునకు గురిచేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకూ గ్రామాల్ని ముంపునకు గురిచేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండు గ్రామాలకు చెందిన 51 మంది రైతులు దాఖలు చేసిన మూడు పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వ వాదనలతో ఈ నెల 12లోగా కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని, తదుపరి విచారణను ఈ నెల 13న జరుపుతామని స్పష్టం చేసింది. పునరావాస ప్యాకేజీ గురించి రైతులతో చర్చించాలని కోరితే అధికారులు పట్టించుకోవడం లేదని, గత ఏడాది నవంబర్‌లో జారీ చేసిన అవార్డు ఉత్తర్వులు, సహాయ–పునరావాస ప్యాకేజీల నోటీసుల అమలును నిలిపివేయాలని రైతుల తరపు న్యాయవాది వాదించారు. భూముల నుంచి రైతుల్ని ఖాళీ చేయించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. రిజర్వాయర్ నుంచి నీటితో తమ గ్రామాల్ని ముంపునకు గురిచేసే అవకాశాలు ఉన్నాయని, వెంటనే హైకోర్టు స్పందించాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, అభ్యంతరం చెబుతున్న రైతులు రాజకీయ పార్టీకి చెందినవారని, ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు, హైదరాబాద్‌కు మంచినీరు అందించాలనే ప్రయత్నంలో భాగంగానే రిజర్వాయర్ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. వెయ్యి కుటుంబాలు ఇప్పటికే ఖాళీ చేశాయని, ఈ కేసుల్లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, కరోనా వైరస్ ఉన్న తరుణంలో హడావుడిగా ఎందుకు చేయాల్సి వస్తోందని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తాము తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకూ బహిలాంపూర్, మామిడ్యాల గ్రామాలు ముంపునకు గురయ్యే చర్యలు తీసుకోరాదని ఆదేశించింది.

## రైతులను ఆదుకోవాలి: జూలకంటి

**సాక్షి, హైదరాబాద్:** అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎంకు లేఖ రాశారు.

# ఇథియోపియాను చూసి నేర్చుకుందాం!

- కరోనా నియంత్రణకు స్వీయ క్రమశిక్షణ పాటిస్తున్న అక్కడి ప్రజలు
- పేరుకు పేద దేశమైనా అవగాహనతో ముందుకుసాగుతున్న వైనం
- జనాభా 11 కోట్లయినా ‘కరోనా’కు కేటాయించిన వెంటిలేటర్లు 54
- లాక్‌డౌన్ లేకుండానే వైరస్‌ను ‘లాక్’ చేసే దిశగా ప్రయత్నాలు..

**సాక్షి, హైదరాబాద్:** ఆ దేశ జనాభా 11 కోట్లు.. అక్కడి ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వెంటిలేటర్లు 450.. ఇతర జబ్బులతో బాధపడుతున్న వారికి పోను, కరోనా బాధితుల కోసం కేటాయించినవి కేవలం 54 మాత్రమే. ఇలాంటి తరుణంలో ఆ వైరస్ విజృంభిస్తే పరిస్థితేంటి..? ఇది ఆఫ్రికా దేశం ఇథియోపియా ముందున్న భయం. సమస్య పెరిగితే తట్టుకోవటం కష్టం. అందుకే సమస్యను ఉన్నంతలో కట్టడి చేయాలని నిర్ణయించింది. అసలే అతి చిన్న ఆర్థిక వ్యవస్థ.. లాక్‌డౌన్ చేస్తే మరింత చితికిపోతామన్న ఉద్దేశంతో ప్రజల్లో అవగాహన కల్పించింది. కేవలం అవసరమున్నవారు తప్ప మిగతావారు ఇళ్లకే పరిమితం కావాలని ఆదేశించింది. బయటకు వచ్చిన వారు గుమి కూడకుండా కనీసం మీటరుకు ఒకరు చొప్పున దూరం పాటించాలని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిణామాలు గుర్తించి జనం కూడా సహకరించటం ప్రారంభించారు. ఇప్పుడు ఆ దేశంలో ఉన్న పాజిటివ్ కేసుల సంఖ్య కేవలం 65 మాత్రమే.

**ప్రజలు క్రమశిక్షణగా ఉన్నారు..**

‘భౌతిక దూరం పాటించటం ఒక్కటే కరోనాను నియంత్రించే మంత్రం. ఇప్పుడు ఇథియోపియా జనం అదే చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాన్ని పాటించటంలో క్రమశిక్షణ చూపుతున్నారు. ఈ పేద దేశాన్ని ఆ క్రమశిక్షణే గట్టునపడేస్తుందని మేం నమ్ముతున్నాం’అని డాక్టర్ రాజు రమేశ్‌రెడ్డి చెప్పారు. అర్బా మించ్ యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన.. కరోనాను ఎదుర్కొనేందుకు ఇథియోపియా అనుసరిస్తున్న తీరును ‘సాక్షి’కి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ‘అగ్రరాజ్యం అమెరికా ఇప్పుడు కరోనాను సకాలంలో నియంత్రించలేక అల్లకల్లోలమవుతోంది. మరి అమెరికా లాంటి దేశాల ఆర్థిక సాయంతో నెట్టుకొచ్చే పేద ఇథియోపియా తట్టుకోగలదా.. అందుకే మార్చి తొలివారంలోనే అక్కడి ప్రభుత్వం మేల్కొంది. సరిహద్దులను మూసేసింది, విమానాలను రద్దు చేసింది. రాజధాని నగరం అడిస్ అబాబాలో కఠిన ఆంక్షలు విధించింది. కేసుల సంఖ్య తక్కువగానే ఉండటంతో ఇప్పటికీ లాక్‌డౌన్ విధించలేదు. కానీ విద్యాసంస్థలు మూసేసి, అవకాశం ఉన్న వారందరినీ ఇంటి నుంచే పని చేయమని పురమాయించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆదేశించింది. వాహనాల్లో సీటుకు ఒకరే కూర్చోవాలని, ఆటోరిక్షాల్లో ఇద్దరు మాత్రమే ఉండాలని ఆదేశించింది. ఇక ప్రజల్లో అవగాహన కోసం 35 వేల మందితో బృందాలు ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిణామాలు చూసి ఆందోళన లో ఉన్న జనం ఆ నిబంధనలను బాగా పాటిస్తున్నారు. స్వీయ నియంత్రణతో క్రమశిక్షణగా ఉంటున్నారు.



డాక్టర్ రాజు రమేశ్‌రెడ్డి

**ఒక్కరోజే 8 కేసులు.. హెల్త్ ఎమర్జెన్సీ**

రాజధాని నగరంలో 44 పాజిటివ్ కేసులు మాత్రమే ఉండేవి. మంగళవారం ఒక్కరోజే 8 కేసులు పెరిగి ఆ సంఖ్య 52కు చేరుకుంది. దీంతో ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. 4 కేసులు మాత్రమే రాజధాని ఆవల ఉన్నాయి. ఇప్పటివరకు రాజధానిలోనే ఉన్న కఠిన ఆంక్షలు ఇప్పుడు ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నారు. దేశమంతటా ప్రజల్లో క్రమశిక్షణ కనిపిస్తున్నందున సమస్యను పెరగకుండా చూసే అవకాశముంది.

**ఇంజీరాతో రోగనిరోధక శక్తి**

ఇథియోపియా ప్రజల సంప్రదాయ ఆహారం ఇంజీరా. గసాల ఆకారంలో ఉండే మిల్లెట్ (టెఫ్) పిండితో తయారు చేసే ఈ ఆహారం అక్కడి ప్రజల రోగ నిరోధకశక్తిని బాగా పెంచుతోంది. ఎన్నో వ్యాధుల నుంచి వారికి ఇది రక్షణగా ఉంటుంది. 80% గ్రామీణ జనాభాతో ఉండే ఈ దేశంలో కాలుష్యం చాలా తక్కువే. వెరసి ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి ఇవి ఎంతో ఉపకరిస్తున్నాయి. ఇప్పుడు కరోనాను కూడా వారి శరీరం తట్టుకునే అవకాశముంది. ఇటు భారత్‌లో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇథియోపియా జనాన్ని చూసైనా భారతీయులు స్వీయ క్రమశిక్షణ పాటిస్తే పరిస్థితి కుదుటపడే అవకాశముంది. అయితే భారత్‌తో పోలిస్తే మేం చాలా ధైర్యంగా ఉన్నామని డాక్టర్ రాజు రమేశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# రైల్వే ఆసుపత్రుల్లో తాత్కాలిక సిబ్బంది

**నోటిఫికేషన్ జారీ చేసిన దక్షిణ మధ్య రైల్వే**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ సోకుతున్నవారి సంఖ్య పెరుగుతుండటంతో దక్షిణ మధ్య రైల్వే ముందు జాగ్రత్త చర్యలు చేపడుతోంది. రైల్వే ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కరోనా వార్డుల్లో పనిచేసేందుకు తాత్కాలిక పద్ధతిలో వైద్యులు, ఇతర వైద్య సిబ్బందిని నియమించుకునేందుకు చర్యలు ప్రారంభించింది. తొలుత లాలాగూడలోని ప్రధాన రైల్వే ఆసుపత్రిలో తాత్కాలిక పద్ధతిలో వారి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. 9 మంది స్పెషలిస్టు వైద్యులు, 34 మంది జీడీఎంఓలు, 77 మంది నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఏడుగురు ల్యాబ్ అసిస్టెంట్లు, 77 మంది హాస్పిటల్ అటెండెంట్లను తాత్కాలిక పద్ధతిలో నియమించుకోనున్నట్టు ఆ నోటిఫికేషన్‌లో అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 15. వీడియో కాల్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9701370624 నెంబరులో సంప్రదించాలని, వివరాలను దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని వెల్లడించారు.

## సహాయ కార్యక్రమాల్లో సీపీఎం

**పార్టీ నేతలతో తమ్మినేని వీడియో కాన్ఫరెన్స్**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రంలో సీపీఎం, ప్రజాసంఘాలు 33 జిల్లాల్లో ప్రజలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలను అందిస్తున్నట్లు సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇందులో భాగంగా లక్షల రూపాయల విలువైన బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువుల పంపిణీతోపాటు మాస్కులు, శానిటైజర్ల పంపిణీ, వలస కార్మికులకు వివిధ జిల్లాలో అండగా నిలబడి భోజనం వసతి ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దాతలు స్పందించి ఈ కష్టకాలంలో ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. శుక్రవారం రాత్రి ఎంబీభవన్ నుంచి జిల్లా పార్టీ కార్యదర్శులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలకు అందజేస్తున్న సహాయ చర్యలపై చర్చించారు. జీహెచ్ఎంసీ, మున్సిపాల్టీలు, పంచాయతీల్లో పనిచేస్తున్న వాటర్‌వర్క్స్, విద్యుత్ సిబ్బందికి కూడా గిఫ్ట్‌ను ప్రకటించాలని, వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎంకు తమ్మినేని విజ్ఞప్తి చేశారు.

## కరోనా నివారణ చర్యల్లో తెలంగాణ భేష్

**ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రశంసించారు. కరోనా తీవ్రత తగ్గే వరకు ఇదే రకమైన స్ఫూర్తితో ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో పరిస్థితులు తెలుసుకునేందుకు ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న చర్యలను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. అనంతరం రాష్ట్ర పరిస్థితులను వినోద్‌కుమార్ ఉపరాష్ట్రపతికి వివరించారు. లాక్‌డౌన్‌ను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తుండటంతో కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోందన్నారు.

## చేనేతలను ఆదుకోవాలి: సీపీఐ



చాడ వెంకట్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా ప్రభావం అన్ని రంగాలతోపాటు చేనేత రంగం పైనా తీవ్ర ప్రభావం చూపినందున వెంటనే ప్రతీ చేనేత కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు రూ. 5వేలు తక్షణ సహాయం కింద అందజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీంతోపాటు వస్త్ర నిల్వలను కొనుగోలు చేసి, నూలు రవాణాను ప్రభుత్వమే చేపట్టాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ జిల్లా రైతుల నుంచి ఆ జిల్లా రైస్ మిల్లర్లే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు రాసిన మరో లేఖలో కోరారు. ఒక జిల్లా రైస్ మిల్లులను మరో జిల్లాకు కేటాయించడంతో రవాణా, హమాలీ సమస్యలు ఏర్పడి రైతులు తమ ఉత్పత్తుల విక్రయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

## జీవో 169ను రద్దు చేయండి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాధితో చనిపోయిన వారి మృతదేహాలను ఖననం చేయడానికి విడుదల చేసిన మార్గదర్శకాలు హిందువుల మత సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన జీవో 169ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెజారిటీ హిందువుల మనోభావలను గౌరవించకపోవడం శోచనీయమన్నారు. హిందువులు కరోనాతో చనిపోతే ఐదుగురితో అంత్యక్రియలు చేయాలని నిబంధన పెట్టడం తగదన్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం చేయాల్సిన పుణ్య కార్యక్రమాలకు అవసరమైన వారిని అనుమతించాలని, జాగ్రత్తలు తీసుకునేలా సూచనలివ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా వ్యాధిగ్రస్తులు అత్యధికులు ముస్లింలేనని, వారికి సూచనలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మత రాజకీయాలు మానుకొని కరోనాతో మరణించే ముస్లిం మరణాలపై మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా జీవో విడుదల చేసిన అధికారులను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆరు రోజుల్లో 255 కోట్ల పింఛన్ల పంపిణీ

**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్ వేళ ఇబ్బంది లేకుండా పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతోందని తపాలా శాఖ ప్రకటించింది. ఈనెల 4న దీని కోసం 5,500 తపాలా కార్యాలయాలు తెరిచి పింఛన్ల పంపిణీ ప్రారంభించామని, ఆరు రోజుల్లోనే 11.06 లక్షల మంది లబ్ధిదారులకు రూ.255 కోట్ల మేర పింఛన్ మొత్తాన్ని అందజేసినట్టు వెల్లడించింది. ఇక తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతాలు ఉన్న లబ్ధిదారులు, స్పీడ్‌పోస్టు, పార్సిల్స్ బుక్ చేసుకోవాలనుకునేవారి కోసం మొబైల్ పోస్టాఫీసులను కూడా ప్రారంభించినట్టు తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తపాలాకు చెందిన 20 వాహనాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రులకు అత్యవసర మందులను, ఇతర వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. వలస కార్మికులకు ప్రభుత్వం అందజేసే వస్తువులను కూడా తరలిస్తున్నామని, వారికి తమ సిబ్బంది తరపున కూడా నిత్యావసర వస్తువులు, శానిటైజర్లు అందజేశామని పేర్కొన్నారు.

## 38 వేల మాస్కులు: ద.మ.రైల్వే ప్రకటన

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రైల్వే సొంతంగా శానిటైజర్, మాస్కులను రూపొందిస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 5.82 లక్షల మాస్కులు, 41.88 వేల లీటర్ల శానిటైజర్ రూపొందించింది. ఇందులో దక్షిణమధ్య రైల్వే 5,216 లీటర్ల శానిటైజర్, 38,702 మాస్కులు రూపొందించిందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ రాకేశ్ తెలిపారు.

## క్లుప్తంగా...

### గృహ హింస ఫిర్యాదులకు ప్రత్యేక వాట్సాప్ నంబర్

**న్యూఢిల్లీ:** కోవిడ్–19 లాక్‌డౌన్ సందర్భంగా పెరుగుతున్న గృహహింస కేసులను రిపోర్టు చేయడానికి జాతీయ మహిళా కమిషన్ కొత్తగా వాట్సాప్ నంబర్ 7217735372ను ప్రారంభించింది. ఇలాంటి ఫిర్యాదుల కోసం ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్, ఈ మెయిల్ సౌకర్యాలతో పాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఈ వాట్సాప్ నంబర్ అదనమని కమిషన్ తెలిపింది.

### సామగ్రిపై వైరస్ తొలగింపునకు పరికరం

**న్యూఢిల్లీ:** బయట నుంచి తెచ్చుకునే కిరాణా సామగ్రి, కరెన్సీ నోట్లపైని వైరస్‌ను తొలగించేందుకు ఓ వినూత్న పరికరాన్ని అభివృద్ధి చేసింది పంజాబ్ రాష్ట్రం రోపార్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ). ఒక ట్రంకు పెట్టెలో అతినీల లోహిత కిరణాలను ప్రసారం చేసే బల్బు ఒకదాన్ని బిగించారు. ట్రంకులో సామగ్రి మొత్తాన్ని ఉంచేసి అరగంటపాటు ఆన్ చేసి ఉంచితే చాలు.. వైరస్‌తో పాటు ఇతర సూక్ష్మ క్రిములన్నీ నశించిపోతాయి. ఈ పరికరం ఖరీదు రూ.500 మాత్రమేనని ఐఐటీ సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ నరేశ్ రఖా తెలిపారు.

### ఈఎస్‌ఐసీ ఆస్పత్రుల్లో 1,042 ఐసోలేషన్ బెడ్లు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరిగిపోతున్న దృష్ట్యా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ) సంస్థ తన వంతు ప్రయత్నాలను చేపట్టింది. సంస్థ ఆధ్వర్యంలో గుజరాత్, హరియాణా, రాజస్తాన్, జమ్మూ, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, బెంగాల్‌లలోని ఆస్పత్రుల్లో 1,042 ఐసోలేషన్ బెడ్లను సిద్ధం చేసింది. వీటితోపాటు ఇతర అన్ని ఆస్పత్రుల్లో మరో 1,112 ఐసోలేషన్ బెడ్లను అందుబాటులోకి తెచ్చింది. ఇంకా, 197 వెంటిలేటర్లతో కూడిన 155 ఐసీయూ బెడ్లను కూడా ఈ ఆస్పత్రుల్లో సిద్ధం చేసింది.

### బ్రిటిషర్ల కోసం హైదరాబాద్ నుంచి విమానం

**లండన్:** లాక్‌డౌన్ కారణంగా భారత్‌లో చిక్కుకుపోయిన తమ 3 వేల మంది పౌరుల కోసం బ్రిటన్ ప్రత్యేకంగా 12 చార్టర్డ్ విమానాలను నడపనుంది. ఈ నెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్ సహా దేశంలోని ప్రధాన నగరాల నుంచి ఇవి బయలుదేరతాయి. ఇందులో భాగంగా బ్రిటిష్ జాతీయులతో ఈనెల 17వ తేదీన హైదరాబాద్ నుంచి బయలుదేరే చార్టర్డ్ విమానం అహ్మదాబాద్ మీదుగా లండన్‌కు వెళ్లనుందని అధికారులు తెలిపారు.

### పోలీసులు, జడ్జి సహా 10 మందికి క్వారంటైన్

**లూధియానా:** పట్టుబడిన ఓ దొంగకు కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఏడుగురు పోలీసులు, ఒక జడ్జి సహా 10 మంది క్వారంటైన్‌కు వెళ్లారు. ఈ ఘటన పంజాబ్‌లో లూధియానాలో చోటుచేసుకుంది. తమ కాలనీలో దొంగతనానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు శుక్రవారం ఉదయం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిద్దరినీ జడ్జి మోనికా సింగ్ ఎదుట హాజరుపరిచారు. ఆ సమయంలో నిందితులిద్దరూ ఎడతెరపి లేకుండా దగ్గుతుండటంతో జడ్జి వారికి పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. పరీక్షలు చేస్తున్న సమయంలో ఒక నిందితుడు అదను చూసుకుని పారిపోగా మరో వ్యక్తికి పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో వైద్యుల సూచన మేరకు జడ్జి, ఏడుగురు పోలీసులు, ఇద్దరు స్థానికులు వారి ఇళ్లలోనే క్వారంటైన్ అయ్యారు.

### కోవిడ్ పరీక్షలు విస్తృతంగా చేపట్టాలి

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ సోకిన వారిని గుర్తించేందుకు ప్రాధాన్యతా క్రమంలో పెద్ద ఎత్తున పరీక్షలు జరిపి, చికిత్స జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో పరీక్షల రేటు చాలా స్వల్పమని పిటిషన్ తెలిపింది. ఇప్పటి వరకు బయటపడిన కేసులు చాలా అల్పమని, వ్యాధి వ్యాప్తిని అరికట్టాలంటే సత్వరమే, పెద్ద ఎత్తున పరీక్షలు చేపట్టి, చికిత్సలు జరపాల్సి ఉందంటూ అలహాబాద్‌కు చెందిన ముగ్గురు న్యాయవాదులు, ఒక న్యాయవిద్యార్థి ఆ పిటిషన్‌లో తెలిపారు.

### కరోనాపై కాంగ్రెస్ పోరు

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ అనంతరం తలెత్తే సమస్యల పరిష్కారానికి కేంద్రం సిద్ధంగా ఉందనే భావిస్తున్నామని కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ వ్యాఖ్యానించారు. లాక్‌డౌన్ సమయంలో పార్టీ తరఫున ప్రజలకు అందుతున్న సహాయక చర్యలపై రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లతో శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. కరోనాపై పోరులో కాంగ్రెస్ కార్యకర్తలు తమ వంతు పాత్ర పోషిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కరోనాపై పోరుకు సంబంధించి తాను, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రభుత్వానికి పలు సూచనలు చేశామని గుర్తు చేశారు. అమెరికాలోని హెచ్1బీ వీసాదారులైన భారతీయుల ఉద్యోగాలకు భద్రత కల్పించే విషయమై ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చించాలని కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వాన్ని కోరింది.

# కోవిడ్ చికిత్సకు హెచ్‌సీక్యూ-ఐజీ




## ఫ్రాన్స్‌లో 1061 మంది పేషెంట్లపై అధ్యయనం

**పారిస్:** కోవిడ్–19 చికిత్సలో 'హైడ్రాక్సీ క్లోరోక్విన్–అజిథ్రోమైసిన్'(హెచ్‌సీక్యూ–ఐజీ) కాంబినేషన్ ఎలాంటి సానుకూల ఫలితాలు సాధించిందనే వివరాలను వెల్లడించే అధ్యయనం ఒకటి ఫ్రాన్స్‌లో తాజాగా తెరపైకి వచ్చింది. మార్సిలీలోని ఐహెచ్‌యూ, మెడిటెరేన్ ఇన్‌ఫెక్షన్ కేంద్రంలో ఈ అధ్యయనాన్ని మార్చి– ఏప్రిల్ మధ్య నిర్వహించారు. 1061 కరోనా పాజిటివ్ పేషెంట్లకు కనీసం మూడు రోజుల పాటు 'హెచ్‌సీక్యూ–ఐజీ' ట్రీట్‌మెంట్ ఇచ్చారు. వీరిలో 973(91.7%) మంది పది రోజుల్లో ఈ వ్యాధి నుంచి కోలుకున్నారు. 46(4.6%) మంది పేషెంట్లపై ఈ చికిత్స సరైన ఫలితాలనివ్వలేదు. 10 మంది పేషెంట్లను ఐసీయూలో చేర్చాల్సి వచ్చింది. వారిలో ఐదుగురు(0.47%) మరణించారు. ఈ ఐదుగురు కూడా 74 నుంచి 95 ఏళ్ల మధ్య వయసువారే కావడం గమనార్హం. 32 మంది పేషెంట్లకు 10 రోజులకు మించి ఆసుపత్రిలో చికిత్స అందించాల్సి వచ్చింది. ఈ చికిత్స పొందిన వారిలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కనిపించలేదు. ఈ అధ్యయన ఫలితాలు కోవిడ్–19 చికిత్సలో హెచ్‌సీక్యూ–ఐజీ మెరుగైన ఫలితాలను సాధిస్తోందని స్పష్టం చేస్తున్నాయి. 'హెచ్‌సీక్యూ–ఐజీ కాంబినేషన్ కోవిడ్–19కు సమర్థవంతమైన, సురక్షితమైన చికిత్స. ఈ చికిత్సను కోవిడ్–19 నిర్ధారణ కాగానే, ఆలస్యం చేయకుండా, తక్షణమే ప్రారంభించాలి. ఈ చికిత్సలో మరణశాతం అత్యల్పం గా 0.5%లోపే ఉంది. మరణించిన వారంతా వృద్ధులే కావడం గమనార్హం. చాలా కేసుల్లో వైరస్ వృద్ధిని ఈ కాంబినేషన్ సమర్థవంతంగా నిలువరించింది' అని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. చాలా మంది డాక్టర్లు ఈ హైడ్రాక్సీ క్లోరోక్విన్– అజిత్రోమైసిన్ కాంబినేషన్ కోవిడ్–19పై సమర్థవంతంగా పనిచేస్తోందని భావిస్తున్నట్లు ఒక సర్వే వెల్లడించింది. అయితే, ఈ విషయాన్ని నిర్ధారించే క్లినికల్ ట్రయల్ ఒకటి మాత్రమే జరిగింది. అదీ కూడా స్వల్ప శాంపిల్‌తో మాత్రమే. ఎక్కువ శాంపిల్స్‌తో ఫ్రాన్స్‌లో ఈ స్టడీ జరగడం విశేషం.

**అధ్యయనం వివరాలు**

ఈ స్టడీ వివరాలను మార్సిలీ(ఫ్రాన్స్)లోని 'ఐహెచ్‌యూ, మెడిటెరేన్ ఇన్‌ఫెక్షన్' సంస్థ వెల్లడించింది. 'మార్చి 3– ఏప్రిల్ 9 మధ్య 38,617 మంది పేషెంట్ల నుంచి 59, 655 శాంపిల్స్‌ను పీసీఆర్ సేకరించింది. ఆ పేషెంట్లలో కరోనా పాజిటివ్‌గా తేలిన 3,185 మంది పేషెంట్లలో 1,061 మంది మా అధ్యయనానికి సరిపోయారు. వారి సగటు వయసు 43.6 ఏళ్లు. వారిలో పురుషులు 492 మంది. వారికి హైడ్రాక్సీక్లోరోక్విన్– అజిథ్రోమైసిన్ కాంబినేషన్‌తో చికిత్స జరిపి, ఈ అధ్యయనాన్ని రూపొందించాం' అని వివరించింది.

| | |
|---|---|
| మొత్తం పేషెంట్లు | 1061 |
| 10 రోజుల్లో కోలుకున్నవారు | 973 |
| సరైన ఫలితం కనిపించనివారు | 46 |
| ఐసీయూలో చికిత్స పొందినవారు (వీరిలో 74- 95 ఏళ్ల మధ్య వయస్సున్న ఐదుగురు మరణించారు) | 10 |
| 10రోజులకు పైగా చికిత్స అవసరమైన వారు | 32 |

### గుడ్‌ఫ్రైడే



లాక్‌డౌన్ కారణంగా భక్తులెవరూ లేకుండానే చండీగఢ్‌లోని క్రైస్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

# 206కి చేరిన మృతుల సంఖ్య

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా మహమ్మారికి బలైన వారి సంఖ్య శుక్రవారానికి 206కి చేరుకుంది. దాదాపు 6,761 మంది వైరస్ బారిన పడినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. వీరిలో 503 మందికి జబ్బు నయమైందని తెలిపింది. గురువారం సాయంత్రం నుంచి దాదాపు 30 మంది కోవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారని, వీరిలో 25 మంది మహారాష్ట్రకు చెందిన వారు కాగా, ముగ్గురు ఢిల్లీకి చెందిన వారని, గుజరాత్, జార్ఖండ్‌లలోనూ ఒక్కొక్కరు చొప్పున మరణించారని ఆరోగ్యశాఖ వివరించింది. ఇప్పటివరకూ మహారాష్ట్రలో 97 మంది కోవిడ్–19కి బలి కాగా, గుజరాత్‌లో 17 మంది, మధ్యప్రదేశ్‌లో 16 మంది, ఢిల్లీలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. పంజాబ్, తమిళనాడులలో ఎనిమిది మంది చొప్పున ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమ బెంగాల్, కర్ణాటకల్లో ఐదుగురు చొప్పున కోవిడ్‌కు బలయ్యారు. జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్‌లలో నలుగురు చొప్పున, హరియాణా, రాజస్తాన్‌లలో ముగ్గురు చొప్పున బలయ్యారు. కేరళ, బిహార్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఇద్దరు చొప్పున, ఒడిశా, జార్ఖండ్‌లలో ఒకొక్కరు ప్రాణాలొదిలారు. దేశం మొత్తమ్మీద వైరస్ బారిన పడ్డ 6,761 మందిలో 71 మంది విదేశీయులు ఉన్నారు. గురువారం సాయంత్రానికి వైరస్‌తో 169 మంది మరణించారు.



డెహ్రాడూన్‌లో నిరుపేద బాలలకు ఆహారం పంపిణీ చేస్తున్న పోలీసు అధికారి

**మహారాష్ట్రలో అత్యధిక కేసులు...**

మహారాష్ట్రలో మొత్తం 1,364 కేసులు ఉండగా, తమిళనాడులో 834, ఢిల్లీలో 720 వరకు కేసులు ఉన్నాయి. రాజస్తాన్‌లో 463, ఉత్తరప్రదేశ్‌లో 410, కేరళలో 357, మధ్యప్రదేశ్‌లో 259, గుజరాత్‌లో 241 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో 181 కేసులు ఉండగా, హరియాణాలో 169 కేసులు నమోదయ్యాయి. జమ్మూకశ్మీర్ (158), పశ్చిమ బెంగాల్ (116), పంజాబ్ (101), పాజిటివ్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒడిశాలో మొత్తం 44 కేసులు నమోదు కాగా, బిహార్‌లో 39 మంది, ఉత్తరాఖండ్‌లో 35 మంది వైరస్ బారిన పడ్డారు. అసోంలో 29, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్‌లలో 18 మంది చొప్పున కరోనా పాజిటివ్ రోగులు ఉన్నారు.

# సీఎంలతో నేడు మోదీ చర్చలు

**న్యూఢిల్లీ:** కరోనా విజృంభణ నేపథ్యంలో విధించిన దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 14వ తేదీ తరువాత ఎత్తివేయాలా? వద్దా? అన్న అంశంపై ప్రధాని మోదీ శనివారం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరపనున్నారు. ఈ సమావేశం అనంతరమే లాక్‌డౌన్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని ప్రధాని ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే శనివారం మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రుల అభిప్రాయాలను, సలహా, సూచనలను తీసుకోనున్నారు. అయితే పలు రాష్ట్రాలు ఇప్పటికే లాక్‌డౌన్ పొడిగింపునకు మద్దతు తెలిపిన నేపథ్యంలో తుది నిర్ణయం కూడా ఇదే దిశగా ఉండవచ్చునని అంచనా. పార్లమెంటులో వేర్వేరు రాజకీయ పార్టీల నేతలతో మోదీ మూడు రోజుల క్రితం మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీ తరువాత ఒకేసారి లాక్‌డౌన్ ఎత్తివేయడం సాధ్యం కాదని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి ప్రాణాన్ని కాపాడుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కూడా ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రాలు, జిల్లా స్థాయి యంత్రాంగం, నిపుణులు కూడా లాక్‌డౌన్‌ను పొడిగించాలనే సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒడిశా ఒకడుగు ముందుకేసి ఏప్రిల్ 30వ తేదీ వరకూ లాక్‌డౌన్‌ను పొడిగించింది కూడా. ప్రధాని మోదీ సీఎంలతో సంప్రదింపులు జరపడం ఇది రెండోసారి. ఏప్రిల్ 2న తొలి సమావేశంలో దశలవారీ లాక్‌డౌన్ ఎత్తివేతకు అనుకూలంగా ప్రధాని మాట్లాడారు.

## సమూహ వ్యాప్తి లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ/భువనేశ్వర్/చండీగఢ్:** కరోనా వైరస్‌కు సంబంధించి భారత్‌లో ఇప్పటివరకు సమూహ వ్యాప్తి(కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్) దశ రాలేదని కేంద్రం ప్రకటించింది. అలాంటిదేమైనా ఉంటే, ప్రజల్లో అప్రమత్తత పెంచేందుకు ముందు మీడియాకే చెప్తామని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ శుక్రవారం వ్యాఖ్యానించారు. కరోనా కారణంగా తీవ్ర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ బారిన పడిన 104 మందిలో 40 మందికి ఎలాంటి ట్రావెల్ హిస్టరీ కానీ, పాజిటివ్‌గా తేలిన వ్యక్తులతో సన్నిహితంగా ఉన్న చరిత్ర కానీ లేదని తేలిందని ఐసీఎంఆర్ ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించగా, లవ్ అగర్వాల్ పై సమాధానం ఇచ్చారు. మరోవైపు, కోవిడ్–9పై సమర్థవంతంగా పనిచేస్తుందని తేలిన హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను ఎగుమతి చేయాలంటూ పలు దేశాల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అయితే, భారత్‌కు అవసరమైన స్టాక్ ఉన్న తరువాత, మిగతా స్టాక్‌ను ఎగుమతి చేయాలని నిర్ణయించామని తెలిపింది. విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కు తీసుకువచ్చే విషయంపై.. కరోనా వ్యాప్తి పరిస్థితిని సమీక్షించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి దమ్ము రవి తెలిపారు.

**అది ప్రమాదకరం**

కరోనా వైరస్‌ను పూర్తిగా కట్టడి చేయకముందే తొందరపడి ఆంక్షలను ఎత్తివేస్తే అత్యంత ప్రమాదకర పరిస్థితి నెలకొంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. అలా చేస్తే.. వైరస్ వ్యాప్తి అడ్డుకోలేని దశకు చేరుకునే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది.

**లాక్‌డౌన్‌పై మీ అభిప్రాయం ఏమిటి?**

దేశవ్యాప్త లాక్‌డౌన్‌పై తమ అభిప్రాయాలు తెలపాల్సిందిగా కేంద్ర హోం శాఖ శుక్రవారం రాష్ట్రాలను కోరింది. ఏప్రిల్ 14 తరువాత మరో రెండు వారాలపాటు లాక్‌డౌన్ కొనసాగుతుందన్న వార్తలు వస్తున్న తరుణంలో హోంశాఖ ఈ సమాచారం కోరడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ రంగ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వాలన్న సూచనలు ఎక్కువగా రాష్ట్రాల నుంచి ఉన్నాయని తెలిసింది. లాక్‌డౌన్ సందర్భంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంతోపాటు అత్యవసర వస్తువుల విక్రయ కేంద్రాలు తెరిచే ఉంటాయని కేంద్రం ప్రకటించింది. వీటితో పాటు ఆరోగ్యం, పారిశుధ్యం, పోలీస్, మీడియా, బ్యాంకులు పనిచేస్తాయని చెప్పింది.

**మాస్కు లేకపోతే పెట్రోలుకు నో!**

ముఖానికి మాస్కు లేనివారికి పెట్రోలు పంపుల్లో ఇంధనం నింపేది లేదని ఒడిశా రాష్ట్రం ఉత్కళ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ శుక్రవారం ప్రకటించింది. కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో పంజాబ్ రాష్ట్రం లాక్‌డౌన్‌ను మే ఒకటో తేదీ వరకూ పొడిగించింది. ఒడిశా ఇప్పటికే లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 30వ తేదీ వరకూ పొడిగించిన విషయం తెలిసిందే.

### మతపరమైన ఊరేగింపులు వద్దు

ఏప్రిల్ నెలలో వివిధ పండుగల సందర్భంగా మతపరమైన ఊరేగింపులు, గుమికూడటంపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జాగరూకతతో వ్యవహరించాలని హోం శాఖ శుక్రవారం హెచ్చరించింది. అభ్యంతరకరమైన సమాచారం ఏదీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టకుండా నిఘా ఉంచాలని, లాక్‌డౌన్ ఆంక్షలన్నీ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. ఈ నెలలో ఇప్పటికే కొన్ని మతపరమైన కార్యక్రమాలు పూర్తికాగా, బైశాఖీ, రొంగలి బీహూ, విషు, పోయినా బైశాఖ్, పుతాండు, మహా విశుబా సంక్రాంతి వంటి పండుగలన్నీ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీటన్నింటిపై ప్రభుత్వ అధికారులు, మత సంస్థలు, పౌరులు అప్రమత్తంగా ఉండాలని హోం శాఖ కోరింది. లాక్‌డౌన్ మార్గదర్శకాల ఉల్లంఘనలపై భారతీయ శిక్షాస్మృతి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆక్ట్‌ల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

# ఆ 40 మందికి ఎలా సోకింది?

**న్యూఢిల్లీ:** వారు విదేశాలు వెళ్లిన దాఖలాలు లేవు.. చుట్టాలు పక్కాలు, ఇరుగు పొరుగు వారెవరూ విదేశాల నుంచి రాలేదు.. ఆరోగ్య, పారిశుధ్య సిబ్బందితోనూ సంబంధాలు లేవు..లేబొరేటరీల్లోనూ పని చేయలేదు..అయినా సరే 40 మందికి కరోనా సోకింది. పరీక్షల్లో పాజిటివ్ అని తేలింది.. ఎందుకిలా?? ఇప్పుడిదే కేంద్రానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

భారత్‌లో కరోనా వ్యాప్తిపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) నిర్వహించిన సర్వే ఫలితాలు ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తున్నాయి. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధితో (ఎస్ఏఆర్ఐ) బాధపడుతున్న వారిలో ఎంపిక చేసిన 5,911 మందికి ఐసీఎంఆర్ కోవిడ్ పరీక్షలు నిర్వహించింది. వారిలో 104 మందికి కరోనా పాజిటివ్ రాగా, వీరిలో 40 మందికి వ్యాధిగ్రస్తులెవరితోనూ నేరుగా సంబంధాలు లేకపోవడం, విదేశాల నుంచి వచ్చిన చరిత్ర లేకపోవడం ప్రభుత్వానికి షాక్ కలిగించింది. 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 52 జిల్లాల్లో నిర్వహించిన ఈ సర్వే ఫలితాలు తాజాగా ఐసీఎంఆర్ మెడికల్ జర్నల్‌లో వెల్లడయ్యాయి. సర్వే నివేదిక ముఖ్యాంశాలు..

- తీవ్రమైన శ్వాస కోశ సమస్యలతో బాధపడే రోగులకు (ఎస్ఏఆర్ఐ) మార్చి 14 కంటే ముందు కరోనా వైరస్ అసలు సోకలేదు. అదే ఏప్రిల్ 2 వచ్చేసరికి అలాంటి వారిలో 2.6% మందికి కోవిడ్–19 సోకింది.
- 50 ఏళ్లకు పైబడినవారిలోనూ, పురుషులపైనా ఈ వైరస్ పంజా విసురుతోంది. 50–59 ఏళ్ల మధ్య వయస్కుల్లో అత్యధికంగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.
- ఎస్ఏఆర్ఐ రోగుల్లో 5,911 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 104 మందికి (1.4%) కరోనా ఉన్నట్టు తేలింది.
- ఈ కరోనా కేసుల్లో 40 మంది విదేశీ ప్రయాణాలు, విదేశాల నుంచి వచ్చిన వారితో సంబంధాలు లేకపోయినా వైరస్ సోకింది. మొత్తం 15 రాష్ట్రాల్లోని 36 జిల్లాల్లో ఇలాంటి కేసులున్నాయి.
- శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతూ కోవిడ్–19 బారిన పడిన వారిలో గుజరాత్ నుంచి అత్యధికంగా కేసులు (792) నమోదయ్యాయి. ఆ తర్వాత స్థానంలో తమిళనాడు (577), మహారాష్ట్ర (533), కేరళ (503) ఉన్నాయి. కోవిడ్ కేసులు అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు కూడా ఇవే కావడం గమనార్హం.

**నిబంధనలు కఠినతరం చేయాలి**

దేశవ్యాప్తంగా 36 జిల్లాల్లో ఎలాంటి లింకులు లేకపోయినా కరోనా వ్యాపించడంతో ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు ఆయా ప్రాంతాల్లో కఠినమైన నిబంధనల్ని అమలు చేయాలని సూచిస్తున్నారు. భారత్‌లో సమూహ వ్యాప్తికి ఇది సంకేతమని ఐసీఎంఆర్ చీఫ్ బలరామ్ భార్గవ్ అభిప్రాయపడ్డారు.

## సరిహద్దులు జాగ్రత్త

- బీఎస్ఎఫ్‌కు అమిత్ షా ఆదేశాలు

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంట చొరబాట్లను అడ్డుకునే దిశగా మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంమంత్రి సరిహద్దు భద్రతాదళాన్ని(బీఎస్ఎఫ్)ను ఆదేశించారు. ఈ రెండు దేశాల సరిహద్దుల్లో, ముఖ్యంగా ఫెన్సింగ్ లేని ప్రాంతాలపై, మరింత దృష్టి పెట్టాలన్నారు. ఈ సరిహద్దుల్లో పరిస్థితిపై శుక్రవారం బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా సమీక్ష జరిపారు. ఎట్టి పరిస్థితుల్లో చొరబాట్లకు అవకాశం కల్పించకూడదని వారికి ఆదేశాలిచ్చారు. ఈ వివరాలను హోంశాఖ సంయుక్త కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ మీడియాకు వివరించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 37,978 రిలీఫ్ క్యాంప్‌లు ఏర్పాటయ్యాయని, వాటిలో 14.3 లక్షల మంది కార్మికులు, వలస కూలీలకు ఆశ్రయం కల్పించామన్నారు.

**ఎఫ్‌సీఐ ఉద్యోగులకు బీమా సౌకర్యం**

- లక్ష మందికి పైగా ఉన్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) అధికారులు, కార్మికులకు రూ. 35 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు కేంద్రం తెలిపింది.
- ఉద్యోగులు తమ వేతనాల నుంచి యాజమాన్యాల ద్వారా పీఎంకేర్స్ నిధికి విరాళం ఇస్తున్నట్లయితే.. ఆ వివరాలను యాజమాన్యాలు ఆయా ఉద్యోగుల ఫామ్–16 టీడీఎస్ సర్టిఫికెట్‌లో చూపించాలని ఐటీ శాఖ కోరింది.
- దేశవ్యాప్త లాక్‌డౌన్ పరిస్థితుల్లో వీధుల్లో తిరుగుతున్న మానసిక వ్యాధిగ్రస్తులకు ఆశ్రయం కల్పించేందుకు తీసుకున్న చర్యలను రెండు వారాల్లోగా వివరించాలని హోం శాఖను మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది.
- మధ్యప్రదేశ్‌లో 75 వేల జనాభాకు ఒక వెంటిలేటర్, 47 వేల మందికి ఒక ఐసీయూ బెడ్ మాత్రమే అందుబాటులో ఉన్నట్లు తాజా అధికార గణాంకాలు వెల్లడించాయి. రాష్ట్రంలో శుక్రవారం నాటికి 426 కరోనా కేసులు, 33 మరణాలు సంభవించాయి.

# లక్ష దాటిన కోవిడ్ మరణాలు

- అమెరికాలో ఒకే రోజు 1700 మంది మృతి
- 50 వేల కోట్ల యూరోలతో ఈయూ ఆర్థిక ప్యాకేజీ

**జెనీవా/వాషింగ్టన్/రోమ్:** ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కరాళ నృత్యం చేస్తోంది. ఈ వ్యాధి బారిన పడి మరణించిన వారి సంఖ్య శుక్రవారం 1,01,485కు చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా 16లక్షల 75వేల మందికిపైగా కరోనా వైరస్ బారినపడ్డారు. ఈస్టర్ సంబరాల వేళ ప్రపంచ జనాభాలో సగం మంది ఇంటి పట్టునే ఉండడంతో ఎక్కడా సందడి కనిపించడం లేదు. సామాజిక, ఆర్థిక ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్లన్నీ కళావిహీనంగా మారిపోయాయి. కోవిడ్ బారిన పడి విలవిలలాడుతున్న దేశాల్లో అమెరికాయే ముందు వరసలో ఉంది. 24 గంటల్లో 1,700 మంది మృతి చెందారు. వైరస్ దెబ్బకి అగ్రరాజ్యంలో ప్రతీ 10 మందిలో ఒకరు ఉద్యోగం కోల్పోతే, తమ సభ్యదేశాల్లో సహాయ కార్యక్రమాల కోసం 50 వేల కోట్ల యూరోలతో ప్రత్యేక ప్యాకేజీని అందించడానికి ఈయూ ఆర్థిక మంత్రులు అంగీకరించారు.



న్యూయార్క్‌లో కరోనాతో మృతి చెందిన వారిని సామూహిక ఖననం చేస్తున్న సిబ్బంది

**ప్రపంచ శాంతికి భంగకరం**

కరోనా మహమ్మారి ప్రపంచ దేశాల్లో శాంతి భద్రతల్ని భగ్నం చేస్తుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి అంటోనియా గ్యుటెరాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మొండి వ్యాధిపై కొన్ని తరాల వారు పోరాడాల్సి ఉంటుందని ఆయన అంచనా వేశారు. త్వరలోనే ప్రపంచ దేశాల్లో సామాజిక అస్థిరత, హింసాత్మక పరిస్థితులు వస్తాయని భద్రతా మండలిని హెచ్చరించారు.

**కోలుకుంటున్న జాన్సన్**

బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ కోవిడ్ నుంచి కోలుకుంటున్నారు. ఆయనను ఐసీయూ నుంచి వార్డుకి మార్చారు. జాన్సన్ ఆరోగ్యాన్ని రేయింబవళ్లు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. జాన్సన్‌తో ఆయన తండ్రి స్టాన్లీ జాన్సన్ మాట్లాడారు.

**ఇటలీలో మాఫియా కదలికలు**

కోవిడ్‌తో అతలాకుతలమైన ఇటలీపై పట్టు బిగించడానికి మాఫియా పన్నాగాలు పన్నుతోంది. వివిధ నేరగాళ్ల ముఠాలు పెద్ద ఎత్తున ఆహార పదార్థాలను కొనుగోలు చేసి, ఆకలితో అలమటిస్తున్న వారికి పంపిణీ చేస్తున్నాయి. నిరుపేదల్ని ఆదుకొని వారందరినీ తమ నియంత్రణలోకి తీసుకోవాలని కుట్రలు పన్నుతున్నాయని రచయిత రోబెర్టో సావియానో అనుమానం వ్యక్తం చేశారు.

**యెమన్‌లో తొలి కరోనా కేసు**

యుద్ధంతో అతలాకుతలమవుతున్న యెమన్‌లో మొట్టమొదటి కరోనా వైరస్ నమోదైంది. తీవ్ర స్థాయిలో మానవ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న యెమన్‌లో కోవిడ్ జాడలు ఎలాంటి విధ్వంసానికి దారితీస్తుందోనని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది.

| ఈ అంకెలు శుక్రవారం రాత్రి 11 గంటలకు.. | ప్రపంచవ్యాప్తంగా మొత్తం కేసులు | మరణాలు | కోలుకున్న వారు |
|---|---|---|---|
| | 16,75,285 | 1,01,485 | 3,71,866 |

### క్లినికల్ ట్రయల్స్ దశలో ప్లాస్మా థెరపీ

**న్యూఢిల్లీ:** కరోనా చికిత్సకు కొత్తగా అందుబాటులోకి వచ్చిన కొన్వాలెసెంట్ ప్లాస్మా థెరపీ విధానం క్లినికల్ ట్రయల్స్ దశలో ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తెలిపింది. కరోనా బారిన పడి కోలుకున్న వారి రక్తం నుంచి సేకరించిన యాంటీ బాడీస్‌ను కరోనా వైరస్‌తో తీవ్రంగా బాధపడుతున్న వారికి ఎక్కించడమే ప్లాస్మా థెరపీ. ఈ విధానాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా కేరళలోని శ్రీచిత్ర పెరుమాళ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలోని రోగులపై ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇచ్చినట్లు ఐసీఎంఆర్ తెలిపింది. అయితే, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) కూడా ట్రయల్స్‌కు అంగీకారం తెలపాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇటీవల కొన్ని దేశాల్లో కరోనా సోకి విషమంగా ఉన్న రోగులకు, వెంటిలేటర్‌పై ఉన్న వారికి ఈ విధానాన్ని పరిమిత సంఖ్యలో ప్రయోగాత్మకంగా పరిశీలించగా మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొంది.

# సాక్షి 24|7 నల్లగొండ

NALGONDA DISTRICT

శనివారం । 11 । ఏప్రిల్ । 2020


**కరోనా మీటర్**
(10వ తేదీ వరకు)

శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. ప్రభుత్వ క్వారంటైన్‌లలో పలువురు ఉన్నారు.

నల్లగొండలో

| | |
|---|---|
| మీర్‌బాగ్ కాలనీ | 4 |
| బర్కత్‌పుర | 2 |
| మాన్యంచెల్క | 2 |
| రెహమాన్‌బాగ్ | 1 |




## న్యూస్‌రీల్

### బత్తాయి, నిమ్మకాయలను ఎక్కడికక్కడే అమ్ముకోవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా



చిట్యాల : జిల్లాలో పండించిన బత్తాయి, నిమ్మకాయలను పండ్లతోటల రైతులు అందుబాటులో ఉన్న పట్టణాల్లో అమ్ముకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. చిట్యాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు అమ్మేందుకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం లేకపోవడంతో పండ్ల తోటల రైతులు ఆందోళన చెందుతున్నారని, వీరికి తగిన న్యాయం చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి తెలియజేసినట్లు తెలిపారు. ప్రజలంతా బత్తాయి, నిమ్మకాయలను అవసరాల మేరకు కొనుగోలు చేసి రైతులకు సహకరించాలని కోరారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో వ్యవహరించి తీసుకున్న చర్యలతో కోవిడ్ వైరస్ కట్టడిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ నెల 14 నుంచి 31వరకు లాక్‌డౌన్‌ను ప్రభుత్వం పొడిగించే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. ఆయనవెంట నాయకులు వనమా వెంకటేశ్వర్లు, కర్నాటి ఉప్పల వెంకట్‌రెడ్డి, తేరటుపల్లి హన్మంతు, వేలుపల్లి వెంకటేశ్వర్లు, వేలుపల్లి శంకరయ్య, బూరుగు క్రిష్ణయ్య పాల్గొన్నారు.

### ‘ఎమ్మార్పీఎస్ నాయకుడిపై దాడి సరికాదు’

నల్లగొండ క్రైం : ఎమ్మార్పీఎస్ నాయకుడు తీగల రత్నంపై పోలీసులు దాడి చేయడం సరికాదని ఆ సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అకారణంగా దాడి చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**తీగల రత్నాన్ని లాక్‌డౌన్‌లో కొట్టలేదు**

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు తీగల రత్నాన్ని నల్లగొండ టూ టౌన్ పోలీసులు కొట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలు నిజం కావని, అతనిని లాక్‌డౌన్ సమయంలో కొట్టలేదని జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్ తెలిపారు. తన మేనకోడలు నివాసం ఉంటున్న ఇంటి విషయంలో ఆయనకు, మేనకోడలు బంధువులకు గొడవ జరుగుతున్నదని తెలిపారు. పోలీసులు కొట్టినట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ అధికారిగా నల్లగొండ డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డిని నియమించినట్లు తెలిపారు. విచారణ నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### కరోనా కట్టడికి సహకరించాలి



కొండమల్లేపల్లి (దేవరకొండ) : కరోనా వైరస్ కట్టడికి ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై డ్రోన్ సాయంతో చేసిన సోడియం హైపో క్లోరైడ్ ద్రావణం పిచికారీని ఆయన పరిశీలించి మాట్లాడారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్ అలీ, కమిషనర్ పూర్ణచందర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు తదితరులున్నారు.



### పని లేకపోయే.. కునుకు మిగిలే..

దుకాణాలు తెరిస్తేనే రిక్షా కార్మికులకు అంతోఇంతో పని దొరుకుతుంది. లాక్‌డౌన్ కారణంగా ఏ ఒక్క దుకాణమూ తెరవడం లేదు. దీంతో చేసేందుకు పని లేదు. కానీ ఏ చిన్న పని అయినా దొరుకుతుందన్న ఆశతో తన రిక్షాతో రోడ్డెక్కాడు. కానీ గిరాకీ పిలిచేటోడు లేడు. దీంతో నల్లగొండలో రోడ్డు పక్కన రిక్షాపైనే కార్మికులు ఇలా కునుకు తీస్తున్నాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

# హాట్‌స్పాట్‌లపై.. డేగ కన్ను!

- కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి అష్ట దిగ్బంధం
- ప్రభావిత కాలనీలను హాట్‌స్పాట్‌లుగా గుర్తింపు
- నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఇతర వస్తువుల డోర్‌డెలివరీ
- ఆరోగ్య సర్వేకు 75 బృందాలు
- ఒక్కో బృందానికి 50 ఇళ్ల బాధ్యత




నల్లగొండలోని రెడ్‌జోన్ ఏరియాలో ఎవరూ వెళ్లకుండా అడ్డంగా కట్టిన బారికేడ్లు

సాక్షిప్రతినిధి నల్లగొండ : కరోనా వైరస్ వ్యాప్తి నిరోధంలో భాగంగా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. జిల్లాలో కరోనా వైరస్ సోకిన వారి కాలనీలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి వాటిని అష్టదిగ్బంధం చేసింది. ఆ కాలనీలో రాకపోకలను నిలిపివేసి కాలనీ చుట్టూ అన్ని వైపులా దారులు మూసివేసి (కార్డన్ ఆఫ్) పోలీసులు పహారా కాస్తున్నారు. కాలనీ ప్రజలకు అవసరమైన పాలు, పండ్లు , కూరగాయలు, మెడిసిన్ ఇతర నిత్యావసర వస్తువులను మొబైల్, డోర్ డెలివరీ ద్వారా అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య సమస్యలను పర్యక్షిస్తున్నారు. ఆ కాలనీల నుంచి ఏ ఒక్కరూ బయటికి రాకుండా బయటి వారు లోనికి వెళ్లకుండా పోలీసులు డేగ కన్నువేసి పహారా కాస్తున్నారు.

| జిల్లా కరోనా రిపోర్టు (శుక్రవారం సాయంత్రం వరకు) | |
|---|---|
| పాజిటివ్ కేసులు | 16 |
| శాంపిల్ కలెక్ట్ | 209 |
| రిపోర్టులు వచ్చింది | 176 |
| రావాల్సినవి | 33 |
| ప్రభుత్వ క్వారంటైన్‌లో | 07 |
| హోంక్వారంటైన్‌లో | 1,011 |

**జిల్లాలో 12మందికి కరోనా**

జిల్లాలోని 12మందికి కరోనా వైరస్ సోకింది. ఇందులో ఢిల్లీ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారికి కొందరికి కరోనా వైరస్ సోకగా, వారినుంచి కుటుంబ సభ్యులకు సోకింది. ఇందులో నల్లగొండ పట్టణానికి చెందిన ఐదుగురు మర్కజ్ వెళ్లి రాగా వారికి పాజిటివ్ వచ్చింది. వారి కుటుంబసభ్యుల్లో మరో నలుగురికి పాజిటివ్ వచ్చింది. దీంతో ఒక్క నల్లగొండ పట్టణం నుంచే 9మంది కరోనా వైరస్ బారిన పడ్డారు. మర్కజ్ వెళ్లొచ్చిన మిర్యాలగూడకు చెందిన ఓ మహిళకు, దామరచర్లకు చెందిన మరో మహిళకు కరోనా వైరస్ సోకింది. ఆమె మనుమరాలికి కూడా పాజిటివ్ వచ్చింది. వీరితోపాటు బర్మా దేశానికి చెందిన రొహింగ్యాలు 17మంది నల్లగొండ పట్టణంలోని పలు మసీదులతోపాటు నార్కట్‌పల్లి మండలంలో కూడా పర్యటించారు. వారికి కరోనా పరీక్షలు నిర్వహించగా అందులో నలుగురికి పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే.

**వైరస్ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు**

మర్కజ్ వెళ్లొచ్చి పాజిటివ్ వచ్చిన వారి కాలనీలను జిల్లా యంత్రాంగం హాట్‌స్పాట్‌లుగా గుర్తించింది. నల్లగొండ పట్టణంలో మీర్‌బాగ్ కాలనీ, బర్కత్‌పుర, రెహమాన్‌బాగ్, మాన్యంచెల్కతోపాటు, మిర్యాలగూడలోని సీతారాంపురం, దామరచర్ల పాంత్రాలను గుర్తించారు. ఈ కాలనీల్లో వైరస్ సోకిన వారు ఉండడంతో ఆ కాలనీలను అధికారులు అష్ట దిగ్బంధం చేశారు.

**వాహనాల ద్వారా నిత్యావసరాలు ...**

హాట్‌స్పాట్లుగా గుర్తించిన జిల్లాలోని ఆరు కాలనీల్లో ప్రజలకు అవసరమైన పాలు, పండ్లు, కూరగాయలతోపాటు మెడిసిన్ కూడా మొబైల్ వాహనాలు, డోర్‌డెలివరీల ద్వారా అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్నారు.

**పోలీసుల ప్రత్యేక నిఘా**

హాట్‌స్పాట్ కాలనీలపై పోలీసులు డేగ కన్నువేసి కాపలా కాస్తున్నారు. ఆ కాలనీలకు వెళ్లే అన్ని దారులను బారికేడ్లతో మూసివేశారు. ఎక్కడికక్కడ పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు. ఎవరినీ కాలనీ నుంచి బయటికి రాకుండా.. బయటివారు కాలనీలోకి వెళ్లకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

### సర్వేకు సహకరించాలి

కరోనా కట్టడిలో భాగంగా మా సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. అనారోగ్య సమస్య ఉంటే బృందాలకు తెలియజేస్తే వెంటనే వారిని ఆరోగ్య కేంద్రాలకు తరలించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ



సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

## కంటైన్మెంట్లలో ఆరోగ్య సర్వే

నల్లగొండ టౌన్ : కరోనా కట్టడిలో భాగంగా పట్టణంలో పాజిటివ్ కేసులు నమోదైన నాలుగు ప్రాంతాలను కంటైన్మెంట్ ఏరియాలుగా ప్రకటించారు. వీటికి కిలోమీటర్ పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ గురువారంనుంచి ఆరోగ్య సర్వే నిర్వహిస్తోంది. ఇప్పటికే మీర్‌బాగ్ కాలనీ, మాన్యంచెల్క, రహమాన్‌బాగ్, బర్కత్‌పుర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని కార్డన్‌ఆఫ్ చేపట్టారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలంతా క్వారంటైన్‌లోనే ఉన్నారు. అయినప్పటికీ వాటిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కంటైన్మెంట్ ప్రాంతాలుగా గుర్తించి ఆ కాలనీకి కిలోమీటర్ పరిధిలోని ఇళ్లలో ఆరోగ్య సర్వే చేపట్టింది. ఇందుకోసం 75 బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఏఎన్‌ఎంతో ఆశ కార్యకర్త ఉంటారు. ఒక్కో బృందం 50 ఇళ్లలో సర్వే నిర్వహిస్తారు. ఆ ఇంటిలోని సభ్యుల వివరాలు, వారికి జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పితోపాటు ఇతర ఆరోగ్య పరమైన ఏమైనా సమస్యలు ఉన్నాయా.. లేవా అన్న అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అనుమానితుల క్వారంటైన్ పిరియడ్ పూర్తయ్యేంత వరకు నిత్యం పర్యవేక్షణ చేయడంతోపాటు వారి ఆరోగ్యస్థితిగతులను వాకబు చేయనున్నారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వారిని ఆరోగ్య కేంద్రానికి తరలించి పరీక్షలు చేయించనున్నారు.

**అనేక అవాంతరాలు**

ఆరోగ్య సర్వేలో ఏఎన్‌ఎంలు, ఆశాలు అనేక అవాంతరాలు చవిచూస్తున్నట్లు తెలుస్తోంది. సర్వే కోసం వెళ్లిన వారికి ఆయా కుటుంబ సభ్యులు వివరాలను సక్రమంగా తెలియజేయక పోవడంతోపాటు ‘మీకెందుకు మా వివరాలు తెలియజేయాలి. మే చెప్పం వెళ్లిపోండి’ అంటూ ఈసడించుకుంటున్నట్లు సర్వేకు వెళ్లిన ఓ ఆశా కార్యకర్త తెలిపింది. మరికొందరైతే సరైన వివరాలు తెలియజేయకుండా సమయాన్ని వృథా చేస్తున్నారు.

## జిల్లాలో క్వారంటైన్ వివరాలు (శుక్రవారం సాయంత్రం వరకు)

| కేంద్రం | క్వారంటైన్‌లో.. | పూర్తయినవారు |
|---|---|---|
| మిర్యాలగూడ | 00 | 16 |
| నల్లగొండ | 07 | 89 |
| నకిరేకల్ | 0 | 0 |

**క్వారంటైన్ సెంటర్లు, ఇన్‌చార్జ్ సెల్ నంబర్**

| | | | |
|---|---|---|---|
| నల్లగొండ | ఎంజీయూ | రాజ్‌కుమార్ | 7780696154 |
| మిర్యాలగూడ | తుంగపాడు మోడల్ స్కూల్ | కేసా రవి | 9246349881 |
| నకిరేకల్ | ప్రభుత్వ వైద్యశాల | డాక్టర్ శ్రీనాథ్ | 8142292229 |

**కూరగాయలు, నిత్యావసరాల సరఫరా**

జిల్లాలోని మిర్యాలగూడలో మొబైల్ రైతు బజార్లు 10 ఉన్నాయి. ఎన్‌ఎస్‌పీ క్యాంపు వద్ద రైతు బజార్ ఉంది. నల్లగొండ, దేవరకొండలలో మీ కోసం యాప్ ద్వారా నిత్యావసరాలను డోర్ డెలివరీ చేయనున్నారు. ఎన్జీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, ప్రతిక్ జూనియర్ కాలేజ్, బాలికల జూనియర్ కాలేజీల్లో కూరగాయల మార్కెట్‌లు ఏర్పాటు చేశారు.

అధిక ధరకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు — మిర్యాలగూడ : 7330733557, 7330733558

## 12న ‘హలో డీఎంహెచ్‌ఓ’

- ఉదయం 9 గంటలనుంచి 10 గంటల వరకు



సాక్షి మీడియా ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావుతో ఈ నెల 12వ తేదీ (ఆదివారం ) ఫోన్ ఇన్ కార్యక్రమం జరగనుంది. కరోనా వైరస్‌పై మీకున్న అనుమానాలు, వైరస్ వ్యాప్తి నిరోధానికి జిల్లా వైద్యారోగ్యశాఖ తీసుకుంటున్న జాగ్రత్తలు, మీమీ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలు.. వాటి పరిష్కార మార్గాలను ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా తెలుసుకోవచ్చు. 12వ తేదీ సమయం ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు సెల్‌నంబర్ 99669 21036కు ఫోన్ చేసి మీ అనుమానాలను నివృత్తి చేసుకోవాలి.

# ఆన్‌లైన్‌లో నిత్యావసరాలు

## ‘మీ కోసం’ యాప్ ఆవిష్కరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

యాప్ అడ్రస్ :(https://covid-19.egovindia.in/nalgonda)



నల్లగొండ : టన్నెల్ నుంచి బైక్‌పై బయటికి వస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, కూరగాయల డోర్ డెలివరీ కోసం ఏర్పాటు చేసిన మీకోసం యాప్‌ను, క్లాక్‌టవర్ సెంటర్‌లో కరోనా క్రిమినిర్మూలన టన్నెల్‌ను గురువారం విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి ఆ టన్నెల్‌నుంచి ద్విచక్ర వాహనం నడిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా వ్యాప్తి నివారణలో తెలంగాణ విజయం సాధించిందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో గుంపులుగా నాయకులే ఉంటున్నారన్నది తన దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో కచ్చితంగా భౌతికదూరం పాటించాలన్నారు. నిత్యావసర వస్తువులు పాలు, పండ్లు, కూరగాయలు, మందులు తెచ్చుకోలేని నల్లగొండ మున్సిపాలిటీ ప్రజల కోసం మీకోసం యాప్‌ను ఏర్పాటు చేశారని, అది ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఎలాంటి సేవా పన్నులేకుండా సరుకులను ఎమ్మార్పీకే ఇంటి వద్దకు తెచ్చిస్తారని తెలిపారు. గడియారం సెంటర్‌లో సోడియం హైపో క్లోరైడ్ టన్నెల్‌ను ఏర్పాటు చేశారని, ప్రజలు తప్పనిసరి బయటికి వస్తే ఉపయోగించుకోవాలన్నారు. .



మీకోసం యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

**ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం**

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. గత రబీ కంటే ఈసారి ఎక్కువగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, కమిషనర్ దేవ్‌సింగ్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**దేవరకొండలో..**

కొండమల్లేపల్లి : దేవరకొండ పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేసే టన్నెల్‌ను మంత్రి జగదీశ్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీఓ వాసుచంద్ర, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# మాస్కులు తప్పనిసరిగా ధరించాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నల్లగొండ : ఇంట్లో నుంచి బయటకు వెళ్లే తప్పకుండా మాస్కులు ధరించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మాస్కుల వినియోగం తప్పనిసరి చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంట్లో నుంచి బయటికి వెళ్లినా, గదుల్లో ఉన్నా, ఇతరులతో మాట్లాడే సమయంలో మాస్కులు ధరించాలన్నారు. వైద్య, శాస్త్ర సాంకేతిక పరంగా చేసిన అధ్యయనాలు ఈ విషయాన్ని వెల్లడించినట్లు, జపాన్ దేశంలో చేసిన అధ్యయనం అనుసరించి మాస్కుల వినియోగంతో వైరస్ వ్యాప్తి నియంత్రణలో ఉన్నట్లు వెల్లడైనట్లు తెలిపారు. కరోనా సోకిన వ్యక్తుల్లో ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించట్లేదని, కాని వారినుంచి వ్యాధి సోకే ప్రమాదముందని అన్నారు. మాస్క్ ధరించడం వల్ల ఇతరులకు సోకకుండా, ఇతరులనుంచి సంక్రమించకుండా రక్షణగా ఉంటుందన్నారు. అన్ని కార్యాలయాలు, పనిచేసే చోట ఉద్యోగులు తప్పనిసరిగా మాస్క్ లు వినియోగించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కరోనా వైరస్ నియంత్రణలో ముందు ఉండి పనిచేసే వారు తప్పనిసరిగా వీటిని వినియోగించాలన్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో, రద్దీ ప్రాంతాల్లో, పని చేసే చోట మాస్క్ లు తప్పక ధరించాలని సూచించారు. ఒకసారి వినియోగించిన మాస్క్ ను శుభ్రం చేసిన తర్వాత మాత్రమే వాడాలన్నారు. రివర్స్ చేసి మాస్క్ ధరిస్తే వైరస్ సంక్రమించే ప్రమాదం ఉందని అన్నారు. వస్త్రంతో తయారు చేసిన మాస్క్ వినియోగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, తప్పనిసరి అయితే మాత్రం డిస్పోజబుల్ మాస్క్ వినియోగించాలని చెప్పారు. డిస్పోజబుల్ మాస్క్ ధరించిన ఆరు గంటల తర్వాత తీసివేసి మూత ఉన్న డస్ట్ బిన్లో వేయాలన్నారు. మాస్క్ తొలగించిన తర్వాత ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్ లేదా సబ్బు నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. వినియోగించిన మాస్కును ఉప్పు కలిపిన వేడి నీటిలో లేదా సబ్బు నీటిలో ఉంచాలన్నారు. వస్త్రంతో తయారు చేసిన మాస్కులు ఒకసారి వినియోగించిన తరువాత సబ్బు, డెటాల్, వేడి నీటితో వాష్ చేసి ఎండలో 5 గంటలు ఆరవేయాలన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించాలని తెలిపారు.

### 21వరకు హోం క్వారంటైన్‌లో..

మిర్యాలగూడ : కరోనా వైరస్ అనుమానితులను క్వారంటైన్ సెంటర్ నుంచి శుక్రవారం అందరినీ డిశ్చార్జ్ చేశారు. కాగా వీరిని ఈ నెల 21వ తేదీ వరకు హోం క్వారంటైన్‌లో ఉండాల్సిందిగా అధికారులు సూచించారు. తుంగపాడు క్వారంటైన్ సెంటర్‌లో కొద్ది రోజులుగా కరోనా వైరస్ అనుమానితులైన 16 మందిని ఉంచారు. కాగా ఈ నెల 9న 14 మందిని డిశ్చార్జ్ చేయగా.. శుక్రవారం ఇద్దరిని డిశ్చార్జ్ చేశారు. వీరందరిని ఈ నెల 21 వరకు హోం క్వారంటైన్‌లో ఉండాల్సిందిగా వారి చేతిపై వైద్య ఆరోగ్య శా ఖ అధికారులు క్వారంటైన్ ముద్ర వేశారు. వైద్యులు ప్రతిరోజూ ఇంటికి వెళ్లి వీరిని పర్యవేక్షిస్తారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసా రవి తెలిపారు.

### సాగర్‌లో ఐదుగురికి నెగెటివ్ రిపోర్ట్

నాగార్జునసాగర్ : కరోనా బాధితుడితో సన్నిహితంగా మెలిగారనే అనుమానంతో సాగర్‌కు చెందిన ఐదుగురిని క్వారంటైన్‌కు పంపారు. నల్లగొండ ఆస్పత్రి నుంచి వారి నమూనాలను పరీక్షలకు పంపారు. వారందరికీ నెగెటివ్ రిపోర్ట్ వచ్చినట్లు డాక్టర్ విజయకుమారి శుక్రవారం తెలిపారు. దీంతో సాగర్ కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

# కరోనా వేళ.. రైతులు జాగ్రత్త!

**కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఏ ఆరీఫ్‌ఖాన్**



త్రిపురారం (నాగార్జునసాగర్) : వ్యవసాయంలో ప్రస్తుత పంటలు, పంటకోత కార్యకలాపాలు, ఉత్పత్తుల నిల్వ, మార్కెటింగ్‌లో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఏ ఆరీఫ్‌ఖాన్ అన్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ నేపథ్యంలో రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- చేతి కోతలు చేపట్టే వరికోతల విషయంలో ప్రతి వ్యక్తి 4 నుంచి 5 అడుగుల దూరంలో ఉండి పనులు పూర్తి చేసుకోవాలి. పంట కోతలకు వచ్చిన వ్యక్తులందరూ మాస్కులు తప్పకుండా ధరించాలి. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- రైతులు, కూలీలు విశ్రాంతి, భోజన సమయంలో ఉత్పత్తుల బదిలీ, సేకరణ విషయంలో 3 నుంచి 4 అడుగుల భౌతిక దూరాన్ని పాటించాలి.
- ఒక్కరోజే అన్ని రకాల క్షేత్రస్థాయి కార్యకలాపాలను నిర్వహించకూడదు. అలాగే ఎక్కువ సంఖ్యలో వ్యక్తులు లేకుండా చూసుకోవాలి.
- వ్యవసాయ పనుల్లో సాధ్యమైనంత వరకు ఆరోగ్యకరమైన వ్యక్తులను మాత్రమే ఉండే విధంగా చూసుకోవాలి.
- యాంత్రిక కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. యంత్రంతోపాటు అవసరమైన మేరకు మాత్రమే వ్యక్తులను ఉపయోగించుకోవాలి.
- ప్రతి యంత్రాన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద శుభ్రం చేసుకోవాలి. అన్ని రవాణా వాహనాలు, గోనె సంచులు, ఇతర సామగ్రిని శుభ్రం చేసుకోవాలి.
- సేకరించిన పంట ఉత్పత్తులను 3 నుంచి 4 అడుగుల దూరంలో చిన్న కుప్పలుగా పోసుకోవాలి. రద్దీని నివారించడానికి క్షేత్ర స్థాయి ప్రాసెసింగ్‌కు ప్రతి కుప్పను ఒక్కరు లేక ఇద్దరు వ్యక్తులు మాత్రమే నిర్వహించాలి.
- పంట ఉత్పత్తులను సాధ్యమైనంత వరకు క్షేత్ర స్థాయిలోనే మార్కెటింగ్ చేసుకోవాలి
- యార్డులు ప్రభుత్వం మూసివేసినందు వల్ల రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకెళ్లకూడదు.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, గ్రామాల వారీగా తేదీలను కేటాయించి వారికి కావాల్సిన టోకెన్‌లను రైతులకు అందిస్తారు. తద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుంది.
- ఆలస్యంగా నాటిన వరిలో అగ్గితెగులు నివారణకు 0.6 గ్రా ట్రైసైక్లోజోల్ లేదా 2.5 మి.లీ కాసుగామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. నత్రజని ఎరువుల మోతాదును తగ్గించుకొని పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలి. పొలంలో ఉండే వరాలపై కూడా మందు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి.
- గణనీయంగా పెరిగిన రబీ వరి సాగు విస్తీర్ణం వల్ల, అంతేకాకుండా కోతల సమయం కావడంతో వరి కోతల యంత్రాల మరమ్మతుల నిర్వహణ కోత పనుల కార్యక్రమాల్లో నిమగ్నమైన కార్మికులు తగిన జాగ్రత్తలు, భద్రత చర్యలు తీసుకోవాలి.

epaper.sakshi.com

# సాక్షి హాయ్... మీరేం చేస్తున్నారు?

**సాక్షితో పంచుకోండి...**

మీ విశేషాలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : 9963823329

మెయిల్ ఐడీ: nalgondasakshidesk@gmail.com

పిల్లల ఇండోర్ గేమ్స్, పెద్దవాళ్ల కబుర్లు, హోమ్ మేడ్ ఫుడ్, హౌస్ ఫుల్ టైమ్.. మన కోసం.. మన చేత.. మన వల్ల అన్నట్లుగా మారేందుకు వచ్చిన అరుదైన అవకాశం లాక్‌డౌన్. ఈ సమయంలో యాక్టివిటీస్ డౌన్ కావడంతో అనుబంధాలు ఆన్ అవుతున్నాయి. వంటలు చేసే మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలతో కలిసి ఆటలాడుతున్న పెద్దవాళ్లు, ఇలాంటి అరుదైన, అపురూపమైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. మరి మీరేం చేస్తున్నారు? మీ ఇంట్లో ఎంత ఫన్ సృష్టిస్తున్నారు? నేడు ఎలా సందడి చేస్తున్నారు? రేపటికి ఎలా ప్రిపేర్ అవుతున్నారు? తదితర ఆసక్తికర విషయాలు 'సాక్షి'తో పంచుకోండి... గృహమే కదా స్వర్గసీమ అనే స్ఫూర్తిని అందరితోనూ పంచుకోండి. ఆయా అంశాలను మేము ప్రచురిస్తాం.





తానెదారుపల్లిలో అష్టాచెమ్మ ఆడుతున్న తల్లీ కూతుళ్లు..


చెస్ ఆడుతూ..


చౌటుప్పల్‌లో ఇంట్లోనే ఆడుకుంటూ..


జెర్రిపోతులగూడెంలో..


కోదాడలో అష్టాచెమ్మా ఆడుతూ..


చిలుకూరులో సరదాగా...


చీకటిమామిడిలో,


చిట్యాలలో క్యారమ్స్ ఆడుతూ...


దేవరకొండలో పచ్చీస్ ఆడుతున్న కుటుంబ సభ్యులు


నల్లగొండలో..


గట్టుప్పల్‌లో క్యారమ్స్ ఆడుతూ..,


కట్టంగూర్‌లో..


నల్లగొండలోని పద్మావతి కాలనీలో చెస్ ఆడుతూ...


మేళ్లచెర్వులో..


పెద్దఅడిశర్లపల్లిలో క్యారమ్స్ ఆడుతున్న కుటుంబసభ్యులు


సంస్థాన్‌నారాయణపురంలో సరదాగా టీవీ చూస్తూ...


హాలియాలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు


లక్ష్మీదేవిగూడెంలో చదువుకుంటున్న చిన్నారులు

### సందడే సందడి..!

లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలంతా ఇళ్ల వద్దే ఉంటుండడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రతిఇంట్లో ఎన్నో అపురూప దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ దృశ్యాలను పలువురు 'సాక్షి హాయ్ మీరేం చేస్తున్నారు'తో పంచుకున్నారు.


కోదాడలో చపాతీ చేస్తూ..

### 16మంది హోం క్వారంటైన్‌లోకి

**పెద్దవూర :** కరోనా వైరస్ నేపథ్యంలో మండలంలో 16మందిని హోం క్వారంటైన్‌లో ఉంచినట్లు మండల వైద్యాధికారి పి.శంకర్ శుక్రవారం తెలిపారు. తమ్మడపల్లి, నులకవారిగూడెం, బట్టుగూడెం గ్రామాలకు చెందిన 16 మంది దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో జరిగిన శుభకార్యానికి గురువారం హాజరయ్యారు. ఇటీవల దామరచర్ల మండలంలో ఇద్దరికి పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ముందస్తు జాగ్రత్తగా ఈ 16 మందిని హోం క్వారంటైన్‌లో ఉంచినట్లు తెలిపారు.

### సీఎం సహాయ నిధికి విరాళం

**నార్కట్‌పల్లి :** సీఎం రిలీఫ్ ఫండ్‌కు తమ వంతు సహకారంగా నార్కట్‌పల్లి ఉపసర్పంచ్ సిరిపంగి స్వామి రూ. 10 వేలు, రైస్ మిల్ యజమాని వేణు రూ.15 వేలు, రైస్ వ్యాపారవేత్త అమరవాది రాములు రూ. 10 వేలను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు శుక్రవారం అందజేశారు.

### మద్యం పట్టివేత

**నాంపల్లి :** మండలంలోని పెద్దాపురం గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ మాధవయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 23 రాయల్‌స్టాగ్ క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్నారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసు

**పెద్దవూర :** అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎల్.మౌనిక అన్నారు. శుక్రవారం మండలంలోని మద్యం దుకాణాలకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సీల్ వేశారు.

### చర్యలు తీసుకోవాలి

**నాంపల్లి :** కిరాణా దుకాణాల్లో ప్రజలకు అధిక రేట్లకు సరుకులు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అమర వీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొరే సాయిరాం శుక్రవారం అధికారులను డిమాండ్ చేశారు.

### ప్రోత్సాహకం ఇవ్వాలి

**నల్లగొండ టూటౌన్ :** కరోనా వైరస్ నిర్మూలన కోసం చిత్త శుద్ధితో పని చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులందరికీ సీఎం ప్రకటించిన ప్రోత్సాహకం ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దేవ్‌సింగ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు దండెంపల్లి సత్తయ్య, ఎండీ. సలీం, జక్కల రవీందర్ ఉన్నారు.

### ఇళ్లలోనే పూలే జయంతిని నిర్వహించాలి

**నల్లగొండ టౌన్ :** బడుగుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే 193వ జయంతిని ఈనెల 11న ప్రజలందరూ వారివారి ఇళ్లలోనే నిర్వహించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీహెచ్ హరి, ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, గౌరవాధ్యక్షుడు కంది సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

### బత్తాయి రైతులను ఆదుకోవాలి

**నల్లగొండ టౌన్ :** కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా జిల్లాలోని బత్తాయి రైతులు బత్తాయిలను అమ్ముకోలేక నష్టపోయే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని మాజీ సర్పంచ్, కౌన్సిలర్, జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

### కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులను జాతీయం చేయాలి

**కొండమల్లేపల్లి :** కరోనా మహమ్మారి వ్యాప్తి చెందుతున్న తరుణంలో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులను ప్రభుత్వాలు జాతీయం చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వంగూరి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కరోనా కట్టడికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కనీసం ఇప్పటి వరకు ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### చిట్యాలకు చేరుకున్న మురళీకృష్ణ పాదయాత్ర



**చిట్యాల :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన డి.మురళీకృష్ణ గత నెల 25న విజయవాడ నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం చిట్యాలకు చేరుకుంది. ఆయనకు చిట్యాలలో పిరమిడ్ ధ్యానమండలి ప్రతినిధి యాస కిరణ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. మురళీకృష్ణ మాట్లాడుతూ నిత్యం ధ్యానం చేయడం ద్వారా కరోనాను కట్టడి చేయవచ్చని పేర్కొన్నారు.

### గుడ్‌ఫ్రైడే వేడుకలు

**కేతేపల్లి :** మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు సాదా సీదాగా జరుపుకున్నారు. ఇళ్లలోనే ప్రార్థనలు చేశారు.

### మాస్కులు, శానిటైజర్స్ పంపిణీ

**నార్కట్‌పల్లి :** లాక్‌డౌన్ నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, డాక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులకు మండల ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మాస్కులు, శానిటైజర్స్ పంపిణీ చేశారు.

**గుర్రంపోడు :** మండలంలోని పాల్వాయి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం 25 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, 200 మందికి మాస్కులు పంపిణీ చేశారు.

### ఎమ్మెల్యే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**మునుగోడు :** ఎమ్మెల్యే చేస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కరోనా నియంత్రణ కోసం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు ఎమ్మెల్యే పంపిన మాస్కులు, శానిటైజర్లను శుక్రవారం పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కె. రజనీకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎం. శ్యాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

### మాస్కుల పంపిణీ

**కట్టంగూర్ :** మండలంలోని పరడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రంలో ఆ గ్రామ సర్పంచ్ పుట్ట సృజన తన సొంత ఖర్చులతో శుక్రవారం సంఘ బంధం సభ్యులకు, హమాలీలకు, రైతులకు 280 మాస్కులు పంపిణీ చేశారు.

### పంట నష్టపోయిన రైతులకు అండగా ప్రభుత్వం

**చింతపల్లి :** మండలంలోని గ్రామాల్లో గురువారం కురిసిన భారీ వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వర్కాల, చింతపల్లి గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు.

### డిండి సంతలో కనిపించని భౌతిక దూరం


సంతలో గుంపులుగా ఉన్న జనం

**డిండి :** ఒక వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా వైరస్ నియంత్రణకు లాక్‌డౌన్‌ను కొనసాగిస్తుంటే మండల కేంద్రంలోని కూరగాయల సంతలో మాత్రం ప్రజలు ఏ మాత్రం సోషల్ డిస్టెన్స్ పాటించడం లేదు. శుక్రవారం ఉదయం మండలంతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్, ఉప్పునుంతల, చారగొండ మండలాల నుంచి అధిక సంఖ్యలో జనం సంతకు రావడంతో జాతరను తలపించింది. ప్రజలు గుంపులుగా ఉండడంతో సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ.కుర్మయ్య తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రజలను అక్కడి నుంచి పంపించేశారు.

# ఆపదలో అండగా..


నల్లగొండలో కూరగాయలను పంపిణీ చేస్తున్న నాయకులు


నిత్యావసర వస్తువులు, పుచ్చకాయలు అందజేస్తున్న వికాస తరంగిణి సభ్యులు


మిర్యాలగూడలో కూరగాయలు పంపిణీ చేస్తున్న టీఎన్‌బీ ఫౌండేషన్ సభ్యులు


మిర్యాలగూడలో పోలీస్ సిబ్బందికి బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు


నల్లగొండలో భోజనం వడ్డిస్తున్న బీజేపీ నాయకులు

**నాగార్జునసాగర్ :** నాగార్జునసాగర్‌లోని బీసీగురుకులంలో ఆంధ్రా వలస కూలీల కోసం ఏర్పాటు చేసిన సహాయక శిబిరంలో 60మందికి శుక్రవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వికాసతరంగిణి సంస్థ సభ్యులు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పుచ్చకాయలు పంపిణీ చేశారు. పైలాన్‌కాలనీలోగల 9హెచ్‌కాలనీలోని స్నేహితులంతా కలిసి దుస్తులు, టవల్స్, దుప్పట్లు, సబ్బులు అందజేశారు.

**తిరుమలగిరి (నాగార్జునసాగర్) :** మండలంలోని సీతల్‌తండాలోని సుమారు 150 కుటుంబాలకు శుక్రవారం సర్పంచ్ ఇస్లావత్ చందులాల్‌నాయక్ తన సొంత ఖర్చులతో కూరగాయలను పంపిణీ చేశారు.

**వేములపల్లి :** మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు, ఆశ కార్యకర్తలకు శుక్రవారం టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా కార్యదర్శి పల్లా వీరయ్య బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సామమ్మ పాల్గొన్నారు.

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు శుక్రవారం టీఎన్‌బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయలు పంపిణీ చేశారు.

**మిర్యాలగూడ టౌన్ :** బీజేపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు రాయపూడి ఆశాలత జగన్మోహన్‌రావు ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పేదలకు సబ్బులు, మంచి నూనె ప్యాకెట్లను పంపిణీ చేశారు.

**కూరగాయల పంపిణీ**

**నల్లగొండ టూటౌన్ :** కరోనా మహమ్మారి కారణంగా ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో బీజేపీ నాయకులు శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో 100మంది పేదలకు 10 రోజులకు సరిపడ వివిధ రకాల కూరగాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, సట్టు కృష్ణయ్య, నారబోయిన చంద్రమోహన్, దుబ్బాక లక్ష్మణ్ పాల్గొన్నారు.

**బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ**

**మిర్యాలగూడ టౌన్ :** లాక్‌డౌన్‌లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీస్, వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి శుక్రవారం శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కర్నాటి భిక్షమయ్య జ్ఞాపకార్థంగా ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో వెజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. అదే విధంగా రూరల్, వన్ టౌన్, టూ టౌన్ స్టేషన్లల్లో కూడా భోజనం ఏర్పాటు చేశారు.

**నాంపల్లి :** కరోనా వైరస్ నియంత్రణకు ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న కార్మికులు, పోలీస్ సిబ్బందికి టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కుంభం కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన సొంత ఖర్చులతో కార్మికులకు, పోలీస్ సిబ్బందికి కూరగాయలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుంతల రమేశ్‌దీన్‌దయాళ్, పోలీస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

**దామరచర్ల :** కరోనా వైరస్ నేపథ్యంలో లాక్‌డౌన్ కొనసాగుతుండడంతో పేదలు ఇబ్బందులు పడకుండా కొంతమంది దాతలు తమ దాతృత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం స్థానిక యువత గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యుత్ సిబ్బందికి శానిటైజర్స్, మాస్కులు అందజేశారు. వీరందరికీ భోజనం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో రెడ్ జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయలు, పండ్లు, మాస్కులు పంపిణీ చేశారు. మండలంలోని వాడపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలు పంచారు.

**ఆస్పత్రిలో అన్నదానం**

**నల్లగొండ టూటౌన్ :** కరోనా వైరస్ నిర్మూలన కోసం లాక్‌డౌన్ ప్రకటించడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు రియల్ ఎస్టేట్ వ్యాపారి బత్తుల కృష్ణ సహకారంతో శుక్రవారం 9వ రోజు బీజేపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు ప్రసాద్, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పొగాకు యాదగిరి, మంగళపల్లి కిషన్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కార్మికులకు అన్నదానం**

**చిట్యాల :** మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం పట్టణానికి చెందిన వలకీర్తి రమేష్ తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి ప్రారంభించారు.

**నార్కట్‌పల్లి :** మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఉన్న యాచకులకు నార్కట్‌పల్లికి చెందిన వ్యాపారవేత్త ఆకుల సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులు లాక్‌డౌన్ ప్రకటించిన నాటి నుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అన్నదానం చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


తానెదార్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ


నాంపల్లిలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, సింగిల్ విండో చైర్మన్


చీకటిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బొళ్ల వెంకట్‌రెడ్డి


రాజవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంసీ కోటిరెడ్డి

**గుర్రంపోడు :** మండలంలోని తానెదార్‌పల్లి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

**నాంపల్లి :** ఐకేపీ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతారవీందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పస్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగులవంచ నరేందర్‌రావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కుంభం కృష్ణారెడ్డి తదితరులున్నారు.

**హాలియా :** అనుముల మండలంలోని వీర్లగడ్డతండా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ పేర్ల సుమతి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, సర్పంచ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

**కేతేపల్లి :** మండలంలోని కొత్తపేట, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత శుక్రవారం ప్రారంభించారు.

**రైతులు మద్దతు ధర పొందాలి**

**తిరుమలగిరి (నాగార్జునసాగర్) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

**పెద్దవూర :** మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని జూబ్లీనగర్‌కు చెందిన కుంభర్తి రాజేందర్(60) కొంతకాలంగా హైదరాబాద్‌లోని కాటేదాన్ లక్ష్మీగూడలో నివాసం ఉంటున్నాడు. మార్చి 19న త న భార్య పింఛన్ డబ్బుల కోసం భార్యాభర్తలు ఇద్దరు కలిసి తమ స్వగ్రామమైన అచ్చంపేటకు వెళ్లారు. పింఛన్ డబ్బులు తీసుకున్న తర్వాత 20న అతడు ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. గురువారం ఉదయం మండల కేంద్రం సమీపంలో నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన వేప చెట్టుకింద రాజేందర్ విగత జీవిగా పడి ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడు చాలా దూరం నడుచుకుంటూ వచ్చి వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**వేములపల్లి :** మండల కేంద్రంలోని వ్యవసాయ పొలం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. సు మారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పంట పొలాల వద్ద చెట్లపొదల్లో చెట్టుకు ఉరివేసుకుని అ నుమానస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఉరివేసుకొని 20రోజులకు పైగా అయి ఉండవచ్చని, మృతుడు నల్ల చొక్కా, జీన్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిపారు. మృతుడిని గుర్తించినట్లయితే వివరాల కోసం 9440700070 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామగిరి(నల్లగొండ) :** నల్లగొండ ఇండోర్, గొల్లగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మెయిన్ లైన్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఆ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న వన్‌టౌన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# ధాన్యం రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**– అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్**


మిల్లర్లు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్

**నల్లగొండ :** కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు రవాణా చేయడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై లారీ కాంట్రాక్టర్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, పౌరసరఫరా అధికారులతో ఆయన తన ఛాంబర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా, మిల్ పాయింట్ వద్ద అన్‌లోడ్ తదితర విషయాలు సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 412 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ఇందులో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు (ప్యాక్స్) ద్వారా 171, ఐకేపీ ద్వారా 241 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3,299 మంది రైతుల నుంచి 25,462 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ట్యాగ్ చేసిన మిల్లులకు లారీలు ఏర్పాటు చేసి తరలించాలని, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని అన్నారు. మిల్లర్లు కూడా కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యం ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పౌరసరఫరాల డీటీలు, మిల్లర్, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రుక్మిణీదేవి, పౌర సరఫరాల సంస్థ డీఎం.నాగేశ్వర్‌రావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి భద్రాద్రి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్
REAL ESTATE
PLOT FOR SALE
■ నల్గొండ టౌన్‌లో హైవే ఫేసింగ్ వెంచర్లో 2 BHK Houses & ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, జిమ్, BT రోడ్స్,అన్ని సౌకర్యా లతో+లోన్ సౌకర్యం. 9346837010. [H-744325]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి బిజినెస్
శనివారం
11-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు** (గురువారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 1266 ▲ | 31,160 |
| నిఫ్టీ | 363 ▲ | 9,112 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,154 | ▲ 1 |
| డోజోన్స్ | 23,719 | ▲ 286 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 5,843 | ▲ 165 |
| డాక్స్ | 10,565 | ▲ 232 |
| షాంఘై | 2,797 | ▼ 29 |
| నికాయ్ | 19,499 | ▲ 153 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 73.02 | 79.76 |
| £ | బ్రిటన్ పౌండ్ | 93.11 | 99.65 |
| € | యూరో | 81.14 | 87.45 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 60.00 | 78.00 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | 46.60 | 50.93 |
| S$ | సింగపూర్ డాలర్ | 52.58 | 56.80 |
| SAR | సౌదీ రియాల్ | 19.30 | 21.16 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 19.44 | 22.07 |
| ¥ | చైనా యువాన్ | 9.70 | 11.48 |

# చమురు ఉత్పత్తి కోతకు డీల్...

## క్రూడ్ ఉత్పత్తి దేశాల అంగీకారం ● రోజుకు 10 మిలియన్ బ్యారెళ్లు కట్ ● ఒపెక్ వెల్లడి

**లండన్:** డిమాండ్ పడిపోయిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మరింత పతనమై, తమ ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలకుండా ముడిచమురు ఉత్పత్తి దేశాలు అసాధారణ చర్యలు తీసుకుంటున్నాయి. రేట్ల పతనానికి అడ్డు కట్ట వేసే దిశగా ఉత్పత్తిని భారీగా తగ్గించుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఉత్పత్తి దేశాలన్నీ దీనిపై ఒక అంగీకారానికి వచ్చినట్లు సుదీర్ఘంగా సాగిన వర్చువల్ సమావేశం అనంతరం పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ వెల్లడించింది. ఈ డీల్ ప్రకారం జూలై దాకా ఒపెక్, దాని భాగస్వామ్య దేశాలు చమురు ఉత్పత్తిని రోజుకు 10 మిలియన్ బ్యారెళ్ల మేర (బీపీడీ) తగ్గించుకోనున్నాయి. ఆ తర్వాత నుంచి డిసెంబర్ దాకా 8 మిలియన్ బీపీడీకి, 2021 నుంచి 16 నెలల పాటు 6 మిలియన్ బీపీడీకి పరిమితం చేయనున్నాయి. తొలుత ఈ డీల్‌కు ఒప్పుకోకపోయినప్పటికీ ఉత్పత్తి కోతతో తమకు వాటిల్లే నష్టాలను భర్తీ చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భరోసా ఇవ్వడంతో మెక్సికో కూడా అంగీకారం తెలిపింది. అమెరికాతో పాటు మరిన్ని దేశాలు కూడా తమవంతుగా ఉత్పత్తి కోతలను పరిశీలిస్తున్నాయి. తాజా డీల్‌తో ప్రపంచవ్యాప్తంగా చమురు ఉత్పత్తిలో 15 శాతానికి కోతపడవచ్చని విశ్లేషకుల అంచనా. ఇటు పరిమాణంపరంగాను, అటు ఉత్పత్తి కోతలో భాగమవుతున్న దేశాల సంఖ్యాపరంగాను ఇది అసాధారణమని తెలిపారు. ఇంధన రంగంలో బద్ధవిరోధులైన దేశాలు కూడా ఇందులో పాలు పంచుకోవడం విశేషమని పేర్కొన్నారు.

**ఇది సరిపోదు..**

అయితే, భారీగా పడిపోయిన క్రూడాయిల్ డిమాండ్‌పరమైన నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రతిపాదిత కోతలేమీ సరిపోయే అవకాశాలు లేవని విశ్లేషకులు చెప్పారు. ఇప్పటికే నిల్వలు భారీగా పేరుకుపోయాయని, ఉత్పత్తి కోతలపై ఆయా దేశాలు ఆలస్యంగా నిర్ణయాలు తీసుకున్నాయని పేర్కొన్నారు. ఒకవేళ ఉత్తర అమెరికన్ సంస్థలు 5 మిలియన్ బ్యారెళ్ల మేర ఉత్పత్తిని తగ్గించుకున్నా.. ఇంకా 5–10 మిలియన్ బీపీడీ మేర సరఫరా అధికంగానే ఉంటుందని అంచనా. ఏప్రిల్‌లో సరఫరా, డిమాండ్ మధ్య 27.4 మిలియన్ బీపీడీ స్థాయిలో అసమతౌల్యత ఉంటుందని రీసెర్చ్ సంస్థ రైస్టాడ్ ఎనర్జీ అంచనా.

### డిమాండ్‌కి మించి సరఫరా!

కరోనా వైరస్ వ్యాప్తితో చమురు డిమాండ్, ధరలపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. దీంతో ఉత్పత్తి తగ్గించుకోవాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే, దీని వల్ల అమెరికన్ సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందనే ఉద్దేశంతో, తన మార్కెట్ వాటాను కాపాడుకునేందుకు రష్యా అంగీకరించలేదు. ఇది సౌదీ అరేబియాకు ఆగ్రహం తెప్పించింది. దీంతో ఉత్పత్తిని భారీగా పెంచేసి రేట్లను తగ్గించేయడం ద్వారా ధరలపరమైన పోరుకు తెరతీసింది. అప్పట్నుంచి రేట్ల పతనం మొదలైంది. రేట్లు పడిపోవడంతో చాలా దేశాలు చౌకగా చమురు కొనుగోళ్లకు ఎగబడి నిల్వ చేసుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చమురు స్టోరేజీలో సగటున 79 శాతం దాకా నిండుగా ఉందని అంచనా. 7.4 బిలియన్ బ్యారెళ్ల చమురు, తత్సంబంధ ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని.. ఇవి కాకుండా 1.3 బిలియన్ బ్యారెళ్లు రవాణాలో ఉన్నాయని పరిశ్రమవర్గాలు తెలిపాయి.




### 2020లో గరిష్ట.. కనిష్టాలు...

నిజానికి 2020 తొలి మూడు నెలల్లోనే అంతర్జాతీయంగా క్రూడ్ ధర భారీ ఎగువ, దిగువ స్థితులను చూడ్డం గమనార్హం. అంతక్రితం మూడు నెలల నుంచీ క్రూడ్ ధర అప్‌ట్రెండ్‌లోనే ఉంది. జనవరిలో అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ మేజర్ జనరల్ ఖాసిం సులేమానీ మరణించడం, ఆ తర్వాత భౌగోళిక ఉద్రిక్త పరిణామాలు చోటుచేసుకోవడంతో ముడిచమురు రేటు ఒక్కసారిగా ఎగిసింది. అప్పటికి 52 వారాల గరిష్ట స్థాయిని తాకింది. అయితే ఆ వెంటనే.. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు, క్రూడ్ ఉత్పత్తికి భయంలేదన్న సంకేతాలు.. తత్సంబంధ పరిణామాలతో క్రమంగా చల్లారింది. అటు తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావంతో క్రూడ్ ధర మరికొంత చల్లారగా, రష్యా–సౌదీ అరేబియాల మధ్య మార్చి మొదటి వారంలో చోటుచేసుకున్న 'ధరల యుద్ధం'తో 19 సంవత్సరాల కనిష్టానికి పడిపోయింది. ఈ మూడు నెలల కాలంలో ధరల పరిస్థితిని చూస్తే, అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్లో నైమెక్స్ లైట్ స్వీట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 66.6–19.27 డాలర్ల గరిష్ట, కనిష్ట స్థాయిలను చూడగా, బ్రెంట్ క్రూడ్ ధర 75.6–21.65 డాలర్ల గరిష్ట, కనిష్ట స్థాయిల్లో తిరుగాడాయి. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సెలవు రోజు కాగా, గురువారం ట్రేడింగ్‌లో నైమెక్స్ లైట్ స్వీట్ క్రూడ్ ధర 23.21 డాలర్ల వద్ద ముగియగా, బ్రెంట్ 31.82 డాలర్ల వద్ద ఉంది. తాజా డీల్ నేపథ్యంలో సోమవారం ట్రేడింగ్ సందర్భంగా క్రూడ్ ధరలు భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ఇన్వెస్టర్లకు మార్గదర్శి.. 'ఐప్రుటచ్'

**హైదరాబాద్:** డిజిటల్ విధానంలో ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు మార్కెట్ గురించి ఫండ్ మేనేజర్ల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్‌కు చెందిన ఐప్రుటచ్ (IPRUTOUCH) యాప్ ఇన్వెస్టర్లకు ఉపయోగపడనుంది. ఇప్పటికే ఈ యాప్‌ను ఐదు లక్షల మందికి పైగా ఇన్వెస్టర్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్టు ఈ సంస్థ ప్రకటించింది. ఉత్పత్తుల సమాచారం, తమ లక్ష్యాలకు అనుగుణంగా ఎంత మేర పెట్టుబడులు చేసుకోవచ్చో తెలియజేసే క్యాలికులేటర్లు, పెట్టుబడుల సమీక్ష, నివేదికలు ఇలా పలు రకాల సేవలకు ఈ యాప్ వేదికగా ఉంటుందని పేర్కొంది.

### షుగర్ బాక్స్‌లో జీ పెట్టుబడులు

**న్యూఢిల్లీ:** జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ తన అనుబంధ సంస్థ, మార్గో నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.522 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నది. ఈ పెట్టుబడుల ప్రతిపాదనకు తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. మార్గో నెట్‌వర్క్స్ కంపెనీ షుగర్ బాక్స్ బ్రాండ్ కింద కంటెంట్ డిస్ట్రిబ్యూషన్ సర్వీసులనందిస్తోంది.

### అందరికీ ప్రీపెయిడ్ నో: టెల్కోలు

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ వేళ అల్పాదాయ ప్రీ–పెయిడ్ యూజర్లకు అందిస్తున్న ప్రయోజనాలను అన్నివర్గాల ప్రీ–పెయిడ్ యూజర్లకు వర్తింపచేయాలన్న టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ సూచనపై టెల్కోలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇప్పటికే ఈ ఆఫర్ కింద రూ. 600 కోట్ల విలువ చేసే ప్రయోజనాలు అందిస్తున్నామని .. ప్రీపెయిడ్ కస్టమర్లందరికీ వర్తింపచేయాలనడం అసమంజసమని టెల్కోల సమాఖ్య సీవోఏఐ వ్యాఖ్యానించింది. రీచార్జి చేయించుకునే వీలు ఉండని అల్పాదాయ వర్గాలు లాక్‌డౌన్ సమయంలో కనెక్టివిటీ కోల్పోకూడదనే ఉద్దేశంతోనే తాము ఈ వెసులుబాటు కల్పిస్తున్నామని.. అందరికీ వర్తింపచేయాలంటే యూఎస్‌వో ఫండ్ నుంచి కొంత నిధులను వినియోగించాలని ట్రాయ్, కేంద్రాన్ని సీవోఏఐ కోరింది.

### సొనాలికా ఐసోలేషన్ సెంటర్

**హైదరాబాద్:** ప్రముఖ ట్రాక్టర్స్ బ్రాండ్ సొనాలికా ట్రాక్టర్స్ కరోనా చికిత్స నిమిత్తం అవసరమైన ఐసోలేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ ఆసుపత్రిలో 29 ఐసోలేషన్ గదులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆసుపత్రి సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ)లను, ప్రతి గదిలో ఎయిర్ కండిషనర్, టీవీ, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్‌లతో పాటూ ప్రతి రోజూ ఆయా గదులన్నీ శానిటైజేషన్ చేస్తామని కంపెనీ పేర్కొంది.

### వచ్చేవారం 'ఐటీ' ఫలితాలు

**న్యూఢిల్లీ:** సాఫ్ట్‌వేర్ దిగ్గజం టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) గత ఆర్థిక సంవత్సరం (2019–20) నాలుగో త్రైమాసిక(క్యూ4) ఆర్థిక ఫలితాలను ఈ నెల 16న వెల్లడించనుంది. ఆ రోజు జరిగే సమావేశంలో గత ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్‌ను (ఒకవేళ ఇవ్వాలనుకుంటే), కూడా కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ రికమెండ్ చేసే అవకాశాలున్నాయి. కాగా ఈ నెల 15న మరో ఐటీ కంపెనీ విప్రో తన గత ఆర్థిక సంవత్సరం క్యూ4 ఫలితాలను వెల్లడించనున్నది. భారత ఐటీ కంపెనీలకు జనవరి–మార్చి క్వార్టర్ బలహీనంగా ఉండనున్నదని షేర్‌ఖాన్ బై బీఎన్‌పీ పారిబా ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 11-4-2020

| | |
|---|---|
| విశాఖ | 345-00 |
| చిత్తూరు | 443-00 |
| వరంగల్ | 368-00 |
| గోదావరి | 345-00 |
| విజయవాడ | 345-00 |
| 10-4-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 365-00 |

# అమెరికా–చైనా మధ్య మళ్లీ చిచ్చు!

## చైనా టెలికంను నిషేధిస్తామంటూ అమెరికా హెచ్చరిక

**వాషింగ్టన్:** కరోనా వైరస్ అమెరికాను తీవ్ర ఇక్కట్ల పాలు చేస్తున్న సమయంలో చైనాపై అగ్రరాజ్యం మరోసారి కన్నెర్ర చేసింది. అమెరికా మార్కెట్లో మొబైల్ సేవలు అందిస్తున్న 'చైనా టెలికం (అమెరికా)'ను నిషేధిస్తామంటూ హెచ్చరించింది. భద్రత, న్యాయపరమైన ముప్పు ఉందంటూ అమెరికా న్యాయ శాఖ పేర్కొంది. చైనాలో రెండో అతిపెద్ద టెలికం కంపెనీ అయిన 'చైనా టెలికం' సబ్సిడరీయే చైనా టెలికం (అమెరికా). అమెరికా నుంచి, ఇతర దేశాల నుంచి అమెరికాకు టెలికమ్యూనికేషన్ సర్వీసులకు ఇచ్చిన అన్ని అనుమతులను రద్దు చేయాలంటూ అమెరికా న్యాయ, రక్షణ, అంతర్గత భద్రత (హోం), వాణిజ్య శాఖలు ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (ఎఫ్‌సీసీ)ను కోరాయి. కీలక శాఖల డిమాండ్‌ను ఎఫ్‌సీసీ ఆమోదిస్తే కోట్లాది అమెరికన్ల ఫోన్ సేవలకు విఘాతం ఏర్పడనుందన్నది విశ్లేషకుల అంచనా.




**వ్యతిరేకించిన చైనా**

అమెరికా చర్యలను చైనా వ్యతిరేకించింది. ''అమెరికా మార్కెట్ విధానాలకు కట్టుబడి ఉండాలని కోరుతున్నాం. వాణిజ్య విషయాలను రాజకీయం చేయడం, జాతీయ భద్రతను ఊతపదంగా వాడడాన్ని ఆపేయాలి. అలాగే, అనుచితంగా చైనా కంపెనీలను అణచివేసే విధానాలను కూడా నిలిపివేయాలి'' అంటూ చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జావోలిజియాన్ ప్రకటన విడుదల చేశారు.

# కరోనాతో ఏవియేషన్ కుదేలు..

- మార్చి, జూన్ త్రైమాసికాల్లో నష్టాల భారం
- రూ. 6,500 కోట్ల దాకా ఉండొచ్చని అంచనా
- ఫ్లయిట్ల రద్దు, డిమాండ్ తగ్గుదల కారణం



**ముంబై:** కరోనా వైరస్ వ్యాప్తి పరిణామాలతో దేశీ విమానయాన రంగం కుదేలవుతోంది. లాక్‌డౌన్ దెబ్బతో దాదాపు రెండు వారాలుగా ఫ్లయిట్లు నిల్చిపోగా, ఇప్పట్లో విమాన సర్వీసులు ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మార్చి, జూన్ త్రైమాసికాల్లో అన్ని ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థల నష్టాలు సుమారు రూ. 5,800–6,500 కోట్ల దాకా ఉంటాయని అంచనా. మే, జూన్, జూలైల్లో దేశీయంగా ప్రయాణాలకు సంబంధించిన బుకింగ్స్ వార్షిక ప్రాతిపదికన చూస్తే 80 శాతం పడిపోయాయి. దీంతో ఎయిర్‌లైన్స్‌కు నిధులపరమైన సమస్యలు మరింత తీవ్రం కానున్నాయి.

**వ్యయాల భారం..**

ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా పలు ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం, వేతనాలు కుదించడం వంటి చర్యలు తీసుకున్నాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ సెక్యూరిటీస్ వర్గాలు తెలిపాయి. అయితే, లీజుకి సంబంధించిన అద్దెల చెల్లింపులు, ఇతరత్రా కార్పొరేట్ ఖర్చులు మొదలైన ఫిక్స్‌డ్ వ్యయాలు తప్పనిసరిగా ఉంటాయని పేర్కొన్నాయి. వచ్చే మూడు నెలల్లో ఇండిగో స్థిర వ్యయాలు రూ. 2,400–4,500 కోట్ల మేర ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే, దేశీయంగా అతి పెద్ద విమానయాన సంస్థగా ఎదిగిన ఇండిగోకి ఇది మరీ సమస్యాత్మకం కాకపోవచ్చన్న అభిప్రాయం ఉంది. గతేడాది డిసెంబర్ ఆఖరు నాటికి ఇండిగో వద్ద మిగులు నిధులు రూ. 9,412 కోట్లుగా ఉండటమే ఇందుకు కారణం. వీటి ఊతంతో ఇండిగో ఆరు నెలల నుంచి ఏడాది దాకా నిలబడగలదని అంచనా. అయితే, మరో ఎయిర్‌లైన్స్ స్పైస్‌జెట్ దగ్గర చెప్పుకోతగ్గ స్థాయిలో మిగులు నిధులు లేవు. మార్చి ఆఖరు నాటికి స్పైస్‌జెట్ చేతిలో ఉన్నది సుమారు రూ. 86 కోట్లే. మూడు నెలల పాటు నిలదొక్కుకోవాలంటే స్పైస్‌జెట్‌కు సుమారు రూ. 1,350 – 1,500 కోట్ల దాకా అవసరమవుతుంది. అటు వచ్చే మూడు నెలల్లో గోఎయిర్ స్థిర వ్యయాలు దాదాపు రూ. 500–750 కోట్లుగా ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి.

# ఎన్‌పీఎస్ నుంచి ఉపసంహరణ

## కరోనా వైరస్ చికిత్సకై 'పాక్షిక' వెసులుబాటు: పీఎఫ్‌ఆర్‌డీఏ



**న్యూఢిల్లీ:** జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) చందాదారులకు 'పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి సంస్థ'(పీఎఫ్‌ఆర్‌డీఏ) వెసులుబాటు కల్పించింది. ఎన్‌పీఎస్ చందాదారులు కరోనా వైరస్ బారిన పడి చికిత్స తీసుకోవాల్సి వస్తే ఖర్చుల కోసం ఎన్‌పీఎస్ నిధి నుంచి కొంత మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని తెలిపింది. కాగా, ఏపీవై చందాదారులకు ఇది వర్తించదు.

**ఈపీఎఫ్‌వో..ఉపసంహరణ రూ.280 కోట్లు**

కాగా, ఉద్యోగుల భవిష్యనిధి నుంచి పాక్షిక ఉపసంహరణకు అనుమతించడంతో.. ఇప్పటి వరకు రూ.280 కోట్ల విలువకు సంబంధించి 1.37 లక్షల క్లెయిమ్‌లను పరిష్కరించినట్టు ఈపీఎఫ్‌వో శుక్రవారం ప్రకటించింది. ఈపీఎఫ్ నిధిలో చందాదారుని వాటా మొత్తం నుంచి 75 శాతం లేదా మూడు నెలల మూలవేతనం, కరువు భత్యం ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు అనుమతి ఉంది.

**కోవిడ్–19 రక్షణ పాలసీల విక్రయం**

# ఐసీఐసీఐ లాంబార్డ్, గో డిజిట్, ఫ్లిప్‌కార్ట్ జట్టు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ (కోవిడ్–19)కు రక్షణ కల్పించే పాలసీలను అందించేందుకు గాను ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలు ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్ అయిన ఫ్లిప్‌కార్ట్‌తో చేతులు కలిపాయి. ఈ సంస్థల పాలసీలను ఫ్లిప్‌కార్ట్ తన ప్లాట్‌ఫామ్‌పై విక్రయిస్తుంది.



పాలసీదారులు కరోనా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే క్లెయిమ్ సులభంగా చేసుకోవచ్చని, ఆస్పత్రిలో చేరి తీసుకునే చికిత్స, ఐసీయూ అద్దె చార్జీలు, అంబులెన్స్ చార్జీలు, టెలీ కన్సల్టేషన్ చార్జీలను కూడా చెల్లించడం జరుగుతుందని ఈ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి.

- కోవిడ్–19 ప్రొటెక్షన్ కవర్ పేరుతో ఐసీఐసీఐ లాంబార్డ్ సంస్థ రూ.159 ప్రీమియంతో రూ.25,000 కవరేజీని ఆఫర్ చేస్తోంది.
- డిజిట్ ఇల్‌నెస్ గ్రూపు ఇన్సూరెన్స్ పాలసీలో వార్షికంగా రూ.511 ప్రీమియం చెల్లించి రూ.లక్ష బీమా కవరేజీని పొందొచ్చు.

# భవిష్యత్తులో కార్మికుల కొరత

- ఏఐఎంవో అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** పనిచేసిన ప్రాంతాలకు తిరిగి వెళ్లేందుకు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు అభద్రత, భయంతో ఉన్నారని ఆల్ ఇండియా మాన్యుఫ్యాక్చరర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎంవో) తెలిపింది. లాక్‌డౌన్ తదనంతర పరిణామాలే ఇందుకు కారణమని ఏఐఎంవో తన అధ్యయనంలో వివరించింది. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కార్మికులపై కరోనా వైరస్ ప్రభావం ఏ మేరకు ఉందనే అంశంపై ఈ అధ్యయనం సాగింది. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కార్మికుల్లో అత్యధికులు ఇంకా వారు పని చేస్తున్న ప్రాంతాల్లోనే ఉన్నారని, లాక్‌డౌన్ ఎత్తివేయగానే వారి స్వస్థలాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపింది. ఇదే జరిగితే రానున్న రోజుల్లో దేశంలో కార్మికుల కొరత ఏర్పడుతుందని హెచ్చరించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో వలస కార్మికులు వందలాది కిలోమీటర్ల దూరంలోని వారి స్వస్థలాలకు నడక సాగించిన సంగతి తెలిసిందే.



# ఏడీబీ ప్యాకేజీ రూ.16,500 కోట్లు

## భారత్‌కు హామీ

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిపై పోరుకు భారత్‌కు తోడ్పాటునందించేందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) రూ.16,500 కోట్లు (220 కోట్ల డాలర్లు) ప్యాకేజీని ఇవ్వనుంది. ఈ మేరకు భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏడీబీ ప్రెసిడెంట్ మసత్సు అసకవ అభయమిచ్చారు. నిర్మలా సీతారామన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి భారత ప్రభుత్వం గట్టి ప్రయత్నాలే చేస్తోందని ఆయన ప్రశంసించారు.

**ఆరోగ్యరంగానికి తక్షణ సాయం...**

భారత అత్యవసరాలను తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.




ఆరోగ్య రంగానికి తక్షణ సాయంగా రూ.16,500 కోట్ల ప్యాకేజీని సిద్ధం చేస్తున్నామని, కరోనా కల్లోలంతో కష్టాలు పడుతున్న పేదలు, అసంఘటిత రంగ కార్మికులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు, ఆర్థిక రంగానికి కూడా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తక్షణ సాయం, విధానపరమైన రుణాలివ్వడం, బడ్జెట్ తోడ్పాటునందించడం... పలు అంశాలపై కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

# పెయిడ్ లీవ్ మొత్తాలను చెల్లించండి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** లాక్‌డౌన్ నేపథ్యంలో పెయిడ్ లీవ్ మొత్తాలను తిరిగి కంపెనీలకు చెల్లించాలని (రీఇంబర్స్) నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కాం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. నాస్కాం పలు సూచనలతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రం సమర్పించింది. 2020–21 సంవత్సరానికి బోనస్ చెల్లింపుల నుంచి ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలను మినహాయించాలని విన్నవించింది. వర్క్ ఫ్రం హోమ్ కోసం కంపెనీలు చేస్తున్నవ్యయాలను వ్యాపార ఖర్చులుగా పరిగణించాలని కోరింది. పెయిడ్ లీవ్ వ్యయాలను తిరిగి చెల్లించినట్టయితే కంపెనీలకు ఆర్థిక భారం ఉండదని, తద్వారా ఉద్యోగాల కోత ముప్పు నుంచి బయటపడవచ్చని వివరించింది. ఆదాయపు పన్నును 22 నుంచి 15 శాతానికి కుదించాలని వినతి పత్రంలో తెలిపింది. అలాగే జీఎస్టీ రేటు 18 నుంచి 5కు చేర్చాలని వివరించింది.

# క్యాబ్... రివర్స్ గేర్!

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** క్యాబ్ పరిశ్రమను కరోనా వైరస్ కబళిస్తోంది. లాక్‌డౌన్ నేపథ్యంలో క్యాబ్ బుకింగ్స్ లేకపోవటం, ఉద్యోగుల వేతనాల చెల్లింపులు, డ్రైవర్లను ఆదుకోవటం, కార్ల నిర్వహణ వంటివి కంపెనీలకు పెను భారమవుతున్నాయి. లాక్‌డౌన్ తర్వాత కూడా కొన్నాళ్ల పాటు గతంలో మాదిరి క్యాబ్స్ బుకింగ్స్ ఉండవన్నది పరిశ్రమ వర్గాల అంచనా. దీంతో నిర్వహణ భారాన్ని భరించలేమని, తాము కొనసాగటం కష్టమేనని హైదరాబాద్ కేంద్రంగా సేవలందిస్తున్న క్యాబ్ అగ్రిగేట్ కంపెనీలు చెబుతున్నాయి.

నిజానికిపుడు మొబిలిటీ అనేది రోజు వారి అవసరాల్లో భాగం. లాక్‌డౌన్ పూర్తయ్యాక పరిశ్రమ రికవరీ అయ్యే దశలో చాలా మార్పులు చోటు చేసుకోవచ్చు. ఆ పరిస్థితులు తాము భరించలేని స్థాయిలో ఉంటాయని హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న ప్రైడో, టోరా, యూటూ, రైడ్‌ఈజీ వంటి క్యాబ్ అగ్రిగేట్ కంపెనీలు అభిప్రాయపడుతున్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆయా కంపెనీలకు సుమారు రూ.200 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. ఓలా, ఉబర్‌లు షేరింగ్ సర్వీస్‌ల్ని నిలిపేశాయి. హైదరాబాద్‌లో తమకున్న 15వేల లీజు వాహనాలను గోదాములకే పరిమితం చేసినట్లు 'ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్' నేషనల్ జనరల్ సెక్రటరీ షేక్ సలావుద్దీన్ చెప్పారు. లాక్‌డౌన్ ఉన్నన్ని రోజులు లీజు వాహనాల ఈఎంఐ చెల్లించాల్సిన అవసరం లేదని.. లాక్‌డౌన్ పూర్తయ్యాక ఎవరి నంబర్ ప్లేట్ వాహనాలను ఆయా డ్రైవర్లకే అందిస్తామని ఓలా ప్రతినిధి తెలిపారు.



**లాక్‌డౌన్ తర్వాత పరిస్థితేంటి?**

లాక్‌డౌన్ ఎత్తేసినా గతంలో మాదిరి పెద్ద సంఖ్యలో బుకింగ్స్ ఉండవని ఓలా మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ ఆనంద్ సుబ్రహ్మణ్యం అంచనా వేశారు. నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునేందుకు కొన్నాళ్ల పాటు కంపెనీలు వర్క్ ఫ్రం హోమ్‌కే ప్రాధాన్యమిస్తాయని, వైరస్ భయంతో కస్టమర్లు గతంలో మాదిరి షాపింగ్ మాల్స్, థియేటర్లు వంటి చోట్లకు ఎక్కువ వెళ్లరని పేర్కొన్నారు. కార్ పూలింగ్, వ్యక్తిగత వాహనాల వాడకానికే ప్రాధాన్యమిస్తారని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ పికప్, డ్రాప్ వాహనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని.. అందుకే ఓలా, ఉబర్ వంటివి సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసి ఆయా వాహనాల్ని పూర్తిగా శానిటైజ్ చేస్తే తప్ప కస్టమర్లలో నమ్మకాన్ని తీసుకురాలేమని సల్లావుద్దీన్ తెలిపారు.

- కొనసాగించటం కష్టమంటున్న స్థానిక కంపెనీలు
- లాక్‌డౌన్ తర్వాతా కోలుకునే అవకాశాలు తక్కువే
- కార్ల సంఖ్యను తగ్గించే క్రమంలో ప్రధాన కంపెనీలు
- లీజు వాహనాలన్నీ గ్యారేజ్‌కే పరిమితం చేసిన ఓలా

### వేతనాలు, ఉద్యోగుల తగ్గింపు కూడా..

డ్రైవర్లు కాకుండా దేశవ్యాప్తంగా క్యాబ్ పరిశ్రమలో 15 వేల మంది ఉద్యోగులుంటారు. క్యాబ్స్ తిరగడం లేదు కనక వారి వేతనాల్లో 20 శాతం వరకు కోత పెట్టినట్లు తెలిసింది. దేశంలో 5 వేల మంది ఉద్యోగులున్న ఓ ప్రధాన క్యాబ్ కంపెనీ తమ ఉద్యోగుల వేతనాల్లో 15 శాతం కోత విధించింది. లాక్‌డౌన్ తర్వాత కూడా వ్యాపారం తగ్గుతుందన్న అంచనాతో ముందే అవి ఉద్యోగుల్ని తగ్గిస్తున్నాయి. జూబ్లీహిల్స్ ప్రధాన కేంద్రంగా ఉన్న ఓ క్యాబ్ కంపెనీలో 150 మంది ఉద్యోగులుండగా వారి సంఖ్యను సగానికి తగ్గించినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. తాత్కాలికంగా సేవలను నిలిపివేసే యోచనలో ఉన్నామని.. పరిశ్రమ మళ్లీ పుంజుకున్నాక.. రీబ్రాండ్‌తో మార్కెట్లోకి వస్తామని చెప్పారాయన.

# సగం తగ్గనున్న ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు!

**న్యూఢిల్లీ:** దేశంలో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ రంగంలో అమ్మకాలు ఏప్రిల్–జూన్ కాలంలో 50 శాతం తగ్గుతాయని ప్యానాసోనిక్ అంచనా వేస్తోంది. తిరిగి పండుగల సీజన్లో విక్రయాలు గాడిన పడతాయని కంపెనీ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ మనీశ్ శర్మ తెలిపారు. మార్చిలో 35 శాతం సేల్స్ తగ్గాయని చెప్పారు. లాక్‌డౌన్ తర్వాత సరఫరాతోపాటు డిమాండ్ సవాళ్లూ పరిశ్రమకు ఎదురవుతాయని వెల్లడించారు. ఫిబ్రవరి నుంచే విడిభాగాల సమస్యను ఎదుర్కొంటున్నట్టు వివరించారు. విడిభాగాల కోసం ప్రధానంగా చైనాపై ఆధారపడ్డామని, ఇదే ఉత్పత్తి సమస్యకు మూలమని గుర్తు చేశారు.

# పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ అమ్మకాలు: ఏఐఎంఏఐ

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పూర్తి స్థాయి ఆన్‌లైన్ అమ్మకాలకు అనుమతించాలని ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఐఎంఏఐ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. తయారీదార్లు, విక్రేతల నుంచి ఉత్పత్తులు నేరుగా 19,000 పిన్‌కోడ్స్ ప్రాంతాల్లోని 10 కోట్ల మంది కస్టమర్లకు చేరవేస్తామని తెలిపింది. తద్వారా రిటైల్ దుకాణాలకు కస్టమర్ల రాక భారీగా తగ్గుతుందని, సామాజిక దూరం పాటించినట్టు అవుతుందని స్పష్టం చేసింది.



## మూగజీవాలకూ రక్షణ..

కరోనా వైరస్ నుంచి తమ జీవాలను రక్షించుకునేందుకు గొర్రెల కాపరులు వినూత్నంగా ఆలోచించారు. జగిత్యాల జిల్లా కేంద్రం సమీపంలో ఉండే కాపరులు తమ గొర్రెలకు మాస్కులు కట్టడంతోపాటు వాటిపై సున్నం కలిపిన నీళ్లను పిచికారీ చేశారు. ఇంటి నుంచి ఊరు దాటే వరకు గొర్రెలకు మాస్కులు ఉంచుతున్న కాపరులు.. మేత కోసం తొలగిస్తున్నారు. మళ్లీ ఇంటి కొచ్చే సమయంలో మాస్కులు కడుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జగిత్యాల



## రూ.15 వేల పొట్టేలు మరి

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన గొర్ల కాపరి బండి మల్లయ్య రూ.15 వేలతో పొట్టేలు కొనుగోలు చేశాడు. విలువైనది కావడం.. కరోనా వైరస్ సోకుతుందేమోనన్న భయంతో ఇలా మాస్కు పెట్టి తీసుకెళ్తుండటం విశేషం.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



## మాస్కులు తయారు చేసిన కేంద్ర మంత్రి భార్య

తన సతీమణి కావ్య మాస్కులు తయారుచేసి, వాటిని పంపిణీ చేసిన చిత్రాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తన సతీమణి సమయాన్ని సద్వినియోగం చేస్తూ, ఇంట్లోనే మాస్కులు తయారు చేసి, వాటిని అవసరం ఉన్నవారికి అందించారని తెలిపారు. ఈ ట్వీట్‌కు కేంద్ర మంత్రులు ప్రకాష్ జవదేకర్, బాబుల్ సుప్రియో, అనురాగ్ ఠాకూర్, కిరెన్ రిజిజు, బాలీవుడ్ నటులు అనుపమ్ ఖేర్, అక్షయ్ కుమార్, కవి కుమార్ విశ్వాస్, ఢిల్లీకి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే ఎడిటర్ గౌరవ్ సావంత్, టాలీవుడ్ సినీ ప్రముఖులు పవన్ కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్, సమంతను ట్యాగ్ చేశారు. ఇలాగే ప్రతి కుటుంబం తమకు సాధ్యమైనంతలో ఇతరులకు సహాయం అందించేందుకు ముందుకు రావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

– సాక్షి, న్యూఢిల్లీ



## సమాజసేవలో మెగాస్టార్ తల్లి

మేము సైతం అంటూ ప్రతి ఒక్కరూ కరోనాను ఎదుర్కొనేందుకు మానవత్వాన్ని చూపుతూ ముందుకు వస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి కూడా కరోనాపై పోరులో తాను సైతం అంటూ ముందుకు వచ్చారు. ఆమె గత 3 రోజులుగా తన స్నేహితురాళ్లతో కలిసి 700 మాస్కులు కుట్టారు. వీటిని అవసరమైన వారికి అందజేస్తున్నారు. తన వృద్ధాప్యాన్ని కూడా లెక్క చేయకుండా ఆమె సమాజం కోసం తనవంతు బాధ్యతను నెరవేరుస్తున్నారు. సమాజం పట్ల ఆమె చూపుతున్న బాధ్యతకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.

– బంజారాహిల్స్

## ‘100 మందికి మాస్కులు పంపిణీ చేయండి’



సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి విధిగా ప్రతీ ఒక్కరు మాస్కులు ధరించాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రంలోని వీఆర్వోలు తమ పరిధిలోని 100 మంది నిరుపేదలకు మాస్కులను అందించాలని రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు విజ్ఞప్తి చేశారు.

## 120 కిలోమీటర్లు.. భార్యతో సైకిల్‌పై ఆస్పత్రికి!

సాక్షి, చెన్నై: కట్టుకున్న భార్య కేన్సర్‌తో విలవిలలాడుతుంటే తట్టుకోలేకపోయాడు. భార్యను రక్షించుకోవాలన్న అతని తపన ముందు దూరం, వయోభారం ఏమాత్రం అడ్డురాలేదు. 65 ఏళ్ల వయసులో 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి భార్యను సైకిల్‌పై తీసుకెళ్లాడు. తమిళనాడులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తంజావూరు జిల్లా కుంభకోణంకు చెందిన అరివలగన్ ఓ రైతు. ఇతని భార్య మంజుల (60) కేన్సర్‌తో బాధపడుతోంది. తరచూ ఆమెకు కిమో థెరపీ అందించాల్సి ఉంది. లాక్‌డౌన్ అమలులో ఉండటంతో బస్సులు లేవు. ప్రైవేటు అంబులెన్సుకు చెల్లించుకునే స్తోమత లేదు. దీంతో మంగళవారం వేకువ జామున ఇంటి నుంచి సైకిల్‌పై భార్యను ఎక్కించుకుని పుదుచ్చేరిలోని జిప్మర్‌కు బయలుదేరాడు. ఒక పగలు, ఒక రాత్రి సైకిల్ మీద పయనం సాగించి బుధవారం ఉదయానికి చేరుకున్నాడు. వైద్య నివేదికలు దగ్గర ఉంచుకోవడంతో దారిలో ఎక్కడా పోలీసులు ఇబ్బందులు పెట్టలేదు. జిప్మర్ వైద్యులు మంజులకు వైద్య పరీక్షలు జరిపి, కీమో థెరపీ అందించారు. అరివలగన్‌కు భార్యపై ఉన్న ప్రేమను చూసి చలించిన జిప్మర్ వైద్యులు గురువారం సాయంత్రం అంబులెన్స్‌లో ఆ జంటను కుంభకోణంకు పంపించారు.

## ఇళ్లలోనే గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

ప్రతి ఏటా గుడ్‌ఫ్రైడే రోజు రాష్ట్రంలోని ప్రముఖ చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడతాయి. వేల సంఖ్యలో క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఏసు క్రీస్తు సిలువలో మరణించిన రోజును గుర్తు చేసుకుంటూ ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. కానీ లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ సారి చర్చిలన్నీ మూతపడ్డాయి. క్రైస్తవులందరూ తమ తమ ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో చాలా మంది క్రిస్టియన్లు తమ ఇళ్లలోనే గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేసుకున్నారు. చర్చిల్లో ఫాదర్లు, పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వివిధ సామాజిక మాధ్యమాలు, టీవీ చానల్స్ లైవ్ ద్వారా అందించారు.

- రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్)



హైదరాబాద్‌లోని సెంటినరీ మెథడిస్ట్ చర్చ్‌లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్

# ‘ఖాకీ’ కన్నుగప్పలేరు!

**హోంక్వారంటైన్ల నిఘాకు పోలీసుల కొత్త పద్ధతి**

- అనుమానితుల ఫోన్లలో ప్రత్యేక యాప్
- దాన్ని తొలగించినా కదలికలపై టీఎస్‌కాప్ ద్వారా పర్యవేక్షణ
- కంటైన్‌మెంట్ క్లస్టర్లలో మరింత పకడ్బందీగా...

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా హోంక్వారంటైన్లలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. విదేశాల నుంచి వచ్చిన వారు, ప్రభుత్వ ఐసోలేషన్ వార్డుల్లో చికిత్స పొందినవారు, హోంక్వారంటైన్లలో ఉన్న వారిపై సాంకేతిక సాయంతో ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. ముఖ్యంగా కరోనా కేసులు అధికంగా వెలుగుచూస్తున్న కంటైన్‌మెంట్ క్లస్టర్లలో ఈ నిఘాను మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందు కోసం ‘టీఎస్‌కాప్’లో ప్రత్యేక ఫీచర్‌ను చేర్చారు. ఎవరైతే హోంక్వారంటైన్లలో ఉంటారో.. వారి మొబైల్‌లో ప్రత్యేక యాప్‌ను పోలీసులు ఇన్‌స్టాల్ చేస్తారు. వారి ఇళ్లను ఇప్పటికే జియోట్యాగింగ్ చేశారు. ఈ తరహాలో జియోట్యాగింగ్ చేసిన ఇళ్లు దాదాపు 70 వేల వరకుంటాయి. అతని మొబైల్‌కు పోలీసుల వద్ద ఉండే టీఎస్‌కాప్ ట్యాబ్‌లకు కనెక్షన్ ఏర్పడుతుంది. దీంతో సదరు వ్యక్తి గడప దాటినా టీఎస్ కాప్‌లో అలర్ట్ వచ్చేస్తుంది.

**కొందరు డిలీట్ చేస్తున్నారు..**

కొందరు ఫారిన్ రిటర్నీస్, కరోనా అనుమానితులు యాప్ ఉంటే తమ ఉనికిని పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్న అసహనంతో యాప్‌లను అన్ ఇన్‌స్టాల్ చేస్తున్నారు. అయితే, వారు అన్ ఇన్‌స్టాల్ చేసినా.. వారి కదలికలను టీఎస్‌కాప్ ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూనే ఉంటుందని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కాబట్టి, హోంక్వారంటైన్లంతా ఖాకీ కన్నుగప్పి పోలేరని స్పష్టం చేశాయి. ముఖ్యంగా ప్రభుత్వం గుర్తించిన 130 కరోనా కంటైన్‌మెంట్ క్లస్టర్లలో ఈ నిఘాను పోలీసులు మరింత సమర్థంగా కొనసాగిస్తున్నారు.




**వయొలేషన్ ట్రాకింగ్ యాప్..**

లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి 3 కిలోమీటర్ల నిబంధనలను పట్టించుకోకుండా బయటికి వస్తున్న పౌరులపై కేసులు పెట్టేందుకు పోలీసుశాఖ సరికొత్త యాప్‌ను అభివృద్ధి చేసింది. బయటికి వచ్చిన పౌరుల ఆధార్/ఫోన్ నంబరు/ ఇతర గుర్తింపు కార్డులను సేకరిస్తారు. జీపీఎస్ ద్వారా పనిచేసే ఈ యాప్‌లో సదరు వాహనదారుడు 3 కిలోమీటర్లు దాటి ప్రయాణం చేస్తే.. పోలీసులను వెంటనే అప్రమత్తం చేస్తుంది. వెంటనే అతని వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసులు పెడతారు. పోలీసులు ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నిషన్ ద్వారా 3 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించిన వాహనాలపై కేసులు నమోదు చేస్తోన్న విషయం తెలిసిందే.

## పోలీసులకు మెగాస్టార్ చిరంజీవి అభినందనలు



సాక్షి, హైదరాబాద్: లాక్‌డౌన్‌ను విజయవంతంగా అమలు చేస్తోన్న రాష్ట్ర పోలీసులను మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. పోలీసుల సేవలను కీర్తిస్తూ చిరంజీవి శుక్రవారం ట్విట్టర్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. కరోనా మహమ్మారిని అరికట్టే యత్నంలో లాక్‌డౌన్ కోసం పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆ వీడియోలో పేర్కొన్నారు. వారి కృషి వల్లే కరోనా అదుపులోకి వచ్చిందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిద్రాహారాలు మానేసి రాత్రింబవళ్లు కష్టపడుతున్న పోలీసులకు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు చేస్తోన్న ఈ కృషికి ఒక పోలీసు బిడ్డగా వారికి చేతులెత్తి సెల్యూట్ చేస్తున్నానని ముగించారు. ఈ ట్వీట్‌పై డీజీపీ మహేందర్‌రెడ్డి స్పందించారు. పోలీసు బిడ్డగా చిరంజీవి పలికిన మాటలు తమ శాఖలో ఎంతో స్ఫూర్తిని నింపాయని, కరోనాపై చేస్తోన్న యుద్ధంలో ప్రతి ఒక్కరూ కలిసి వచ్చేలా ఆయన మాటలు దోహదం చేస్తాయని డీజీపీ అభివర్ణించారు.

## రోడ్డుపై ఉమ్మేసిన వ్యక్తి అరెస్టు



దామెర: వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామంలో రోడ్డుపై ఉమ్మి వేసినందుకు శుక్రవారం ఓ కేసు నమోదైంది. వరంగల్‌కు చెందిన కొప్పుల మొగిలి పరకాల నుంచి హన్మకొండకు ఆటోలో బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని ఊరుగొండ స్టేజీ వద్ద ఆటో నిలపగా.. మొగిలి రోడ్డుపై ఉమ్మివేశాడు. అక్కడే వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై యు.భాస్కర్‌రెడ్డి ఈ విషయాన్ని గుర్తించి మొగిలిపై ఐపీసీ 188, 269 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా, రోడ్డుపై ఉమ్మి వేసినందుకు నమోదైన ఈ కేసు రాష్ట్రంలోనే మొదటిదని తెలుస్తోంది.

### తుది నివేదిక రాకముందే

## పాజిటివ్ రోగి డిశ్చార్జ్

**నాలిక్కరుచుకున్న ఛాతీ ఆసుపత్రి సిబ్బంది**

వెంగళరావునగర్: కరోనా వ్యాధి లక్షణాలు కలిగిన రోగికి పరీక్షలు చేసి తుది నివేదిక రాకముందే డిశ్చార్జ్ చేసిన సంఘటన ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో కరోనా వ్యాధిగ్రస్తులను ప్రత్యేక ఐసోలేషన్ వార్డులోనే ఉంచి పరీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నెగెటివ్ వచ్చిన వారిని ఎప్పటికప్పుడు డిశ్చార్జ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం కొత్తగూడెం డీఎస్పీ షేక్ ఆలీని డిశ్చార్జ్ చేశారు. వాస్తవానికి ఆయన శాంపిల్స్ రెండు గాంధీ ఆసుపత్రికి పంపారు.వాటిలో ఒకటి నెగెటివ్ రిజల్ట్ వచ్చింది. దీని ఆధారంగా ఆయనను తొలుత డిశ్చార్జ్ చేశారు. అయితే గురువారం రాత్రి ఆలస్యంగా రెండో శాంపిల్ రిజల్ట్ వచ్చింది. అందులో పాజిటివ్ అని తేల్చారు. దీనిని చూసిన ఆసుపత్రి సిబ్బంది అవాక్కై వెంటనే ఆయన కోసం గాలించారు.అప్పటికే ఆయన కొత్తగూడెంలోని తన నివాస గృహానికి చేరుకున్నట్టు తెలుసుకున్నారు. ఛాతీ ఆసుపత్రి వైద్య బృందం కొత్తగూడెం వెళ్లి ఆయనను తిరిగి నగరానికి తీసుకుని వచ్చి చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఘటనపై ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ మహబూబ్‌ఖాన్‌ను వివరణ కోరగా... డీఎస్పీ ఎస్ఎం ఆలీకి తొలి శాంపిల్ నెగెటివ్ వస్తేనే డిశ్చార్జ్ చేశామన్నారు. రెండో శాంపిల్ కొద్దిగా పాజిటివ్ వచ్చినట్టు కనిపించడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాము ఆయనను తిరిగి ఆసుపత్రికి పిలిపించామని, ఐసోలేషన్ వార్డులో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నట్టు చెప్పారు.

## లాక్‌డౌన్ మరికొంతకాలం పొడిగించాలి

- కరోనా తర్వాత వైద్య సదుపాయాల మీద దృష్టి
- పరీక్షల నిర్వహణపై సరైన సమయంలో నిర్ణయం
- ఏడాదికి పది రోజులు లాక్‌డౌన్ ఉంటే బాగుంటుంది
- ‘ఆస్క్ కేటీఆర్’ పేరిట ట్విట్టర్‌లో కేటీఆర్ సంభాషణ



సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు లాక్‌డౌన్ మరికొంత కాలం కొనసాగించాలనేది తన వ్యక్తిగత అభిప్రాయమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌లో ‘ఆస్క్ కేటీఆర్’పేరిట నిర్వహించిన సంభాషణలో శుక్రవారం పలువురు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు సమాధానం ఇచ్చారు. లాక్‌డౌన్ మూలంగా ప్రజల్లో స్వయం క్రమశిక్షణ ఏర్పడిందని, వైద్య సిబ్బంది, పోలీసులు, ఇతర రంగాలకు చెందిన వారిపై ప్రజల్లో గౌరవ భావం ఏర్పడిందన్నారు. గుర్తించిన హాట్‌స్పాట్లలో సామూహిక వైద్య పరీక్షలు చేయడం ద్వారా ఫలితం ఉంటుందని, వైరస్ కట్టడికి కృషి చేస్తున్న వారి బాగోగులు చూడాల్సిన అవసరం ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కరోనాకు వ్యాక్సిన్ దొరికేంత వరకు విదేశాలకు రాకపోకలపై సంపూర్ణ నిషేధం ఆచరణ సాధ్యం కాదన్నారు.

**అత్యుత్తమ సదుపాయాలపై దృష్టి**

కరోనా మహమ్మారి నుంచి ప్రపంచం బయటపడిన తర్వాత మరింత అత్యుత్తమ వైద్య మౌలిక సదుపాయాల వైపు దృష్టి సారించాల్సి ఉంటుందని కేటీఆర్ అన్నారు. ప్రస్తుత సంక్షోభం తర్వాత ప్రభుత్వాలు తమ ప్రాధాన్యతను మార్చుకొని వైద్య రంగానికి మరింత ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వాలకి ఒక కనువిప్పు లాంటిదని, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు ఈ విషయాన్ని గుర్తించాయన్నారు. సంక్షోభ సమయంలో పరీక్షల గురించి తల్లిదండ్రులు ఓపిక పట్టాలని, పరీక్షల షెడ్యూలుకు సంబంధించి ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం ప్రకటిస్తుందన్నారు.

**ఏడాదికి పది రోజుల లాక్‌డౌన్**

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఏటా పది రోజులు ప్రపంచ వ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటిస్తే బాగుంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత తరుణంలో రాజకీయాలకు అవకాశం లేదని, అధికారం ఉన్నందు వల్లే తాను ఎక్కువ మందికి సాయపడుతున్నట్లు వెల్లడించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. ప్రజలతో కనెక్ట్ అయ్యేందుకు సోషల్‌మీడియాలో ఎక్కువ సేపు అందుబాటులో ఉండటంతో నిద్రకు సమయం దొరకడం లేదన్నారు. లాక్‌డౌన్ మొదలైన రోజు నుంచి కేటీఆర్, ఆయన కార్యాలయం స్పందిస్తున్న తీరును ఈ సందర్భంగా పలువురు నెటిజన్లు అభినందించారు.

# గాంధీ X కార్పొరేట్

**ప్రకాశం జిల్లాకు చెందిన మహిళ మృతిపై వివాదం..**

- ఆ మహిళకు కరోనా పాజిటివ్.. సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి నుంచి చివరి నిమిషంలో గాంధీకి తరలింపు
- మహిళ మృతి.. గాంధీ వైద్యులు పట్టించుకోకపోవడం వల్లే: కార్పొరేట్ ఆస్పత్రి అంబులెన్స్ టెక్నీషియన్
- చనిపోయాకే తీసుకొచ్చారని ‘గాంధీ’ సూపరింటెండెంట్ వివరణ..

సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆసుపత్రి: కరోనా వైరస్‌తో మరో మహిళ మృతి చెందినట్లు తెలిసింది. శుక్రవారం ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన మరో మహిళ (54) హైదరాబాద్‌లో చనిపోయింది. అయితే, దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటనా రాలేదు. ఇదిలాఉండగా.. ఈమె మృతిపై వివాదం రేగింది. గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోకపోవడం వల్లే చనిపోయిందని కార్పొరేట్ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ టెక్నీషియన్ చెబుతుంటే.. చనిపోయిన తర్వాత శవాన్ని తీసుకొచ్చి అడ్మిట్ చేసుకొమ్మంటే ఎలా చేసుకుంటామని గాంధీ ఆస్పత్రి వర్గాలు ప్రశ్నించాయి. ప్రస్తుతం ఆమె మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి ప్రత్యేక బాక్స్‌లో భద్రపరిచారు.

**అసలేమైందంటే..?**

ఏపీలోని ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన మహిళ (54) కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో ఉంటున్న తన కుమారుడి ఇంటికి లాక్‌డౌన్‌కు ముందే వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెను చికిత్స కోసం ఇటీవల సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. కరోనా లక్షణాలు కన్పించడంతో వైద్యులు ఆమెను ఆస్పత్రి ఐసోలేషన్ వార్డుకు తరలించారు. రెండ్రోజుల క్రితం ఆమె నుంచి నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలకు పంపారు. ఆమెకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు శుక్రవారం ఉదయం రిపోర్టు వచ్చింది. అప్పటికే ఆమె పరిస్థితి పూర్తిగా విషమించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ఉండటం శ్రేయస్కరం కాదని, గాంధీ కరోనా నోడల్ కేంద్రానికి తీసుకెళ్లాల్సిందిగా ఆ ఆస్పత్రి వైద్యులు ఆమె కుమారుడికి సూచించారు. ఇందుకు ఆయన అంగీకరించడంతో ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌లోనే గాంధీకి తరలించారు. ఈ సమయంలో ఆమె వెంట అంబులెన్స్‌లో బంధువులెవరూ లేరు.

**పట్టించుకోకపోవడం వల్లే మృతి: అంబులెన్స్ టెక్నీషియన్**

గాంధీ వైద్యులు పట్టించుకోకపోవడం వల్లే రోగి మృతి చెందిందని కార్పొరేట్ ఆస్పత్రి అంబులెన్స్ టెక్నీషియన్ అన్నారు. ‘సికింద్రాబాద్‌లోని ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పేషెంట్‌ను తీసుకుని అంబులెన్స్‌లో బయలుదేరాం. మధ్యాహ్నం ఒంటిగంటకు గాంధీ ఆస్పత్రికి చేరుకున్నాం. 2.30 గంటల వరకు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో రోగి ఆయాసంతో బాధపడుతుండటంతో అప్పటికే సీపీఆర్ కూడా చేశాం. ఆస్పత్రి వైద్యులెవరూ రాకపోవడంతో రోగి తాలూకు మెడికల్ రిపోర్టులు తీసుకుని నేనే స్వయంగా డాక్టర్ వద్దకు వెళ్లాను. అటెండర్స్ ఎవరూ లేకుండా ఇలా ఎలా తీసుకొస్తారు..? పాజిటివ్ కేసును తీసుకురావడానికి మీరెవరూ? అంటూ ప్రశ్నించారు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉన్నాను. బాడీని తీసుకునేందుకు ఎవరూ రాకపోవడంతో అంబులెన్స్‌ను అక్కడే వదిలేసి వచ్చాం..’అని చెప్పారు.

**చనిపోయిన వారిని ఎలా అడ్మిట్ చేసుకుంటాం**

‘మధ్యాహ్నం 3 గంటలకు ఆస్పత్రికి అంబులెన్స్ చేరుకుంది. రోగిని తరలించేందుకు వార్డు బాయ్స్ వెంటనే అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. ఎలాంటి చలనం లేనట్లు గుర్తించారు. ఇదే అంశాన్ని డ్యూటీ డాక్టర్లకు చెప్పారు. వారు కూడా వెంటనే వచ్చి చూశారు. అప్పటికే ఆమె చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఇక్కడికెందుకు తీసుకొచ్చారని అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్లను సదరు వైద్యులు ప్రశ్నించగా, మెరుగైన వైద్యం కోసమే తమ ఆస్పత్రి యాజమాన్యం ఆమెను ఇక్కడికి పంపినట్లు వారు అంగీకరించినట్లు తెలిసింది. నిజానికి ఆమె ఆస్పత్రికి రాకముందే చనిపోయింది. చనిపోయిన వారి మృతదేహాలను ఆస్పత్రి ఐసోలేషన్ వార్డు ఎలా అడ్మిట్ చేసుకుంటాం? వారికేం వైద్యం చేస్తాం? కావాలనే ఆ కార్పొరేట్ ఆస్పత్రి సిబ్బంది మీడియాకు తప్పుడు సమాచారం ఇచ్చింది. ఒకవైపు మేం ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు చికిత్సలు అందిస్తుంటే.. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చనిపోయిన వారిని తీసుకొచ్చి.. ఇక్కడి వైద్యులను బదనాం చేయడం ఎంతవరకు సమంజసం? తప్పుడు సమాచారం ఇచ్చిన యాజమాన్యాలపైనే కాదు.. వాటిని ప్రసారం చేసిన మీడియా చానళ్లపై కూడా కేసులు పెట్టడానికి వెనుకాడబోం..’

–శ్రవణ్‌కుమార్, గాంధీ సూపరింటెండెంట్

# వేతనాల్లో కోత.. ఏఐసీటీఈ వాత!

**టెక్నికల్ టీచర్లకు శిక్షణ పేరుతో డబ్బులు చెల్లించాలంటూ నిబంధన**

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న వృత్తి, సాంకేతిక విద్యా కాలేజీల్లో పనిచేసే ఫ్యాకల్టీపై అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) శిక్షణ పేరుతో భారం మోపుతోంది. నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ (ఎన్ఐటీటీటీ) పేరుతో ఐదేళ్లలోపు సీనియారిటీ కలిగిన ప్రతి ఫ్యాకల్టీ శిక్షణ తీసుకోవాలని స్పష్టం చేసింది. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఏఐసీటీఈ ఇచ్చే ఆన్‌లైన్ శిక్షణను కచ్చితంగా తీసుకోవాలని పేర్కొంది. అయితే శిక్షణ పొందేందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నా ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో అధ్యాపకుడు రూ. 10 వేల చొప్పున చెల్లించడమే సమస్యగా మారిందని అధ్యాపకులు అంటున్నారు. అసలే కరోనా దెబ్బతో విద్యాసంస్థలు మూతపడటం, ఎక్కువ శాతం యాజమాన్యాలు 50 శాతం వేతనాలనే ఇవ్వగా, కొన్ని యాజమాన్యాలు అసలే వేతనాలు ఇవ్వని పరిస్థితుల్లో ఎలా శిక్షణ తీసుకుంటామని ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలోపు అనుభవం కలిగిన ప్రతి అధ్యాపకుడు ఎన్ఐటీటీటీ వెబ్‌సైట్‌లో రూ.2 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంది. ఇతర అధ్యాపకులు కూడా పదోన్నతుల కోసం ఈ శిక్షణ పొందవచ్చని పేర్కొంది. అధ్యాపకులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 30ని చివరి తేదీగా ప్రకటించింది. ఆ తరువాత శిక్షణలో పాల్గొనవచ్చని వివరించింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని, ఈ శిక్షణలో 8 మాడ్యూల్స్ ఉంటాయని, ఒక్కో మాడ్యూల్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. ఇలా 8 మాడ్యూల్స్‌కు రూ.8 వేలు అవుతుండగా, రిజిస్ట్రేషన్‌కు వెచ్చించిన రూ.2 వేలు కలుపుకొని మొత్తంగా రూ. 10 వేలు వెచ్చించాల్సి ఉంటుందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. ప్రస్తుత లాక్‌డౌన్ పరిస్థితుల్లో రాష్ట్రంలోని 90 వేల మంది అధ్యాపకుల్లో సరిగ్గా వేతనాలు లభించని 70 వేల మంది అధ్యాపకులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఉచిత శిక్షణ అని చెప్పి ఏఐసీటీఈ ఒక్కో ఫ్యాకల్టీ నుంచి ఇంత మొత్తం వసూలు చేయడం సరికాదంటున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.